బుధవారం
19-10-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 118
పేజీలు : 12, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పీడిత, తాడితుల గళం గుజ్జుల
నిజాం నిరంకుశంపై
పోరాడిన వీరనారి
ముజఫర్ అహ్మద్‌ది
సుదీర్ఘ జైలు
జీవితం
12లో

మోదీని సాగనంపుతాం

- వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఐక్యమవ్వాలి
- రూపాయి విలువ మరింత క్షీణత
- ఆర్థిక విధానాలు అస్తవ్యస్తం
- ప్రజాపోరాటాలు చేద్దాం
- సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-గురుదాస్ దాస్‌గుప్తా నగర్, విజయవాడ:
అసమర్థ విధానాలతో దేశాన్ని అధోగతి పాల్జేస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించే పోరాటంలో భారత కమ్యూనిస్టు పార్టీ కీలకపాత్ర పోషిస్తుందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పునరుద్ఘాటించారు. ఈ ప్రధాన లక్ష్య సాధన కోసం వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులను ఏకం చేస్తామని, అందులో సీపీఐ అగ్రభాగాన నిలుస్తుందని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, నియంతృత్వ విధానాలను నిరసిస్తూ రాబోయే రోజుల్లో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని రాజా ప్రకటించారు. గ్రామస్థాయి నుంచి ప్రజానీకాన్ని పోరాటం దిశగా మళ్లించాల్సిన అవసరం ఉందని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. విజయవాడ గురుదాస్ దాస్‌గుప్తా నగర్‌లో నాలుగు రోజులుగా జరిగిన సీపీఐ 24వ జాతీయ మహాసభలు మంగళవారం విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతో కలిసి రాజా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 14-18 తేదీల్లో వామపక్ష ఉద్యమాల పురిటిగడ్డ విజయవాడలో నిర్వహించిన పార్టీ జాతీయ మహాసభలు విజయవంతంగా ముగిశాయని చెప్పారు. 17 దేశాల నుంచి వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర ప్రతినిధులు హాజరయ్యారని వివరించారు. మహాసభల ఏర్పాట్లకు కృషి చేసిన ఆహ్వానసంఘ సభ్యులకు, ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల పార్టీ, ప్రజాసంఘాలు, వివిధ కమిటీల నేతలకు ధన్యవాదాలు తెలిపారు. దేశంలో నెలకొన్న ఆర్థిక, రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఒక దిశా, దశ నిర్మించాలనే లక్ష్యంతో మహాసభల్లో నిర్మాణాత్మక చర్చలు జరిగాయన్నారు. ఆరెస్సెస్-బీజేపీపైన, మోదీపైన రాజా విమర్శనాస్త్రాలు సంధించారు. మోదీ ప్రభుత్వంతో దేశానికి తీవ్ర ప్రమాదం పొంచి ఉందన్నారు. కేంద్రం అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక చర్యలపైనా సమగ్రంగా చర్చించామని, వివిధ రాజకీయ తీర్మానాలు ఆమోదించామని పేర్కొన్నారు. తనతోపాటు నూతనంగా ఎన్నికైన నేతలపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. రాబోయే రోజుల్లో ఆరెస్సెస్-బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై వీధివీధినా ప్రజలను చైతన్యవంతుల్ని చేసి, పోరాటాలు నిర్వహిస్తాన్నారు. ప్రధానంగా పేదలకు కూడు, గూడు, విద్య, వైద్యం, ఉద్యోగాల కల్పన కోసం దృష్టి సారిస్తామని చెప్పారు. ఇదే సమయంలో ప్రాంతీయ పార్టీలను కలుపుకుని ముందుకు పోతామన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ, లౌకికవాద పరిరక్షణకు మొదటి నుంచి సీపీఐ కట్టుబడి ఉందని, ఆ దిశగా పోరాటాలు కొనసాగిస్తోందన్నారు. మోదీ వినాశకర విధానాలతో దేశం పూర్తిగా సంక్షోభంలోకి వెళుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీది ప్రజా వ్యతిరేక, రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక ప్రభుత్వమని దుయ్యబట్టారు. అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. ఈడీ, సీబీఐ, ఐటీ తదితర కేంద్ర సంస్థలను పావుగా వినియోగిస్తూ ప్రతిపక్ష పార్టీలపై దాడులు చేయిస్తోందన్నారు. బీజేపీ ఆర్థిక విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలు రూపొందించాల్సిన అవసరముందన్నారు. కార్పొరేట్ వర్గాలకు కేంద్ర ప్రభుత్వం కొమ్ము కాస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అమ్ముతోందని ధ్వజమెత్తారు. దీంతో అంతరాలు పెరిగిపోతున్నాయని, ధనవంతులు మరింత ధనవంతులుగా-పేదలు మరింత పేదలుగా మారిపోతున్నారని చెప్పారు. రూపాయి విలువ నానాటికీ క్షీణిస్తోందని, అందుకు మోదీ సిగ్గుపడాల్సిన అవసరముందన్నారు. ఉక్రెయిన్, రష్యా యుద్ధంపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ దీనికి నాటో దేశాలే కారణమని రాజా స్పష్టంచేశారు. ఉక్రెయిన్‌కు అమెరికా ఆయుధాలు సరఫరా చేస్తూ యుద్ధానికి ఉసిగొల్పుతోందన్నారు. మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల ప్రజలపై మోయలేని భారం పడుతోందని, ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నమవుతోందన్నారు. అధికారంలోకి రాక ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ ప్రభుత్వం అమలు చేయలేకపోయిందని విమర్శించారు. ప్రధానంగా విద్య, వైద్య రంగాల అభివృద్ధి కొనసాగలేదని, నిరుద్యోగం విలయతాండవం చేస్తోందన్నారు.

ఆరెస్సెస్-బీజేపీ మతోన్మాద అజెండాను దేశ ప్రజలపై బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. దళిత, గిరిజన, కార్మికులు, రైతాంగ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీని గద్దె దించేందుకుగాను వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులను ఏకం చేస్తామని పునరుద్ఘాటించారు. ఆ దిశగా ప్రాంతీయ పార్టీలు సైతం ఏకమై మోదీని సాగనంపాలని పిలుపునిచ్చారు.

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా


డి.రాజా

గురుదాస్ దాస్ గుప్తా నగర్ (విజయవాడ) : భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శిగా డి.రాజా తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీపీఐ జాతీయ మహాసభలు మంగళవారం ఘనంగా ముగిశాయి. భారత కమ్యూనిస్టుపార్టీ జిందాబాద్, విప్లవం వర్ధిల్లాలి అంటూ నినాదాలతో గురుదాస్ దాస్ గుప్తా ప్రాంగణం మారుమ్రోగింది. మొత్తం 140 మందితో జాతీయ సమితి ఏర్పడగా, అందులో 11 మందితో కార్యదర్శివర్గం, 31 మందితో కార్యవర్గం ఎన్నికైంది. క్యాండిడేట్ సభ్యులుగా 13 మంది, శాశ్వత ఆహ్వానితులుగా ఇద్దరు, కంట్రోల్ కమిషన్ 11 మందితో ఏర్పాటైంది.


కనం రాజేంద్రన్

అతుల్‌కుమార్ అంజాన్

అమర్‌జిత్ కౌర్

సీపీఐ కార్యదర్శివర్గ సభ్యులు


కె.నారాయణ

బీకే కాంగో

వినయ్ విశ్వం

పల్లవ్‌సేన్ గుప్తా


నాగేంద్రనాథ్ ఓఝా

అజీజ్ పాషా

రామకృష్ణ పాండా

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు

కె. రామకృష్ణ

రావుల వెంకయ్య

అక్కినేని వనజ

అమరావతే ఏకైక రాజధాని

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టీకరణ
- రాజధాని రైతులకు సంఘీభావం
- కర్నూలు జిల్లాలో 25 కి.మీ. సాగిన భారత్ జోడో యాత్ర
- అపూర్వ స్వాగతం పలికిన గ్రామీణులు

3 లో

నేటి నుంచి ఏపీఈఏపీసెట్ తుది కౌన్సెలింగ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
రాష్ట్రంలోని ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకుగాను ఏపీఈఏపీసెట్-2022 తుది విడత కౌన్సెలింగ్‌కు కన్వీనర్ షెడ్యూలు జారీజేశారు. తొలి విడత కౌన్సెలింగ్‌లో మిగిలిపోయిన సీట్లను కలిపి తుది కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అభ్యర్థుల వివరాలు, ఫీజు చెల్లింపు, ధ్రువీకరణ పత్రాల అప్‌లోడింగ్ చేసుకోవాలి. 19 నుంచి 20వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. 23న ఆయా ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పిస్తారు. 26న అభ్యర్థులకు సీట్లను కేటాయిస్తారు. 26 నుంచి 31 వరకు సీట్లు లభించిన అభ్యర్థులు ఆయా ఇంజినీరింగ్ కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీకిగాను ఏపీఈఏపీసెట్ ర్యాంకులు, రిజర్వేషన్ల ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. ఇప్పటికే తొలి విడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులకు తరగతులు ప్రారంభమయ్యాయి. అభ్యర్థుల సందేహాల్ని నివృత్తి చేసేందుకుగాను 13 హెల్ప్‌లైన్ కేంద్రాలు (హెచ్‌ఎల్‌సి) ఏర్పాటు చేశామన్నారు.

మద్దతు ధర స్వల్పంగా పెంపు

గోధుమకు రూ.110, ఆవాలకు రూ.400
కేంద్ర కేబినెట్ నిర్ణయం

2 లో

ఇదీ లోకం!

కరోనా గురించి జాగ్రత్త కాదు,
మంత్రిగారి ప్రెస్‌కాన్ఫరెన్స్ కోసం జాగ్రత్తలు!

కలిసి నడుద్దాం

- పవన్‌తో చంద్రబాబు భేటీ
- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడతామని వెల్లడి
- ఏపీ రాజకీయాల్లో కీలక పరిణామం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో మంగళవారం కీలక పరిణామం చోటు చేసుకుంది. 2019 శాసనసభ ఎన్నికలకు ముందుగా టీడీపీతో రాజకీయంగా పూర్తిగా తెగతెంపులు చేసుకున్న జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌ను దాదాపు నాలుగు సంవత్సరాల తర్వాత టీడీపీ అధినేత చంద్రబాబు మంగళవారం మరలా కలిసి ఆయనతో ప్రత్యేకంగా భేటీ కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. విశాఖలో పోలీసుల నిర్బంధం అనంతరం విజయవాడ చేరుకున్న పవన్ నోవాటెల్‌లో బస చేయగా, చంద్రబాబు నేరుగా హోటల్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా వారిద్దరు విశాఖలో జరిగిన ఘటనలపై చర్చించుకున్నారు. అనంతరం జనసేన, టీడీపీ అధినేతలు ఉమ్మడిగా విలేకరుల సమావేశం నిర్వహించారు. చంద్రబాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అందరం కలిసి నడవాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రస్తుతం కలిసి ఉద్యమిద్దామని, మరోసారి చర్చించుకుందామని పవన్‌కు సూచించారు. విశాఖలో పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంగా పోలీసులు వ్యవహరించిన విధానం సరికాదన్నారు. పవన్ సమావేశం పెట్టుకున్నరోజే ప్రభుత్వ కార్యక్రమం సరికాదని అన్నారు. పవన్ విశాఖ వదిలి వెళ్లేవరకు ఆంక్షలు పెట్టారని, పవన్ వెళ్లే దారిలో లైట్లు కూడా తొలగించడం దారుణమన్నారు. ఒకేరోజు ఎప్పుడూ రెండు పార్టీల సమావేశాలు జరగలేదని, రెండు పార్టీల నేతలు ఎదురుకాకుండా పోలీసులు చూసుకుంటారని చెప్పారు. కానీ విశాఖలో పోలీసులు ఇందుకు విరుద్ధంగా వ్యవహరించారని మండిపడ్డారు. పవన్‌ను నడిరోడ్డుపై నిలబెట్టే ప్రయత్నం చేశారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం

- మిగతా 2 లో

శ్రీలంక రచయితకు బుకర్‌ప్రైజ్

కొలంబో:
శ్రీలంక రచయిత షెహన్ కరుణతిలక 2022 సంవత్సరానికిగానూ ప్రతిష్ఠాత్మక బుకర్ ప్రైజ్ గెలుచుకున్నారు. ఆయన రాసిన 'ది సెవెన్ మూన్స్ ఆఫ్ మాలి అల్మేడా' పుస్తకం ఈ బహుమతికి ఎంపికైంది. దేశ అంతర్యుద్ధంలో హత్యకు గురైన ఓ యుద్ధ ఫొటోగ్రాఫర్ గురించి ఈ పుస్తకంలో వివరించారు. యుద్ధ ఫోటోగ్రాఫర్, గాంబ్లర్ అయిన మాలి అల్మేడా హత్యకు గురవుతారు. మరణించిన తర్వాత తన హత్యకు బాధ్యులు ఎవరు అనేది తెలుసుకునేందుకు ఆయన చేసిన యత్నాలను ఈ నవలలో వివరించారు. ఆయన రాసిన 'ది లెజెండ్ ఆఫ్ ప్రదీప్ మాథ్యూ' పుస్తకం కామన్వెల్త్ బహుమతి, ది డీఎస్‌సీ ప్రైజ్, ది గ్రేటీయన్ ప్రైజ్‌లను గెలుచుకుంది. ఈ అవార్డు గెలుచుకున్న రెండో శ్రీలంక రచయితగా కరుణ తిలక రికార్డు సృష్టించారు. లండన్‌లో సోమవారం సాయంత్రం జరిగిన ప్రత్యేక వేడుకలో క్వీన్ కన్సార్ట్ కెమిల్లా నుంచి ఈ పురస్కారం అందుకున్నారు. బహుమతి కింద ఆయనకు 50,000 పౌండ్లు అందజేశారు. 2019లో ఆయనకు ఆంగ్ల భాషా సాహిత్య పురస్కారం దక్కింది. 1992లో ఇంగ్లీష్ పేషెంట్ నవల రాసిన రచయిత మైఖేల్ ఒండాజే శ్రీలంక నుంచి బుకర్ ప్రైజ్ అందుకున్న తొలి రచయితగా నిలిచారు.

త్వరలోనే 100 ఛార్జింగ్ స్టేషన్లు: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వచ్చే రెండు నెలల్లో ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లు 100 రానున్నాయని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. మంగళవారం 11 ఛార్జింగ్ స్టేషన్లను ప్రారంభించిన కేజ్రీవాల్ వీటిల్లో బ్యాటరీ మార్పిడి కేంద్రాలు ఉంటాయన్నారు. ఇంతకుముందు బ్యాటరీ మార్పిడి కేంద్రాలు, ఛార్జింగ్ స్టేషన్లు వేర్వేరుగా ఉండేవి. ఇప్పుడు ఇవి రెండూ ఒకే చోట ఉంటాయి. ఈ 11 స్టేషన్లలో 73 ఛార్జింగ్ పాయింట్లు ఉంటాయన్నారు. వచ్చే రెండు నెలల్లో ఢిల్లీలో 100 ఛార్జింగ్ స్టేషన్లు ఉంటాయని వివరించారు. ప్రజల సౌకర్యార్థం వీటిని ఎక్కువగా మెట్రో స్టేషన్ల వద్ద ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

రూ.50 కోట్ల కొకైన్ పట్టివేత

ఇద్దరు మహిళలు సహా ఆరుగురి అరెస్ట్

న్యూఢిల్లీ/ముంబై : రూ.50 కోట్ల విలువ చేసే 7 కిలోల కొకైన్‌ను మాదక ద్రవ్యాల నియంత్రణ సంస్థ (ఎన్‌సీబీ) భారీ ఆపరేషన్‌లో స్వాధీనం చేసుకుంది. ఇందులో నలుగురు విదేశీయులు, ఇద్దరు మహిళలను అరెస్టు చేశారు. ఢిల్లీలోని తిలక్ నగర్‌లో విదేశీయులు నడుపుతున్న మాదక ద్రవ్యాల మాఫియాను ఎన్‌సీబీ ఛేదించింది. ఒక మహిళ నుంచి ట్రాలీ బ్యాగ్‌లో దాచిన 5 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసుకుంది. బ్యాగ్‌ను ఇద్దరు ఇథియోపియన్ల మహిళకు అప్పగించారని, వారిని అరెస్టు చేసినట్లు మంగళవారం ఎన్‌సీబీ తెలిపింది. ఈ డ్రగ్ మూలానికి ముంబైలోని ఒక హోటల్‌తో సంబంధం ఉందని, ఒక భారత మహిళతో పాటు మరో ఇద్దరు ఇథియోపియన్లను కూడా అరెస్టు చేసినట్లు పేర్కొంది. ఈ మాఫియాను నైజీరియన్ మాదక ద్రవ్యాల అక్రమ రవాణాదారులు నిర్వహిస్తున్నారని, ఇది భారతదేశం అంతటా వ్యాపించిందని, ప్రధానంగా ముంబై, ఢిల్లీలో నిర్వహిస్తున్నట్లు ఎన్‌సీబీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ జ్ఞానేశ్వర్ సింగ్ తెలిపారు. కొకైన్‌ను స్వాధీనం చేసుకోవడంతో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాదారుల కొత్త విధానాన్ని ఎన్‌సీబీ కనుగొంది. ఇక్కడ ఆఫ్రికన్ దేశాల పౌరులు చట్ట అమలు సంస్థల అప్రమత్తతపై వారి సర్వే ఆధారంగా విమానాశ్రయాలను మార్చుకుంటారు. ఈ మొత్తం ట్రిప్ ఆఫ్రికా దేశాల్లోని వారి నిర్వాహకులు నడిపిస్తారు. అరెస్టయిన ఆ దేశ జాతీయులు మొదటిసారి భారత్‌కు వచ్చారని ఎన్‌సీబీ తెలిపింది. ముంబైలోని ఒక మహిళ నుంచిఇలాంటి ట్రాలీ బ్యాగ్‌లో 2 కిలోల కొకైన్ దొరికిందని, మొత్తం రికవరీ 7 కిలోలకు చేరుకుందని, తరచుగా ఆఫ్రికా పౌరులు దేశంలోకి మాదక ద్రవ్యాలను అక్రమంగా రవాణా చేసేందుకు భారత మహిళలను వివాహం చేసుకుంటారని వివరించింది. అక్రమణ రవాణాదారులు సమాచారాన్ని అందించుకునేందుకు, దిశలను తెలియజేయడానికి, మాదక ద్రవ్యాల మూలాలు తెలియకుండా నిరోధించేందుకు వర్చువల్ నంబర్లు, సోషల్ మీడియాను వినియోగిస్తారని ఎన్‌సీబీ తెలిపింది.

ఉమర్ ఖలీద్‌కు బెయిల్ నిరాకరణ

న్యూఢిల్లీ : 2020 ఢిల్లీ అల్లర్లతో సంబంధం ఉన్న కేసులో ఉమర్ ఖలీద్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు మంగళవారం తోసిపుచ్చింది. ఖలీద్ బెయిల్ పిటిషన్ విచారణకు అర్హత కలిగి లేదని న్యాయమూర్తులు సిద్ధార్థ మృదుల్, రజనీష్ భట్నాగర్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం తెలిపింది. జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం (జేఎన్‌యూఎస్‌యూ) సభ్యుడు, కార్యకర్త అయిన ఉమర్ ఖలీద్‌ను సెప్టెంబర్ 13, 2020న అరెస్టు చేశారు. అతను చట్ట వ్యతిరేక కార్యకలాపాలు (నిరోధక) చట్టం (ఉపా) కింద ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. డిసెంబర్ 2019, ఫిబ్రవరి 2020లో ఈశాన్య ఢిల్లీలో, ఢిల్లీకి చెందిన జామియా ప్రాంతంలో నిరసనలు, అల్లర్లకు 'సూత్రధారులు'గా ఆరోపణలు ఎదుర్కొంటున్నందుకు ఖలీద్, షార్జీల్ ఇమామ్, అనేక మంది ఇతరుల పై ఉగ్రవాద వ్యతిరేక చట్టం, భారత నేర శిక్షాస్మృతి కింద కేసు నమోదయింది. పౌరసత్వ (సవరణ) చట్టం (సీఏఏ), జాతీయ పౌర నమోదు (ఎన్ఆర్‌సీ) కి వ్యతిరేకంగా నిరసనల సమయంలో ఆయా ప్రాంతాల్లో హింస చోటుచేసుకుంది. ఈ ఘటనల్లో 53 మంది మరణించగా, 700 మందికి పైగా గాయపడ్డారు. మతపరమైన మనోభావాలకు విఘాతం కలిగించి, దేశ రాజధానిని కుదిపేసిన అల్లర్లలో అతను పెద్ద కుట్రలో భాగమని పేర్కొంటూ ఢిల్లీ పోలీసులు ఖలీద్ పై అభియోగాలు నమోదు చేశారు.

పార్టీల మధ్య మీమ్స్ పోరు

న్యూఢిల్లీ : రాజకీయ పార్టీల మధ్య మాటల కొట్లాట పాత కథ. సోషల్ మీడియా సాక్షిగా సరికొత్త రీతుల్లో వ్యంగ్య బాణాలు విసురుకోవడం కొత్త తరహా కలహ రీతి. సాంకేతికత అందిస్తున్న అధునాతన పద్ధతులను ఉపయోగించుకుని పార్టీలు పరస్పరం వెటకరించుకోవడం లోనూ సృజనాత్మకతను చూపిస్తున్నారు. ఇందులో భాగమే ఇప్పుడు జరుగుతున్న మీమ్స్ పోరు. ప్రతిపక్షాలను ఎండగట్టేందుకు రాజకీయ పార్టీలకు దొరికిన తాజా ఆయుధం ఈ మీమ్స్. ఒక పక్కన కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ఎన్నికలు, మరోవైపున గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో ఎన్నికల వాతావరణం, సీబీఐతో తలపడుతున్న ఆప్, బీజేపీ ఎన్నికల ప్రచారాలతో దేశంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈ మూడు రాజకీయ పార్టీలు ఒకదానిపై మరొకటి దుమ్మెత్తిపోసుకునేందుకు సోషల్ మీడియాలో మీమ్స్‌ను ఉపయోగిస్తున్నాయి. తద్వారా తమ సృజనాత్మకతను చూపిస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ ట్విట్టర్‌లో మీమ్‌ను పోస్ట్ చేయగా మరో ట్వీట్‌లో కాంగ్రెస్ పార్టీ 2021లో జరిగిన సంఘటన కొవిడ్‌తో చావు అంచున ఉన్న తన భర్తను రక్షించుకునేందుకు ఆగ్రాకు చెందిన మహిళ రేణు సింఘాల్ తన నోటితో శ్వాసను అందించే ప్రయత్నం చేసిన దృశ్యాన్ని షేర్ చేసింది.

తప్పు చేశాం... క్షమించండి: బ్రిటన్ ప్రధాని లిజ్

లండన్: బ్రిటన్ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొన్ని వారాల్లోనే లిజ్ ట్రస్ తీసుకున్న నిర్ణయాలు వివాదాస్పదమయ్యాయి. అంతేకాకుండా ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడడంతోపాటు సొంతపార్టీ సభ్యుల నుంచే ఆమెపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో తొలిసారి స్పందించిన లిజ్ ట్రస్.. తాము తప్పు చేశామని.. అందుకు క్షమించండి.. అని పేర్కొన్నారు. తాను ఎక్కడికీ వెళ్లనని.. వచ్చే సార్వత్రిక ఎన్నికల వరకూ కన్జర్వేటివ్ పార్టీ నేతగా కొనసాగుతానని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నెలలోపు ప్రధానిపై అవిశ్వాసం పెట్టేందుకు పార్లమెంటు సభ్యులు యోచిస్తున్నట్లు వార్తలొస్తున్న నేపథ్యంలో లిజ్ ట్రస్ ఈవిధంగా స్పందించారు. 'కొత్త ఛాన్సలర్‌ను నియమించాను. ఆర్థిక స్థిరత్వం, క్రమశిక్షణను పునరుద్ధరించాం. ఇలాగే ముందుకు వెళ్తూ ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తాం. 2019 మేనిఫెస్టో ఆధారంగా మేం ఎన్నికయ్యాం. వాటిని అమలు చేయాలని భావిస్తున్నాం' అని బ్రిటన్ ప్రధాని లిజ్ ట్రస్ పేర్కొన్నారు. ఆర్థికంగా ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్నామన్న లిజ్.. ఉక్రెయిన్ సంక్షోభం కారణంగా అంతర్జాతీయ పరిస్థితులూ ప్రతికూలంగా ఉన్నాయని గుర్తుచేశారు. ఇటువంటి సమయంలో ఇంధన ప్యాకేజీపైనా దృష్టి పెట్టామని చెప్పారు. ప్రధాని లిజ్ ట్రస్ ఇటీవల ప్రకటించిన మినీ బడ్జెట్‌లో సామాన్య ప్రజలతో సమానంగా ధనిక వర్గాలకూ ఇంధన రాయితీ ఇవ్వడం దుమారం రేపిన సంగతి తెలిసిందే.

దీంతో ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడడంతో సొంత పార్టీ నేతల నుంచే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో లిజ్ ట్రస్‌పై ఈనెల 24లోగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని పాలక కన్జర్వేటివ్ పార్టీకి చెందిన 100 మంది పార్లమెంటు సభ్యులు యోచిస్తున్నట్లు సమాచారం.

నైజీరియాలో వర్ష బీభత్సం... 600మంది మృతి

అబుజా: ఆఫ్రికా దేశం నైజీరియాలో వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. భారీ వర్షాలు, వరదలతో ఆ దేశం జలమయమైంది. దశాబ్ద కాలంలో ఈ స్థాయిలో వరదలు ఎప్పుడూ రాలేదని అక్కడి అధికారులు చెబుతున్నారు. భీకర వరదల కారణంగా 600మందికి పైగా మృత్యువాతపడ్డారు. ఇళ్లు కొట్టుకుపోవడం, నీటమునిగిపోవడంతో దాదాపు 13లక్షల మంది నిరాశ్రయులుగా మారారు. అయితే, రాష్ట్రాల్లో అనేక హెచ్చరికలు చేసినప్పటికీ సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రజలు పూర్తిగా సిద్ధం కాలేదని.. అందుకే ప్రాణ నష్టం భారీ స్థాయిలో ఉందని అధికారులు తెలిపారు. నైజీరియా మానవతా వ్యవహారాలు, విపత్తు నిర్వహణ మంత్రి సదియా ఉమర్ ఫరూక్ ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రమాదం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నివసించే ప్రజలను ఖాళీ చేయించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఈ భారీ విపత్తులో ఇప్పటివరకు దాదాపు 2లక్షల ఇళ్లు కొట్టుకుపోయాయని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా నవంబర్ చివరి వరకు కూడా అక్కడ వర్షాలు, వరదలు కొనసాగే అవకాశం ఉంది.

ఇమ్రాన్‌కు భారీ ఊరట

ఏడు స్థానాల్లో పోటీ... ఆరుస్థానాల్లో విజయం

ఇస్లామాబాద్: అవిశ్వాస తీర్మానంతో ఓటమిచెంది పదవి కోల్పోయిన పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు భారీ ఊరట లభించింది. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల ఫలితాల్లో పీటీఐ పార్టీ భారీ విజయం సాధించింది. జాతీయ అసెంబ్లీతోపాటు స్థానిక ప్రావిన్సులకు సంబంధించి మొత్తం 11 నియోజకవర్గాల్లో ఉపఎన్నిక జరగగా.. ఎనిమిదింటిని పీటీఐ కైవసం చేసుకుంది. ఇమ్రాన్ ఖాన్ ఒక్కరే ఏడు స్థానాల నుంచి పోటీ చేయగా.. అందులో ఆరు స్థానాల్లో విజయం సాధించి సత్తా చాటుకున్నారు.

తాజా ఉప ఎన్నికలను రిఫరెండంగా పేర్కొన్న ఇమ్రాన్.. అధికారపక్షంపై ఈస్థాయిలో విజయం సాధించడం మామూలు విషయం కాదని అక్కడి రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన అవిశ్వాస తీర్మానంతో ఓటమి తర్వాత.. నేషనల్ అసెంబ్లీ సభ్యులు రాజీనామా చేయాలని పీటీఐ అధినేత ఇమ్రాన్ ఖాన్ తమ పార్టీకి చెందిన సభ్యులకు సూచించారు. అందుకు అనుగుణంగా పీటీఐ నేతలు రాజీనామా చేశారు. అందులో ఎనిమిది స్థానాలకు ఎన్నికల సంఘం ఉప ఎన్నికలను ఇటీవల నిర్వహించింది. వీటితో పాటు పంజాబ్ ప్రావిన్సులోని మూడు అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరిపింది. ఇందులో భాగంగా నేషనల్ అసెంబ్లీలో (పార్లమెంట్ దిగువసభ) ఎనిమిది స్థానాలకు గాను.. ఏడు చోట్ల నుంచి పీటీఐ తరపున ఇమ్రాన్ ఖాన్ ఒక్కరే పోటీకి దిగారు. తాజా ఫలితాల్లో ఆరు స్థానాల్లో విజయం సాధించగా ఒక్క కరాచీ స్థానంలో మాత్రమే ఓడిపోయారు. మరో నియోజకవర్గం ముల్తాన్ నుంచి పోటీ చేసిన పీటీఐ అభ్యర్థి ఓటమి చెందారు. ఇలా ఆరు నేషనల్ అసెంబ్లీ స్థానాలతో పాటు మరో రెండు అసెంబ్లీ ప్రావిన్సుల్లోనూ పీటీఐ విజయం సాధించింది. అధికార కూటమి మాత్రం కేవలం ఒకే ఒక్క స్థానంలో గెలిచింది.

అంతకుముందు (ఈ ఏడాది జులైలో) పంజాబ్ అసెంబ్లీకి 20స్థానాల్లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ పీటీఐ పార్టీ 15 స్థానాలను కైవసం చేసుకుంది. చట్టసభ సభ్యులు తీసుకున్న నిర్ణయం తప్పని.. వారి తప్పిదాన్ని గుర్తించేందుకు తాజా ఫలితాలు మరో అవకాశాన్ని కల్పిస్తున్నాయని పీటీఐ సెక్రటరీ జనరల్ అసద్ ఉమర్ పేర్కొన్నారు. కొత్తగా ఎన్నికలు జరగాలని ప్రజలు నిర్ణయించినట్లు ఈ ఫలితాలను బట్టి తెలుస్తోందని మాజీ మంత్రి ఫవాద్ చౌద్రీ అన్నారు.

మద్దతు ధర స్వల్పంగా పెంపు

న్యూఢిల్లీ: కనీస మద్దతు ధరకు హామీనిస్తూ చట్టం తేవాలని రైతాంగం చేస్తున్న డిమాండును పక్కకుపెట్టి నామమాత్రపు చర్యలకు కేంద్రప్రభుత్వం పూనుకుంటోంది. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని గొప్పలు చెప్పిన మోదీ సర్కార్...మరో 'కంటితుడుపు' నిర్ణయం తీసుకుంది. 2022-23 (జులై-జూన్), 2023-24 మార్కెటింగ్ సీజన్ (ఏప్రిల్-మార్చి) కోసం ఆరు రబీ పంటల కనీస మద్దతు ధర పెంచినట్లు ప్రకటించింది. గోధుమ పంట ఎంఎస్‌పీ రూ.110 పెంచింది. దీంతో గోధుమల క్వింటా ధర రూ.2,125కు చేరింది. అలాగే ఆవాలపై రూ.400 పెంచగా క్వింటా ధర రూ.5,450 అయింది. పంట ఉత్పత్తిని, రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ నిర్ణాయాన్ని ప్రధాని మోదీ నేతృత్వంలోని ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) తీసుకున్నట్లు కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ప్రస్తుతానికి ఖరీఫ్, రబీ కలిపి 23 పంటలకు ఎంఎస్‌పీలను ప్రభుత్వం ఖరారు చేసింది. ఖరీఫ్ ముగిశాక రబీసాగు మొదలవుతుంది. గోధుమలు, ఆవాలు ప్రధాన పంటలు. గోధుమలు క్వింటా రూ.2,125కు చేరుకోగా 2021-22లో అది రూ.2,015గా ఉంది. సాగు వ్యయం క్వింటాకు రూ.1,065గా ఉందని అధికారిక ప్రకటన పేర్కొంది. గోధుమలు, ఆవాల సాగు వ్యయం నూరు శాతం రైతులకు లభించేలా ప్రభుత్వం చూస్తోందని మంత్రి ఠాకూర్ వెల్లడించారు. మిగతా నాలుగు రబీ పంటలకు 50 నుంచి 85శాతం వరకు పెట్టుబడులు లభిస్తాయని అన్నారు. బార్లీ మద్దతు ధర రూ.100 పెరిగి క్వింటా ధర 2022-23లో రూ.1,735కు చేరింది. అది గతేడాది రూ.1,635గా ఉంది. పప్పులపై మద్దతు ధర రూ.105 పెరిగింది. దీంతో క్వింటా రూ.5,230 నుంచి రూ.5,335కి పెరిగింది. ఎర్ర కందిపప్పుపై రూ.500 పెరిగి క్వింటా ధర రూ.5,500 నుంచి రూ.6,000కు చేరింది. నూనెగింజలపై రూ.400 పెరిగి క్వింటా ధర రూ.5,450కి చేరింది. అంతకుముందు రూ.5,050గా ఉంది. దేశాన్ని స్వయం సమృద్ధిగా చేయడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం కోసం నూనెగింజలు, పప్పుల ఉత్పత్తిని పెంచడానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అధికారిక ప్రకటన పేర్కొంది. ఇందుకోసం ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపింది. స్మార్ట్‌సాగు దిశగా సాంకేతికతను, నూతన విధానాలను ప్రోత్సహిస్తుంది. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ (డీఏఎం)ను అమలు చేస్తోంది. ఇందులో ఇండియా డిజిటల్ ఎకోసిస్టమ్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐడియా), రైతుల డేటాబేస్, రైతుల ఏకీకృత సేవా ఇంటర్‌ఫేస్ (యూఎఫ్ఎస్ఐ), నూతన సాంకేతికపై రాష్ట్రాలకు నిధులు (ఎన్ఈజీపీఏ), మహాలానోబిస్ నేషనల్ క్రాప్ ఫోర్‌కాస్ట్ సెంటర్ (ఎంఎన్‌సీఎఫ్‌సీ) పునరుద్ధరణ, నేలను సారవంతం చేయడం, ప్రొఫైల్ మ్యాపింగ్ వంటివన్నీ డీఏఎం కిందకు వస్తాయని ప్రకటన పేర్కొంది. కృత్రిమ మేధస్సు, మెషీన్ లెర్నింగ్, (ఏఐ/ఎంఎల్), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఎల్ఓటీ), బ్లాక్ చెయిన్ తదితర సాంకేతికత వినియోగం కోసం డిజిటల్ వ్యవసాయ ప్రాజెక్టులకు నిధులను రాష్ట్రాలకు సమకూరుస్తున్నట్లు తెలిపింది. డ్రోన్ సాంకేతిక వినియోగం పెరుగుతున్నట్లు వెల్లడించింది. స్మార్ట్ సాగు దిశగా వ్యవసాయ రంగంలో స్టార్టప్‌లను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అధికారిక ప్రకటన తెలిపింది.

హిమాచల్‌పై బీజేపీకి భయం

అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి కొత్త ముఖాలకే టికెట్లు

న్యూఢిల్లీ: కాషాయ పార్టీకి బీజేపీకి హిమాచల్ ప్రదేశ్ పై భయం పట్టుకుంది. త్వరలో రాష్ట్ర శాసనసభకు జరగనున్న ఎన్నికల్లో ఈసారి పాత వారికి చెల్లుచీటి చెప్పి, కొత్త ముఖాలకు టికెట్లు ఇవ్వాలనే యోచనకు ఆ పార్టీ వచ్చింది. అధికార పార్టీ అంతర్గత సర్వే ప్రకారం వెళితే, ఈసారి బీజేపీ ఎమ్మెల్యేలు అనేక మందికి టికెట్లు రావని, ఇతర పార్టీ నుంచి వచ్చిన వారికి అంత సులభంగా టికెట్లు కేటాయించకపోవచ్చని ఆ వర్గాలు తెలిపాయి. మొత్తం 68 సీట్లకుగాను 59 స్థానాలకు సంబంధించిన పేర్లను రోజుల వ్యవధిలో ప్రకటిస్తారని భావిస్తున్నారు. మంగళవారం ఢిల్లీలోని హరియాణా భవన్‌లో సమావేశం జరిగింది. ఇప్పటికే విడుదలయిన ఎన్నికల షెడ్యూల్ ప్రకారం, నవంబర్ 12న ఓటింగ్ జరగనుండగా, డిసెంబర్ 8న ఫలితాలు వెలువడతాయి. 2017లో బీజేపీ 44 నియోజకవర్గాల్లో విజయం సాధించి కాంగ్రెస్‌ను గద్దె దింపింది. ఈ ఏడాది ప్రారంభంలో పొరుగున ఉన్న పంజాబ్‌ను గెలుచుకున్న తర్వాత ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఈ పర్వత రాష్ట్రంలో విజయం సాధించేందుకు అన్ని ప్రయత్నాలు చేపట్టింది. కాగా బీజేపీ తన అంతర్గత సర్వేలో బ్లాక్ స్థాయి సభ్యుల నుంచి ప్రతి సెగ్మెంట్‌కు మూడు ప్రాధాన్యతలను కోరింది. సిమ్లా, కాంగ్రా, మండి, హమీర్‌పూర్‌లలో రహస్య బ్యాలెట్ ద్వారా ఓటింగ్ నిర్వహించారు. ఢిల్లీలో కౌంటింగ్ జరిగింది. ఇక్కడ బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ తుది నిర్ణయం తీసుకుంటుంది. పార్టీ కార్యకర్తల నుంచి తీసుకున్న అభిప్రాయాల ప్రకారం, ప్రజాదరణ లేని సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మళ్లీ టికెట్ ఇవ్వకూడదని, ఫిరాయింపుదారులను తిరస్కరించాలన్నది ప్రధాన అంశాలుగా ఉన్నాయి.

వాస్తవాలేవి?

బిల్కిస్ బానో కేసులో గుజరాత్ ప్రభుత్వానికి సుప్రీం అక్షింతలు

నవంబరు 29కి విచారణ వాయిదా

న్యూఢిల్లీ: బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం కేసులో 11 మంది నిందితులకు శిక్ష తగ్గించి విడుదల చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లకు గుజరాత్ ప్రభుత్వం ఇచ్చిన సమాధానం చాలా పెద్దగా ఉంది, వరుస తీర్పులను ఉటంకించారు. కానీ అందులో అసలు చెప్పాల్సిన వాస్తవ అంశాలేవీ లేవని సుప్రీంకోర్టు మంగళవారం వ్యాఖ్యానించింది. గుజరాత్ ప్రభుత్వం సమర్పించిన అఫిడవిట్‌పై పిటిషనర్లు తమ స్పందన తెలియజేసేందుకు అత్యున్నత కోర్టు సమయాన్ని ఇచ్చింది. ఈ పిటిషన్లపై విచారణను నవంబరు 29వ తేదీకి వాయిదా వేసింది. "నా దగ్గరకు కౌంటర్ అఫిడవిట్ రాలేదు. అందులో ఉన్నవన్నీ వరుస తీర్పుల ఉటంకనలే. అసలు విషయాన్ని ఇంకా చెప్పాల్సి ఉంది. సమాధానం చాలా పెద్దగా ఉంది. మరి వాస్తవ ప్రకటన ఎక్కడ? సరైన జవాబు ఏదీ?" అని జస్టిస్ అజయ్ రస్తోగి నేతృత్వంలోని ధర్మాసనం ప్రశ్నించింది. గుజరాత్ ప్రభుత్వం ఇచ్చిన సమాధానం పిటిషనర్లు అందరికీ అందుబాటులో ఉంచాలని జస్టిస్ సి.టీ. రవి కుమార్ కూడా ఉన్న ఈ ధర్మాసనం పేర్కొంది. బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం కేసులో నిందితుల శిక్షను తగ్గించి విడుదల చేయడాన్ని సవాల్ చేస్తూ సీపీఎం సీనియర్ నాయకులు సుభాషిణి అలీ, మరో ఇద్దరు మహిళలు ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. పిటిషనర్ల తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తమ స్పందన తెలియజేసేందుకు తనకు కొంత సమయం కావాలని అడిగారు. గుజరాత్ ప్రభుత్వ సమాధానాన్ని తాను ఇంతకుముందే వార్తాపత్రికల్లో చదివానని జస్టిస్ రస్తోగి చెప్పారు. "ఆయన కౌంటర్ అఫిడవిట్ ఇవ్వలేదు. అందులో ఉన్నవన్నీ వరుస తీర్పుల ఉటంకనలే" అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఉద్దేశించి రస్తోగి చేసిన వ్యాఖ్యతో తుషార్ మెహతా ఏకీభవించారు. దానిని పక్కన పెట్టాలని చెప్పారు. "సులభంగా సమాచారం తెలుస్తుందనే ఉద్దేశంతో తీర్పులను చేర్చాం. దానిని వదిలేయండి" అని మెహతా అన్నారు. నిందితులకు శిక్ష తగ్గింపు, విడుదలను అసంబంధితులు, మూడో పార్టీ సవాల్ చేయలేదని సొలిసిటర్ జనరల్ అన్నారు. దీనిపై సమాధానం ఇచ్చేందుకు సుప్రీంకోర్టు పిటిషనర్లకు సమయాన్ని ఇచ్చింది. నవంబరు 29వ తేదీకి ఈ కేసును వాయిదా వేసింది. 14 ఏళ్లకు పైగా జైలుశిక్ష పూర్తి చేసుకున్నా, సత్ప్రవర్తన కలిగి ఉన్నవారిని విడుదల చేయవచ్చనే 1992 రెమిషన్ పాలసీ ప్రకారం నిందితులను విడుదల చేయాలనే తమ నిర్ణయాన్ని గుజరాత్ ప్రభుత్వం సోమవారం సుప్రీంకోర్టులో సమర్థించుకుంది. అజాదీకా అమృత్ మహోత్సవ సంబరాల్లో భాగంగా ఖైదీలకు ఉపశమనం కలిగించాలనే సర్క్యులర్ ప్రకారం నిందితులను విడుదల చేయలేదని వివరణనిచ్చింది. జీవిత ఖైదు ప్రకారం నిందితులంతా 14 ఏళ్ళ జైలుశిక్షను పూర్తి చేసుకున్నారని రాష్ట్ర హోం శాఖ పేర్కొంది.

నేరగాళ్లకు మోదీ అండ: రాహుల్

ఢిల్లీలో ఎర్రకోటపై నుండి మాట్లాడేటప్పుడు మహిళల్ని గౌరవిస్తామని అంటారు. వాస్తవంలో చూస్తే లైంగిక దాడుల నిందితులకు మద్దతిస్తారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ ప్రధాని నరేంద్ర మోదీని విమర్శించారు. ఆయన హిందీలో ఈ ట్వీట్ చేశారు. బిల్కిస్ బానో కేసులో నిందితుల విడుదలపై ఆయన ఈ వ్యాఖ్య చేశారు. నిందితుల విడుదల కోసం కేంద్రం నుండి తమకు తగిన ఆదేశాలు అందాయని సుప్రీంకోర్టులో సోమవారం గుజరాత్ ప్రభుత్వం చెప్పిన నేపథ్యంలో రాహుల్ ప్రధానిని తూర్పారబట్టారు. ప్రధానమంత్రి వాగ్దానాలు, ఉద్దేశాల మధ్య తేడా చాలా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రధానమంత్రి మహిళలకి నమ్మకద్రోహం చేస్తున్నారని విమర్శించారు.

ఆచరణ సాధ్య పరిష్కారాలు చూపాలి

డ్రగ్స్ ముప్పుపై ఏఎస్‌జీ, అమికస్‌కు సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ: దేశంలో మాదకద్రవ్యాల ముప్పును సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఈ సమస్య పరిష్కారానికి ఆచరణ సాధ్య మార్గాలతో రావాలని న్యాయాధికారి, కోర్టు నియమిత అమికస్ క్యూరీకి సూచించింది. మాదకద్రవ్యాల ముప్పును తగ్గించే దిశగా రెవెన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ (డీఆర్ఐ) వంటి సంబంధిత శాఖలు కసరత్తు చేస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి యూయూ లలిత్, జస్టిస్ బేలా ఎం త్రివేది ధర్మాసనానికి అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భారతి తెలిపారు. సుమోటో కేసు 'దేశంలో పనిచేస్తున్న డ్రగ్‌మాఫియా నెట్వర్క్‌తో ముప్పు'పై సహకరించాలని ఏఎస్‌జీకి సుప్రీంకోర్టు ఇంతకుముందు సూచించింది. అఫ్ఘనిస్తాన్ నుంచి భారత్‌కు భారీగా మాదకద్రవ్యాల స్మగ్లింగ్ జరిగిందని... దేశీయ, అంతర్జాతీయ నార్కోటిక్ డ్రగ్ మాఫియాపై విచారణ జరిపేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ 2021, నవంబరు 9న సుప్రీంకోర్టుకు లేఖ పంపారు. ఈ లేఖను సుమోటో కేసుగా భావించాలని అప్పటి సీజేఐ ఎన్వీ రమణ గతేడాది నవంబరులో సూచించారు. మంగళవారం ఈ కేసు విచారణకు రాగా ఇద్దరు కలిసి కూర్చొని ఈ సమస్యకు పరిష్కారాన్ని కనుగొనండి అని ఐశ్వర్య భారతి, అమికస్ క్యూరీగా నియమితులైన న్యాయవాది షోయబ్ ఆలంకు సుప్రీంకోర్టు సూచించింది. 'దీని పరిష్కారానికి ఏదో ఒకటి చేయాలి.. ఏదో ఒక ఆలోచన కావాలి. మీరిద్దరు ఇందుకోసం కసరత్తు చేయండి. ఆచరణసాధ్య పరిష్కారాలు కనుగొనండి. మాదక ద్రవ్యాల విపత్తు దేశాన్ని అతలాకుతలం చేస్తోంది. దీని కట్టడికి తక్షణ చర్యలు అవసరం' అని ధర్మాసనం పేర్కొంది. ఈ వ్యవహారంలో వేర్వేరు అధికారులతో చర్చలు జరిపినట్లు కోర్టుకు భారతి తెలిపారు. డీఆర్ఐ, ఎన్ఐఏ దర్యాప్తు కొనసాగుతోందన్నారు. ఇందులోని లొసుగులను గుర్తించి దిద్దుబాటు కోసం యంత్రాంగం కోసం ఆరా తీశానన్నారు. సమగ్ర అఫిడవిట్‌ను కోర్టుకు సమర్పిస్తానని చెప్పారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ), కాగ్, ఎయిమ్స్ నివేదికలతో ఓ సంకలనాన్ని దాఖలు చేసినట్లు ఆలం తెలిపారు. భారత్‌లో స్వాధీనం చేసుకున్న కోటి రూపాయలకుపైగా విలువ చేసే ప్రధాన మాదకద్రవ్యాలపై మీడియా నివేదికలనూ పరిశీలించినట్లు చెప్పారు. 13 నెలల్లో అంటే గతేడాది సెప్టెంబరు నుంచి ఇప్పటివరకు దేశంలో రూ.30వేలకోట్ల విలువచేసే మత్తు పదార్థాలు పట్టుపడినట్లు తెలిపారు. ఇది చాలా పెద్ద సమస్య అని నొక్కిచెప్పారు. కోవిడ్ మహమ్మారి తర్వాత భారత్‌కు మదకద్రవ్యాల సరఫరా పద్ధతుల్లో మార్పు వచ్చిందని అన్నారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం వరల్డ్ వైడ్ వెబ్‌లో డార్క్ వెబ్ భాగమైందని వ్యాఖ్యానించింది.

కలిసి నడుద్దాం

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ప్రతిపక్షాలపై దాడులు చేసి తిరిగి తమపైనే కేసులు పెడతారా? ఇదేనా ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. దాడులు చేయడం... కేసులు పెట్టడం, జైలులో వేయడం, ప్రతిపక్షాల పై ఇష్టానుసారం మాట్లాడుతున్నారని చంద్రబాబు దుయ్యబట్టారు. ఎదురుతిరిగితే కేసులు, దాడులతో భయపెడుతున్నారని అన్నారు. ఏపీలో ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతోందన్నారు. వైసీపీ హింసలు భరించలేక చాలా మంది ఆత్మహత్య చేసుకున్నారని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పాలనను 40 ఏళ్లలో ఎప్పుడూ చూడలేదన్నారు. శారీరకంగా, మానసికంగా బాధపెట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. కొందరు పోలీసులు దారుణంగా ప్రవర్తిస్తున్నారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల కార్యక్రమాలపై అడుగడుగునా ఆంక్షలా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని, అందుకు అన్ని పార్టీలు కలిసి రావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. రాజకీయ నేతలకే రక్షణ లేదు... ఇక ప్రజలకేం రక్షణ కల్పిస్తారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై ప్రశ్నించే స్వేచ్ఛ ప్రజలకు లేకుండా చేశారని వ్యాఖ్యానించారు. అవసరమైతే అన్ని రాజకీయ పార్టీలను కలిసి చర్చిస్తామని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడమే తక్షణ కర్తవ్యమన్నారు. విశాఖ ఘటన నేపథ్యంలో మనసు బాధపడి తప్పకుండా పవన్‌ను కలిసి సంఘీభావం తెలపాలని ఇక్కడకు వచ్చానని తెలిపారు.

వామపక్షాలు సహా అన్ని ప్రతిపక్షాలతో కలుస్తాం : పవన్

వైసీపీ బారి నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి వామపక్షాలు సహా అన్ని ప్రతిపక్ష పార్టీలను

కలుపుకొనిపోతామని పవన్ చెప్పారు. నాకు సంఘీభావం తెలిపేందుకే టీడీపీ అధినేత చంద్రబాబు తాను బస చేసిన హోటల్‌కు వచ్చారని తెలియజేస్తూ, ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఏపీలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం గొంతు నొక్కేందుకు వైసీపీ సర్కార్ ప్రయత్నం చేస్తోందని, ప్రతిపక్షాల పై అక్రమ కేసులు పెడుతున్నారని, దాడులు చేస్తున్నారని పవన్ కళ్యాణ్ మండిపడ్డారు. టీడీపీ, జనసేనకే కాదు... మా మిత్రపక్షమైన బీజేపీకి కూడా ఇదే పరిస్థితి ఎదురవుతుందని, ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ప్రజాస్వామ్య పరిరక్షణకు కలవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన సమయం ఇదేనన్నారు. ఎన్నికలకు ఎలా వెళ్లాలనే విషయం ఒక్క రోజులో తేలేది కాదని, వైసీపీతో పోరాడేందుకు వ్యూహాలు సిద్ధం చేస్తున్నామన్నారు. ముందుగా న్యాయ, రాజకీయ పోరాటం చేస్తామని, ప్రతిపక్షాలపై మరోసారి దాడులు జరగకుండా, ప్రజలకు మేలు చేయడం కోసం కార్యాచరణ చేపడతామని పవన్ స్పష్టం చేశారు.

అమరావతే ఏకైక రాజధాని

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టీకరణ
- రాజధాని రైతులకు సంఘీభావం
- కర్నూలు జిల్లాలో 25 కి.మీ. సాగిన భారత్ జోడో యాత్ర
- అపూర్వ స్వాగతం పలికిన గ్రామీణులు

విశాలాంధ్ర-ఆలూరు: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీని అమరావతి ప్రాంత రైతులు కలిశారు. అమరావతి రైతులు తనను కలిసిన సందర్భంగా రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు అమరావతే ఏకైక రాజధాని అన్నారు. అమరావతి రైతుల పోరాటానికి సంఘీభావం తెలుపుతున్నానని ప్రకటించారు. అమరావతి రైతుల పోరాటానికి న్యాయ సహాయం అందిస్తా మని చెప్పారు. వీలైతే అమరావతి రైతుల పాదయాత్రలో పాల్గొంటానని స్పష్టం చేశారు. మరోవైపు పోలవరం నిర్వాసిత రైతులు కూడా రాహుల్ గాంధీని కలిశారు. ఈ సందర్భంగా పోలవరం నిర్వాసిత రైతులకు కాంగ్రెస్ అండగా ఉంటుందని రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ అమలు చేస్తామని చెప్పారు. ఇక, రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర మంగళవారం కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా నుండి యాత్ర ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించింది. మంగళవారం ఉదయం 5గంటలకే ఏపీ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు స్వాగతం పలకడానికి కర్ణాటక సరిహద్దు హాలహర్వి మండల కేంద్రానికి చేరుకున్నారు. సరిగ్గా 6:30 గంటలకు రాహుల్ గాంధీ అక్కడకు చేరుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్ జోడో యాత్ర ఇన్‌చార్జి తులసిరెడ్డి, ఏపీపీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ ఆధ్వర్యంలో ఏపీ కాంగ్రెస్ అగ్ర శ్రేణి నాయకులు రాహుల్‌కు ఘన స్వాగతం పలికారు. మహిళలు కలశాలతో రాహుల్‌ను సాదరంగా ఆహ్వానించారు. అక్కడి నుంచి జోడోయాత్రను రాహుల్ గాంధీ వడివడిగా ప్రారంభించారు. రాహుల్‌ను చూడటానికి వివిధ గ్రామాలకు చెందిన ప్రజలతోపాటు, రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు పెద్దఎత్తున రోడ్డు కిరువైపులా బారులు తీరారు. వారికి రాహుల్ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. కురువళ్లి- ఆలూరుకు మధ్య మిత్ర ప్లాంటేషన్ వద్ద రాహుల్ విశ్రాంతి తీసుకున్నారు. దిల్లీ నుంచి వచ్చిన కేంద్ర మాజీ మంత్రులు, లోక్ సభ సభ్యులు, ఏపీ కాంగ్రెస్ పార్టీ అగ్రశ్రేణి నాయకులతో ఆయన మాట్లాడారు. సాయంత్రం 4:30 గంటలకు అక్కడి నుంచి యాత్ర మొదలు పెట్టారు. అప్పటికే ఆలూరు పట్టణానికి వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ చుట్టుపక్కల ఉన్న ప్రజలను చూస్తూ చేతులు ఊపుతూ ముందుకు కదిలారు. మనేకుర్తి గ్రామం వరకు యాత్ర సాగింది. ఏపీలో మొదటిరోజు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు అనూహ్య స్పందన లభించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఆయన 25 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. ఆదోని మండలం, ఛాగి గ్రామంలో రాహుల్ గాంధీ రాత్రి బస చేస్తారు.

బుధవారం అక్కడి నుంచి పాదయాత్ర మొదలవుతుందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. జోడో యాత్ర నాలుగు రోజులు ఏపీలో కొనసాగి తిరిగి కర్ణాటకలోకి ప్రవేశించ నుంది. అనంతరం తెలంగాణలో 14 రోజులపాట సాగనుంది. ఈ పాదయాత్రలో రాహుల్‌గాంధీతో పాటు ఏఐసీసీ నేతలు జైరాం రమేశ్, దిగ్విజయ్ సింగ్, చింతామోహన్, తులసిరెడ్డి, రఘువీరారెడ్డి, కేవీపీ రామచంద్రరావుతో పాటు జిల్లా నాయకులు సుధాకర్‌బాబు, లక్ష్మీనరసింహత పాటు అనేక మంది కాంగ్రెస్ పార్టీ జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు. బుధవారం మధ్యాహ్నం 1 గంటకు ఆదోనిలో రాహుల్ గాంధీ ఆంధ్రప్రదేశ్ మీడియాతో మాట్లాడనున్నారు.

అధికారంలోకి వస్తే ఏపీకీ ప్రత్యేక హోదా: జైరాం రమేశ్

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా ఇస్తామని కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్ అన్నారు. మంగళవారం రాహుల్ జోడోయాత్ర విరామ సమయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు దేశవ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో పూర్తి చేసుకుని ఏపీలోకి పాదయాత్ర ప్రవేశించిన మొదటి రోజే ప్రజల నుండి విశేష స్పందన లభించిందని, ఆలూరు నుంచి మంత్రాలయం వరకు నాలుగు రోజుల పాటు 95 కి.మీ మేర ఈ యాత్ర కొనసాగుతుందని చెప్పారు. దేశంలో కుల, మతాల మధ్య బీజేపీ చిచ్చుపెడుతోందని ఆయన పేర్కొన్నారు. విభజించు, పాలించు అనే నినాదంతో ఆ పార్టీ పాలన సాగిస్తోందని విమర్శించారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రను చూచి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు భయపడుతున్నాయన్నారు. భారత్‌లో నిరుద్యోగం, పేదరికం పెరుగుతోందని, రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతోందన్నారు. రాష్ట్ర విభజన ఏపీకి గాయం చేసిందన్న మాట వాస్తవమేనని, 2024లో కేంద్రంలో అధికారంలోకి రాగానే ఏపీకి ప్రత్యేకహోదా, పోలవరం ప్రాజెక్టు, రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీలతోపాటు విభజన చట్టంలో పేర్కొన్న విధంగా హామీలను నెరవేర్చే బాధ్యతను కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఏపీలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం ఖాయమని జైరాం ఆశాభావం వ్యక్తం చేశారు.

సీఎంను కలిసిన నార్వే, జర్మనీ భారత రాయబారులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎం జగన్‌ను నార్వే, జర్మనీ దేశాల్లోని భారత రాయబారులు డాక్టర్ బి.బాలబాస్కర్, పర్వతనేని హరీశ్ మంగళవారం కలిశారు. ఎగుమతులను ప్రోత్సహించడంలో భాగంగా జర్మనీ, నార్వే దేశ అవకాశాలపై ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇదే అంశంపై ఏపీఐఐసీ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. అక్కడ చర్చించిన అంశాలను సీఎం దృష్టికి రాయబారులు తీసుకెళ్లారు. రాష్ట్రం నుంచి ఎగుమతికి అవకాశం ఉన్న ఉత్పత్తులు, సులభతర వాణిజ్యం కోసం అమలుచేస్తున్న ప్రణాళికలను వివరించారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, ఉద్యాన ఉత్పత్తులు, మత్స్య సంపద, చేనేత, టెక్స్‌టైల్, టూరిజం రంగాలలో అవకాశాలపై ఈ సమావేశంలో చర్చించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో నిర్మిస్తున్న పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌లు, పోర్టు ఆధారిత పారిశ్రామిక పార్కుల ఏర్పాటు, ఎంఎస్ఎంఈలతో ఒప్పందాలు, పాలసీలు, టెక్నాలజీ అప్‌గ్రేడేషన్, డీకార్బ నైజేషన్ వంటి కీలక అంశాలపై సీఎం, రాయబారుల మధ్య చర్చ కొనసాగింది. ఇక్కడ నర్సింగ్ చదువుతున్న విద్యార్థులకు జర్మనీలో విస్తృతంగా అవకాశాలు కల్పించేలా వారు కోర్సు చదివే సమయంలో అక్కడికి తగిన విధంగా భాషా శిక్షణ, కరిక్యులమ్ అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నాణ్యమైన, రుచికరమైన కాఫీ ఉత్పత్తులకు అంతర్జాతీయ బ్రాండింగ్, ప్రొడక్టివిటీ పెంచేలా తగిన సహకారాలు అందించాలని సీఎం కోరగా, తప్పనిసరిగా తమ సహకారం ఉంటుందని ఇరుదేశాల రాయబారులు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులు, అవకాశాలపై రెండు దేశాల రాయబారులకు సీఎం వివరించారు. సీఎం ప్రత్యేక ముఖ్య కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, ప్రణాళికా శాఖ కార్యదర్శి జి.విజయ్‌కుమార్, పరిశ్రమల శాఖ సంచాలకులు జి.సృజన పాల్గొన్నారు.

పైగంబర కవి సుగంబాబు మృతి

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రముఖ కవి, పైగంబర కవుల్లో ఒకరైన సుగంబాబు మంగళ వారం ఉదయం కన్నుమూశారు. ఆయన వయసు 74 సంవత్సరాలు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గుంటూరుకు చెందిన సుగంబాబు రచయిత, దర్శకుడు, జర్నలిస్టు. జర్నలిజంలోకి రాకముందు సుగంబాబు మద్రాసులో మనసు కవి ఆత్రేయ దగ్గర, ప్రముఖ నిర్మాత ఎంఎస్ రెడ్డి వద్ద పనిచేశారు. కొన్ని సినిమాలకు మాటలు రచయితగానూ, దర్శకత్వ శాఖలోనూ పనిచేశారు. ఆయన ముక్కుసూటి మనిషి. ఒకరి మెప్పుకోసం ఎప్పుడూ పాకులాడ లేదు. ఎవరికి కోపాలు వచ్చినా నిజాన్ని నిర్భయంగా చెప్పడం ఆయన స్వభావం. సుగంబాబు 1984లో తీసిన 'గురజాడ అప్పారావు జీవితం-సాహిత్యం' దాక్యుమెంటరీకి 1985లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బంగారు నంది అవార్డు లభించింది. 'రెక్కలు' అనే ఒక వినూత్న సాహితీ ప్రక్రియకు ఆయన ఆద్యులు. కొన్ని భాగాలుగా వెలువడిన 'రెక్కలు'ను ఒకే సమగ్ర సంపుటంగా ప్రచురించారు. ఏ కళ అయినా దుఃఖంలోంచే పుడుతుందని, దుఃఖాన్ని పోగొట్టేందుకు దుఃఖం నుంచే రాశాననీ, ఏదీ ఊహించి రాయలేదనీ, చూసి అనుభవించి రాశాననీ సుగంబాబు చెప్పుకున్నారు. జీవితాంతం కవిత్వంలోనే బతికి, కవిత్వం కోసమే ఆయన తపించారు.

అరసం సంతాపం: సుగంబాబు మృతికి అరసం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్వీ రామారావు, ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్, అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, అరసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు.

అమరావతి రైతులపై వైసీపీ దాడి

రాజమండ్రిలో కదం తొక్కిన రాజధాని రైతులు

టీడీపీ, బీజేపీ, జనసేన సంఘీభావం

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: శాంతియుతంగా మహాపాదయాత్ర చేపట్టిన అమరావతి రైతులపై మంగళవారం వైసీపీ శ్రేణులు దాడి చేయడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వాటర్ బాటిల్‌తో తలపై కొట్టడంతో రైతుకు గాయమైంది. దాడిని ధీటుగా ఎదుర్కోవడంతో వైసీపీ శ్రేణులు తోకముడిచారు. ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి ఒక్కటే రాజధానిగా ఉండాలని ఆ ప్రాంత రైతులు మూడున్నర సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం సాగిస్తున్నారు. దీనిలో భాగంగా అమరావతి నుంచి అరసవల్లి వరకు అమరావతి రైతులు చేపట్టిన మహాపాదయాత్ర 37వ రోజైన మంగళవారం రాజమహేంద్రవరం చేరుకుంది. కాతేరు నుంచి ఉదయమే పాదయాత్రగా బయలుదేరి మల్లయ్య పేట మీదుగా రాజమండ్రి దేవీచౌక్ సెంటర్‌కు చేరుకునేసరికి, అప్పటికే అక్కడ గుమిగూడిన వైసీపీ కార్యకర్తలు... రైతులను దుర్భాషలాడుతూ వాటర్ బాటిల్‌తో దాడి చేశారు. దాడిని రైతులు, మహిళలు ధీటుగా ఎదుర్కొన్నారు. వాటర్ బాటిల్ తగిలి ఓ రైతు తలకు గాయమైంది. అక్కడి నుంచి అప్సర థియేటర్, శ్యామల సెంటర్ మీదుగా మున్సిపల్ స్టేడియానికి పాదయాత్ర చేరుకుంది. భోజనం అనంతరం యాత్ర మోరంపూడి వైపు సాగింది. రైతులకు సంఘీభావం తెలిపేందుకు వివిధ పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలిరావడంతో రహదారులన్నీ కిటకిటలాడాయి. రెట్టించిన ఉత్సాహంతో పాదయాత్ర నిర్వహించారు. టీడీపీ రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, నాయకులు గన్ని కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, పెద్దాపురం శాసనసభ్యులు, నిమ్మకాయల చిన్న రాజప్ప, రాష్ట్ర నాయకుడు దేవినేని ఉమామహేశ్వరరావు , జనసేన పార్టీ కి చెందిన కందుల దుర్గేష్, అనుశ్రీ సత్యనారాయణ, బీజేపీ నాయకులు, సీపీఐ నగర కార్యదర్శి వంగలపూడి కొండలరావు, ఉండరపు రాంబాబు, ఎస్ రమణ, కే అప్పలనాయుడు, వెంకట్రావు, జట్ల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ నల్ల రామారావు, నగర కమిటీ, సేపెని రవణమ్మ, వానపల్లి సూర్యనారాయణ, నల్ల భ్రమరాంబ, ఏ శంకర్రావు, కేరళ కృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ సునీల్ తదితరులు సంఘీభావం ప్రకటించి యాత్రలో పాల్గొన్నారు.

రైతుల మహాపాదయాత్రకు సీపీఐ సంపూర్ణ మద్దతు

విశాలాంధ్ర-కాకినాడ : అమరావతి టూ అరసవిల్లికి జరుగుతున్న రైతుల మహా పాదయాత్రకు సీపీఐ శ్రేణులు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. మంగళవారం సీపీఐ నాయకులు మహా పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఐ రాజమహేంద్రవరం నగర కార్యదర్శి వి.కొండలరావు, జట్లు లేబర్ యూనియన్ అధ్యక్షులు కుంద్రపు రాంబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో ప్రాంతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టిందని అన్నారు. ఉత్తరాంధ్రను రియల్ ఎస్టేట్ వ్యాపారంగా చేయాలన్న ఉద్దేశంతోనే మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తీసుకువచ్చి ప్రజల్లో గందరగోళాన్ని నింపిందని తెలిపారు. రాజధాని అమరావతికి భూములు ఇచ్చిన రైతుల కడుపు కొట్టి మూడు ముక్కల ఆటలు ఆడుతోందని వారన్నారు. రైతులు మహా పాదయాత్ర చేస్తుంటే ఓర్వలేని వైసీపీ ప్రభుత్వం దాడులకు తెగబడుతోందని, ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని తెలిపారు. రైతులు శాంతియుతంగా పాదయాత్ర చేస్తుంటే వైసీపీ మరోపక్క రెచ్చగొట్టే ధోరణితో మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడుతున్నారని అన్నారు. ఇది మంచిది కాదని, ఇప్పటికైనా వైసీపీ ప్రభుత్వం కళ్లు తెరిచి ఒకే రాష్ట్రం ఒకే రాజధాని, అదే మన అమరావతి అని ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ తరపున తాము కూడా ఆందోళనకు దిగుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జట్లు లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, నిర్వాహక కార్యదర్శి నల్ల రామారావు, నగర కమిటీ సభ్యులు సేపేని రమణమ్మ, వానపల్లి సూర్యనారాయణ, ఆచంట శంకర్రావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు చింతలపూడి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

బాబు, పవన్ ముసుగు దొంగలు

- నిజ స్వరూపం బట్టబయలైంది
- ముమ్మాటికీ ప్యాకేజీ కల్యాణే!
- మంత్రులు జోగి, అమర్‌నాథ్, ఎమ్మెల్యే పేర్నినాని

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబు-పవన్ కల్యాణ్ ముసుగు దొంగలు... వారి ముసుగు తొలగిపోయింది...ముసుగు దొంగలిద్దరూ ఒక చోటకు చేరిపోయారని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రా మయ్య (నాని) ధ్వజమెత్తారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం జోగి రమేష్, గుడివాడ అమర్‌నాథ్, పేర్ని నాని వేర్వేరుగా విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. జోగి మాట్లాడుతూ... విజయవాడ నోవోటెల్ హోటల్ సాక్షిగా బాబు, పవన్ ముసుగు తొలగిపోయిందని, ప్రజల సందిగ్ధం కూడా తీరిపోయిందన్నారు. వీరిద్దరూ కలుస్తారని తాము ఎప్పటి నుంచో చెబుతున్నామన్నారు. ప్యాకేజీ స్టార్ అంటే పవన్ కల్యాణ్ రెచ్చిపోతున్నారనీ, మళ్లీ మళ్లీ చెబుతున్నాం...పవన్ కల్యాణ్ ప్యాకేజీ కల్యాణేనని విమర్శించారు. సినిమాల్లో ఏవిధంగా నటిస్తున్నాడో, రాజకీయ జీవితంలో కూడా ముసుగు వీరుడిలా నటిస్తున్నారన్నారు. 2014 లో జనసేన పార్టీ పెట్టాక తన పార్టీని అధికారంలోకి తీసుకు వస్తానని, నేనే ముఖ్యమంత్రిని అవుతానని ఏనాడైనా పవన్ కల్యాణ్ అన్నాడా? అని ప్రశ్నించారు. ప్యాకేజీ అంటే పవన్‌కు కోపం వస్తోంది కానీ, మంగళగిరిలో జనసేనకు పార్టీ కార్యాలయాన్ని ఎవరు ఇచ్చారంటూ ప్రశ్నించారు. పవన్ కల్యాణ్‌కు పొత్తులపై స్పష్టత ఉందనీ, బీజేపీతో విడాకులు ఇచ్చి టీడీపీతో జత కట్టాల నుకున్నాడు కాబట్టే అంతలా రెచ్చిపోయి మాట్లాడాడని పేర్కొన్నారు. విశాఖ రాజధాని కావాలంటూ ఉత్తరాంధ్ర ప్రజలంతా విశాఖ గర్జనలో గొంతెత్తి చాటారన్నారు.ఆ గర్జన విజయవంతం కావడంతో కడుపు మంటతో మంత్రులపై, కర్రలు, రాళ్లతో దాడి చేశారన్నారు. పవన్‌కు ఒక సిద్ధాంతం ఉందా అని ప్రశ్నించారు.

రాజకీయాల్లో పవన్ ఒక విలన్ : రాష్ట్ర రాజకీయాల్లో పవన్ ఒక విలన్‌గా మారిపోయారని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. చంద్రబాబు తో కలిసి కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్నారన్నారు. విశాఖ గర్జన నుంచి ప్రజల దృష్టిని మరల్చడమే వారి లక్ష్యమని, అందుకే ఈ అనైతిక రాజకీయాలకు పాల్పడు తున్నారని పేర్కొన్నారు. ఇన్నాళ్లూ ముసుగులో రాజకీయాలు చేశారని, ఇవాళ ఇద్దరూ ముసుగు తొలగించారన్నారు. మీరు కలిస్తే కలవండి, మాపై ఎందుకు విమర్శలంటూ నిలదీశారు. పీకే అంటే ప్యాకేజీల పవన్‌కల్యాణ్ అన్నారు. వంగవీటి రంగా గురించి పవన్ మాట్లాడటానికి సిగ్గు ఉందా? అని మండిపడ్డారు.

చంద్రబాబుకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యం

దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ ముసుగు తొలగిపోయిందని వైసీపీ ఎమ్మెల్యే పేర్ని నాని ఎద్దేవా చేశారు. ముసుగు వెనుక చంద్రబాబు గులాంగిరి ఉందని, చంద్రబాబుకు లబ్ధి చేకూర్చడమే పవన్ లక్ష్యమన్నారు. పవన్‌కు దమ్ముంటే 175 సీట్లలో పోటీ చేయాలని, అలా పోటీ చేస్తే తాము ప్యాకేజీ స్టార్ అని పిలవబోమన్నారు. మాకు రెండు కాళ్లకూ చెప్పులున్నాయని, చెప్పు తీసి సినిమా డైలాగులు చెబితే పవన్ నోటి తీట తీరుతుందని హెచ్చరించారు. సీఎం జగన్ ప్రభుత్వ హయాంలో కాపులకు అధిక ప్రాధాన్యతిస్తున్నారని, అందుకే పవన్‌కు కోపం వస్తోందన్నారు.

శ్రీయుత ప్రత్యేక కలెక్టరు (భూసే) తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు వారి కార్యవర్తనములు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఫారం నెం. 7

ఆర్సీ నెం. ఎ3/43/2021 తేది: 14.10.2022

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్ (1) ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈక్రింది షెడ్యూలులో నిర్దిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణములను 0.44 ఎకరములు ప్రజాప్రయోజనముకొరకై అనగా 9ఆర్ మేజర్ క్రింద శ్రీకొలను డిస్ట్రిబ్యూటరీ (బిసి) జి.కె.ఎస్. కెనాల్ (యస్‌ఎఫ్‌సి) ఎక్స్టెన్షన్ నిర్మాణము కొరకు నెల్లూరు జిల్లా, ఎ.ఎస్.పేట మండలం, చందులూరుపాడు గ్రామమునకు సంబంధించిన భూములు కావలెనని శ్రీ ప్రత్యేక కలెక్టర్, తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు వారు భావించినందున, 2013 సంవత్సరం 30వ చట్టంలోని 15వ విభాగంననుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములను విచారణ జరిపిన పిమ్మట వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనము నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరం 2022-23నకు సమకూర్చినారు. ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

శ్రీయుత ప్రత్యేక కలెక్టర్, తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు వారు 2013 వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి ఈ 9ఆర్ మేజర్ క్రింద శ్రీకొలను డిస్ట్రిబ్యూటరీ (బిసి) జికెఎస్ కెనాల్ (యస్‌యఫ్‌సి) ఎక్స్టెన్షన్ నిర్మాణము కొరకు అవసరమైనవని ఇందుమూలముగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా : శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు మండలం : ఎ.యస్.పేట గ్రామం : చందులూరుపాడు

క్ర.స	సర్వేనెం సబ్ డివిజన్ నెం.	మొత్తం విస్తీర్ణం ఎ.సె	భూసేకరణ క్రింద విస్తీర్ణం ఎ.సెం.	తరగతి	సంబంధిత ఆసామి పేరు, చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు,కట్టడాలు పంటవివరాలు
30ఆర్‌డిపిలోని 9ఆర్ మేజరు యొక్క శ్రీకొలను డిస్ట్రిబ్యూటరీ (బిసి) జికెఎస్ కెనాల్ (యస్‌యఫ్‌సి) ఎక్స్టెన్షన్ కి.మి 0.000 నుండి కి.మి 0.125 వరకు										
01.	213/5ఎ2	0.15	0.15	పట్టా మెట్ట	షేక్ బీబీజాన్ భర్త అబ్దుల్ రహిమాన్	185	214	227	211	సాగుభూమి
02.	212/7బి	0.13	0.13	పట్టా మెట్ట	బొమ్మించు హజరత్తయ్య తండ్రి దశరథరామయ్య	211	214	213	210	సాగుభూమి
	మొత్తం	0.28	0.28							
33ఆర్‌డిసిలోని 9ఆర్ ఆర్ మేజరు యొక్క శ్రీకొలను డిస్ట్రిబ్యూటరీ (బిసి) జికెఎస్ కెనాల్ (యస్‌యఫ్‌సి) ఎక్స్టెన్షన్ కి.మి0.000 నుండి కి.మి0.075 వరకు										
03.	218/2ఎ2	0.06	0.06	పట్టా మెట్ట	సోమిరెడ్డి యానాదిరెడ్డి తండ్రి చలమారెడ్డి	217	222	223	219	సాగుభూమి
04.	218/3బి	0.04	0.04	పట్టా మెట్ట	పిచ్చాల హజరత్తయ్య తండ్రి లేట్ కొండారెడ్డి	217	222	223	219	సాగుభూమి
05.	218/4ఎ2	0.06	0.06	పట్టా మెట్ట	సోమిరెడ్డి యానాదిరెడ్డి తండ్రి చలమారెడ్డి	217	222	223	219	సాగుభూమి
	మొత్తం	0.16	0.16							
వెరశి మొత్తం		0.44	0.44							

ఈ భూముల ప్లాను శ్రీస్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసే), సోమశిల ప్రాజెక్టు, ఆత్మకూరు వారి కార్యాలయంలో ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పనివేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకోవచ్చును. ఈ భూసేకరణ వలన నిర్వాసితులయిన వారు ఎవరునూ లేరు.

బొగ్గు ఘనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలోగాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణము కొరకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వుట గాని తొలగించుట గాని చేయవలెను.

సం/- ఎం.వి. సుధాకర్, ఎం.ఎ., బిఈడి.,

ప్రత్యేక కలెక్టర్ (ఎఫ్ఏసి), తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

కలెక్టర్ వారి కార్యాలయం, అమలాపురం

Ref. G4/852/2020 **ఫారం (నమూనా) నెం.VII** Dt. 17-10-2022

(2013వ సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియామవళి 2014లో రూల్ 25, సబ్ రూల్ (1) ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్టపరిచిన భూములను మరియు వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనముల్కై అనగా **అమలాపురం మండలం పేరూరు శివారు చిందాడగరువు గ్రామము నందలి** భూమి ప్రజాహిత కార్యాలకు అనగా ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణమునకు భూమి అవసరమైనట్లు కలెక్టరు డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం వారు భావించినందున భూసేకరణ నష్ట పరిహారం, పునరావాస, పునఃస్థాపన కల్పన చట్టము - 2013 (30/2013)నందలి 15వ విభాగమునుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరు వారు సంతృప్తి చెంది ఈ షెడ్యూలు దాఖలా అనగా అమలాపురం మండలం పేరూరు శివారు చిందాడగరువు గ్రామమునందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా **ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మించుటకుగాను కలెక్టర్, డా.బి.అర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం** వారు భూసేకరణ చేయుటకుగాను నిర్ణయించినారు. ఈ క్రింది రూఢీ ప్రకటన భూసేకరణ నష్టపరిహారము, పునరావాస, పునఃస్థాపన కల్పన చట్టము - 2013 (30/2013) నందలి 19(1) విభాగమునుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరు వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు **ఏ.3.84** సెంట్లు మరియు సుమారుగా వాటి విస్తీర్ణములను ప్రజా ప్రయోజనమునకై అనగా ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మించుటకుగాను భూమి సేకరించుటకుగాను అవసరమై ఉన్నదని ఇందుమూలముగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

గ్రామం : పేరూరు శివారు చిందాడగరువు మండలము : అమలాపురం జిల్లా : డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

క్ర నెం.	సర్వే నెం	తరగతి	మొత్తం విస్తీర్ణం ఏ. సెంట్లు	భూసేకరణకు ప్రతిపాదించిన భూమి ఏ.సెంట్లు	భూయజమాని/ఆసక్తిగల ఆసామి పేరు / చిరునామా	సరిహద్దులు ఉత్తరం	తూర్పు	దక్షిణం	పడమర	చెట్లు కట్టడముల వివరములు
1	2	3	4	5	6	7	8	9	10	11
1	638/1	జి.పుంజ	1.3	0.4284	నడింపల్లి వెంకట సూర్యనారాయణ రాజు తండ్రి సత్యనారాయణరాజు	గ్రామ నెం.24 అమలాపురం	638/2	638/3ఎ	636	కొబ్బరిచెట్లు-33 తాడిచెట్లు-9
2	638/1	జి.పుంజ	1.3	0.4083	నడింపల్లి వెంకట రమణ భర్త రామకృష్ణం రాజు	గ్రామ నెం.24 అమలాపురం	638/2	638/3ఎ	636	
3	638/1	జి.పుంజ	1.3	0.4083	నడింపల్లి సూర్యనారాయణ రాజు తండ్రి సత్యనారాయణరాజు	గ్రామ నెం.24 అమలాపురం	638/2	638/3ఎ	636	కొబ్బరి చెట్లు-11 తాడిచెట్లు-3
4	638/1	జి.పుంజ	1.3	0.0275	పిల్లా శ్రీనివాస్ తండ్రి దానయ్య నాయుడు	గ్రామ నెం.24 అమలాపురం	638/2	638/3ఎ	636	0
5	638/1	జి.పుంజ	1.3	0.0275	పచ్చిగోళ్ల సుబ్బరాజు తండ్రి సుబ్బారావు పిల్లా సూర్యకుమారి భర్త శ్రీనివాస్	గ్రామ నెం.24 అమలాపురం	638/2	638/3ఎ	636	0
6	638/2	జి.పుంజ	2.54	0.89334	నడింపల్లి వెంకట సూర్యనారాయణ రాజు తండ్రి సత్యనారాయణరాజు	గ్రామ నెం.24 అమలాపురం	గ్రామ నెం.25 సమనస	638/3ఎ	638/1	కొబ్బరి చెట్లు-76 తాడిచెట్లు - 6 అరటి-5
7	638/2	జి.పుంజ	2.54	0.82333	నడింపల్లి సుధారాణి తండ్రి రామకృష్ణం రాజు	గ్రామ నెం.24 అమలాపురం	గ్రామ నెం.25 సమనస	638/3ఎ	638/1	కొబ్బరి చెట్లు-9 తాడిచెట్లు -6
8	638/2	జి.పుంజ	2.54	0.82333	నడింపల్లి సూర్యనారాయణ రాజు తండ్రి సత్యనారాయణరాజు	గ్రామ నెం.24 అమలాపురం	గ్రామ నెం.25 సమనస	638/3ఎ	638/1	కొబ్బరి చెట్లు-10 తాడిచెట్లు -3
మొత్తం				3.84						

ప్రతిపాదిత భూమి/భూములకు సంబంధించిన పటములు జిల్లా కలెక్టరు వారి కార్యాలయమునందు అందుబాటులో ఉంచడమైనది మరియు సదరు పటములను కార్యాలయపు పనివేళలో పరిశీలన చేసుకొనవచ్చును.

1. ప్రస్తుత భూసేకరణ నందు భూసేకరణ చట్టము ప్రకారము సెక్షను 16 ప్రకారము నిర్వాసితులైన కుటుంబాలను గుర్తించుటకు సర్వే నిర్వహించడమైనది. చిందాడగరువు హెచ్/ఓ. పేరూరు నందలి సర్వే నెం.638/1, 638/2 నందలి ఎ 3.84 సెంట్లు భూమి ప్రజాహిత కార్యాలకు అనగా ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మించుటకుగాను భూసేకరణకు ఉద్దేశించినది.
2. ప్రతిపాదిత భూసేకరణ వలన నిర్వాసితులగు కుటుంబములు ఏమియు లేవు.
3. ప్రతిపాదిత భూసేకరణలో భూములు కోల్పోయినప్పటికి వీరికి జీవనోపాధికి సరిపడు ఆదాయము ఇతర ఆదాయ వనరుల ద్వారా వచ్చుటచే ఈ భూసేకరణ వలన వీరి జీవనోపాధికి ఎటువంటి ఆటంకము ఏర్పడదు.
4. ప్రతిపాదిత భూసేకరణ నందు భూమి కోల్పోతున్న రైతులు తప్ప ఎటువంటి చేతివృత్తులు వారు నివసించుట లేదు.
5. ప్రతిపాదిత భూమి కోల్పోతున్న రైతుల యొక్క జీవన భృతికి ఎటువంటి ఆటంకం లేనందున, ప్రతిపాదిత భూసేకరణ నందు భూమి కోల్పోతున్న రైతులు తప్ప ఎటువంటి చేతి వృత్తుల వారు ఆధారపడి లేనందున, భూమి కోల్పోతున్న రైతులకు భూసేకరణ పునరావాసం, పునఃస్థాపన చేయనవసరం లేదు.
6. ప్రతిపాదిత భూములలో బొగ్గు, ఇనుము మరియు ఇతర ఖనిజములు ఉన్నయెడల, ప్రాజెక్టు నిర్మాణములో భాగములుగా సదరు ఖనిజములు త్రవ్వి తొలగించబడును. సదరు అవసరము నిమిత్తం మరల భూసేకరణ అవసరం లేదు.

సం/- **హిమాన్షు శుక్లా ఐ.ఎ.ఎస్, కలెక్టరు, జిల్లా మేజిస్ట్రేటు,**

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమజిల్లా, అమలాపురం

సంపాదకీయం

ఉత్తేజం కలిగించిన సీపీఐ 24వ మహాసభ

గత శుక్రవారం నుంచి మంగళవారం దాకా రాజకీయ చైతన్యానికి మారు పేరైన విజయవాడలో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 24వ జాతీయ మహాసభల్లో పార్టీ శ్రేణులకు ఉత్తేజం కలిగించడం మాత్రమే కాకుండా నిర్దిష్టమైన మార్గనిర్దేశం చేశాయి. మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం సంఘ్‌పరివార్ నిర్దేశంతో కొనసాగిస్తున్న విద్వేష ప్రచారాన్ని, మతతత్వాన్ని, ముఖ్యంగా మైనారిటీలను అందులో మరీ ప్రధానంగా ముస్లింలపై నిరంతర దాడులను నిరోధించడానికి పోరాడాలని ఈ మహాసభల్లో నిర్ణయించారు. 2024 ఎన్నికలలో కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించడమే ప్రధాన లక్ష్యంగా వామ పక్ష ప్రజాతంత్ర శక్తులను ఐక్యం చేస్తామని, ఇందులో సీపీఐ అగ్రభాగాన నిలవాలని మార్గ నిర్దేశం చేశారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక, నియంతృత్వ విధానాలను వ్యతిరేకిస్తూ పోరాటాలను మరింత ఉధృతం చేయవలసిన అవసరాన్ని ఈ మహాసభలో నొక్కి చెప్పారు. దేశంలో నెలకొన్న రాజకీయ, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో కచ్చితమైన దిశా నిర్దేశం చేయడం మీద ఈ మహాసభల్లో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఈ అంశాలపై మహాసభల్లో నిర్దిష్టమైన, సమగ్రమైన, నిర్మాణాత్మక చర్చలు జరిగాయి. మోదీ సర్కారు అనుసరిస్తున్న రాజ్యాంగ విరుద్ధ చర్యలపై, రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేయడంపై, రాజకీయ ప్రత్యర్థులపై కక్ష తీర్చుకోవడానికి కేంద్ర ప్రభుత్వ అధీనంలోని సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ (ఈది) గూఢచారశాఖ వంటి వాటిని దుర్వినియోగం చేస్తున్న తీరు ఈ మహాసభల్లో ప్రధానంగా చర్చకు వచ్చింది. సంఘ్ పరివార్, బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక చర్యలపైన వీధి వీధిన ప్రజల్లో చైతన్యం రగిలించవలసిన ఆవశ్యకత మీద ఈ మహాసభ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ప్రజా చైతన్యం ద్వారానే ఈ దుష్ట శక్తులకు వ్యతిరేకంగా పోరాటం సాధ్యం అవుతుందని ఈ మహాసభ గుర్తించింది. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగం, లౌకిక వాదాలను పరిరక్షించడానికి సీపీఐ కొనసాగిస్తున్న పోరాటాన్ని మరింత తీవ్రం చేయవలసిన అగత్యాన్ని ఈ మహాసభ నిర్దిష్టంగా అంచనా వేసింది. ఈ పోరాటాలకు ఉద్యుక్తులు కావాలని పార్టీ శ్రేణులకు పిలుపు ఇచ్చింది. మోదీ వినాశకర విధానాలతో దేశం సంక్షోభంలో కూరుకుపోతోంది. నిరంతరం ధరల పెరుగుదలవల్ల సామాన్యుడి బతుకు దుర్భరమవుతోంది. మోదీ ఎనిమిదేళ్ల పాలన ప్రజా వ్యతిరేక, రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేకతకు ప్రభుత్వంగా తయారైంది. అధికార యంత్రాంగ దుర్వినియోగాన్ని మోదీ పాలన పరాకాష్ఠకు తీసుకెళ్లింది. పార్టీ ఫిరాయింపులను యథేచ్ఛగా కొనసాగిస్తూ, ఆపరేషన్ లోటస్ పేరుతో ప్రత్యర్థి పక్షాల శాసనసభ్యులను డబ్బు కుమ్మరించి కొనేయడం ప్రజలెన్నుకున్న ప్రతినిధులు గుట్టు చప్పుడు కాకుండా రాత్రికి రాత్రి బీజేపీ ప్రతినిధులై పోవడం ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టించడమే. ప్రజా తీర్పును ఏ మాత్రం ఖాతరు చేయకుండా మోదీ ప్రభుత్వం ప్రత్యర్థి పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల ప్రభుత్వాలను పడగొడ్తోంది. మెజారిటీకి ఆమడ దూరంలో ఉన్న రాష్ట్రాలలోనూ డబ్బు సంచులు గుమ్మరించి అత్యంత అప్రజాస్వామిక పద్ధతిలో బీజేపీ ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తోంది.

డబ్బు ఆశ చూపి తమ వేపు తిప్పుకోవడం సాధ్యం కాని స్థితిలో వారి మీద సీబీఐ, ఈడీ దాడులు జరిపి అనేకానేక కేసులు మోపుతోంది. ఈ ఒత్తిడికి తాళలేని వారు విధిలేని పరిస్థితుల్లో బీజేపీలో చేరిపోతున్నారు. ఆ తరవాత వారి మీద మోపిన ఆరోపణలు మటుమాయమై పోతున్నాయి. వారు గంగా స్నానం చేసినట్టుగా పునీతులై పోతున్నారు. అలాంటి వారు బీజేపీ తీర్థం పుచ్చుకుంటే వారి మీద ఉన్న ఆరోపణలన్నీ అటకెక్కుతున్నాయి. మోదీ దేశానికంతటికీ ప్రధానమంత్రిని అన్న మాట ఎప్పుడో మరిచిపోయారు. ప్రతి ఏటా ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరిగే పరిస్థితి ఉంది కనక మోదీ ప్రభుత్వ నిర్వహణ బాధ్యతను ఖాతరు చేయకుండా ఎన్నికల ప్రచారంలో నిమగ్నమవుతున్నారు. మొత్తం బీజేపీనే ఆయన ఎన్నికల ప్రచార యంత్రాంగంగా మార్చేశారు. మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత ఆయన మంత్రివర్గ సభ్యుల్లో అత్యధికులు నిగమశర్మ అక్కలా మిగిలిపోతున్నారు. కేంద్ర ప్రభుత్వంలో ముగ్గురు నలుగురు మంత్రుల పేర్లు తప్ప మిగతా వారు ఏ శాఖ నిర్వహిస్తున్నారో, వారి పేరేమిటో కూడా తెలియని అజ్ఞానాంధకరంలోకి మోదీ నెట్టేశారు. తెలిసిన ఆ ముగ్గురు నలుగురు మంత్రులైనా మోదీ కనుసైగల ప్రకారమే నడుచుకోవాలి. ప్రధానమంత్రి కార్యాలయ ఆదేశాలను జవదాటడానికి వీలు లేదు. సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని మోదీ ప్రభుత్వం ప్రజలకు సదుపాయాలు కల్పించడానికో, ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడానికి వినియోగించడం మానేసింది. ఈ పరిజ్ఞానాన్ని ప్రత్యర్థుల మీదే కాక, సొంత మంత్రివర్గ సహచరులపై కూడా నిఘా పెట్టడానికి ఉపయోగిస్తున్నారు. మోదీ ప్రభుత్వం పెగాసస్ లాంటి సాంకేతికతను ప్రత్యర్థుల మీద విసిరే బాణాలుగా మార్చేసింది.

మోదీ ఆర్థిక విధానాలన్నీ కార్పొరేట్ సంస్థలకు జాతి సొత్తు దోచి పెట్టడానికే వినియోగ పడుతున్నాయి. కార్పొరేట్ సంస్థలు లాభాలు మూటగట్టుకునేట్టు చేయడమే మోదీ ప్రధాన లక్ష్యంతోనే పని చేస్తుంది కనక పేదరికం లోంచి నిరుపేదరికంలోకి జారుకుంటున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ఒక్కొక్కటిగా మాయమై పోయి కార్పొరేట్ తిమింగాలలకు సిద్ధాన్నం అందించే దశకు చేరుకున్నాయి. మోదీని ఆశ్రయించే కార్పొరేట్ యజమానులు మాత్రం లాభాలు, సంపద రెట్టింపు చేసుకుంటున్నారు. అంతర్జాతీయ నివేదికలను పరిశీలిస్తే మానవాభివృద్ధి, ప్రజాస్వామ్య స్వేచ్ఛ తదితర రంగంలో మనం అనేక మెట్లు కిందకు దిగాం. ఆకలికి సంబంధించిన సూచికలో మన దేశ పరిస్థితి పాకిస్తాన్, బంగ్లా దేశ్, శ్రీలంక, నేపాల్ కన్నా హీన స్థితిలోకి పడిపోయింది. విద్య, ఆరోగ్యంలాంటివి జనానికి హక్కుగా అందించవలసిన బాధ్యత ప్రభుత్వానిదేనన్న బాధ్యత విస్మరించి వాటినీ ప్రైవేటు పరం చేసి పేదలకు ఈ రెండూ అందకుండా చేస్తోంది మోదీ ప్రభుత్వం. బీజేపీ ఆర్థిక విధానాలకు ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాల కోసం పోరాడవలసిన అవసరాన్ని సీపీఐ 24వ మహాసభ గుర్తించింది. రూపాయి నానాటికీ బలహీన పడుతూ ఉంటే డాలర్ విలువ పెరుగుతోంది చూడండి అని మురిసిపోయే నిర్మలా సీతారామన్ కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉండడం ఈ జాతిజనుల దౌర్భాగ్యం. ఆమె ఈ మాట చెప్పడం కేవలం పరిహాసాస్పదం కాదు. ప్రజలను అవమానించడమే. మోదీ అధికారంలోకి రాక ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేరలేదు. ప్రభుత్వ పెట్టుబడులు ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాలకు తరలిస్తున్నారు తప్ప అభివృద్ధిలో సమతుల్యతపై శ్రద్ధే లేదు. మోదీ తన మనసులో మాట చెప్తారు తప్ప జనం గోడు వినిపించుకోరు. పత్రికల వారిని ఎదుర్కోవాలంటే ఆయన వెన్నులో ఒణుకు పుడ్తుంది. అందుకే ఈ ఎనిమిదేళ్ల కాలంలో ఒక్క సారైనా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన పాపాన పోలేదు. నోరు విప్పితే ఆయన నోట వినిపించేది బూటక వాగ్దానమో, విద్వేష ప్రచారమో, నిక్కమైన అబద్ధమో మాత్రమే. ఈ విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రజాపోరాటాలే మార్గం అని సీపీఐ మహాసభ స్పష్టమైన నిర్ధారణకు వచ్చింది.

మన ఆర్థికం పాములోళ్ల బొమ్మ...!

ఎం కోటేశ్వరరావు

మనదేశాన్ని ఎవరైనాఅవమానిస్తే కచ్చితంగా ఖండించాల్సిందే. 2014కు ముందు మన్మోహన్‌సింగ్ పాలనలో మన దేశపరువుప్రతిష్టలు మురికి గంగలో కలిశాయని ప్రపంచమంతా తిరిగి ప్రధాని నరేంద్రమోదీ వాటిని తిరిగి ప్రతిష్టించారని, లోకమంతా మనవైపు చూస్తోందని కొందరు చెప్పారు. ఇప్పుడు మోదీ ఏలుబడిలో మన ఆర్థిక ప్రగతిని ప్రపంచమంతా గుర్తిస్తోందని, ఐఎంఎఫ్ ప్రశంసే దానికి నిదర్శనం చూడండని చెబుతున్నారు. అటువంటి స్థితిలో మనలను అవమానించే వారికి ఎంత ధైర్యం ఉండాలి. ప్రపంచ జిడిపిలో ఐదవ స్థానంలో ఉన్న మన గురించి ఆఫ్టరాల్ 15 వ స్థానంలో ఉన్న స్పెయిన్ దేశ వారపత్రిక లా వాన్‌గార్డియా అవమానించటమా? మన ఆర్థిక రంగ వృద్ధి తీరుతెన్నులను పాములను ఆడించే వ్యక్తి చిత్రంతో పోల్చి చూపి, అందునా మొదటి పేజీలో విశ్లేషించటమా?ఆర్థికరంగం గురించి రాస్తే రాశారు పో, ఆ బొమ్మ తప్ప మరొకటి దొరకలేదా! దాన్ని మేము ఏల చూడవలె !! హతవిధీ, అని కౌరవరారాజు సుయోధనుడిమాదిరి అనేకమంది రగిలిపోతున్నారు. వారిని అర్ధంచేసుకోవచ్చు. మయసభలో ధుర్యోధనుడికి ఆగ్రహం తాను భ్రమ అనుకున్న నీటి మడుగులో పడినందుకు కాదు, దాన్ని చూసి ద్రౌపది నవ్వినందుకు అన్నది తెలిసిందే. ఈ వార్త కూడా అలాంటిదే. మరో కోణంలో అలాంటి దానికి అవకాశం ఇచ్చిందెవరు అన్న ప్రశ్నను వేసుకోవాలి. అక్టోబరు తొమ్మిదవ తేదీన " భారత ఆర్థిక వేళ " అనే అర్థం వచ్చే శీర్షికతో ప్రచురించిన ఆ వార్త గురించి గత వారం శుక్ర, శనివారాల్లో మన దేశంలోని అనేక టీవీలు, జాతీయ పత్రికల్లో వార్తలతో పాటు పుండు మీద కారం చల్లినట్లుగా సదరు చిత్రాన్ని ముద్రించి మరీ మన పాఠకులకు అందచేశారు. స్పెయిన్ పత్రికను మన దేశంలో కొద్ది మంది ఆ భాష వచ్చిన వారు తప్ప ఎవరూ చదవరు. దాన్ని తీసుకొని మన పత్రికలు బహుళ ప్రచారమిచ్చిన వార్తలు మన ప్రధాని నరేంద్రమోదీకి గౌరవప్రదమా ? మీడియా పెద్దలు ఆలోచించకుండా అలా చేశారని అనుకుందామా? లేక ప్రధాని మెప్పు పొందేందుకు చేసిన విన్యాసమా ?

ఆ స్పానిష్ భాష పత్రికలో మన ఆర్థికరంగం మీద చేసిన విశ్లేషణ సారం ఏమిటో అనువాదం కోసం వెతికినా దొరకలేదు. ఏదైనా కావచ్చు, మన ప్రధాని నేతృత్వంలో ఆర్థికంగా దేశం ఎలా గంతులు వేస్తూ ముందుకు పోతున్నదో రాసి ఉండవచ్చు లేదా ఎలా దిగజారుతున్నదో కూడా చెప్పి ఉండవచ్చు. ఏది రాసినా అసలు అభ్యంతరం అది కాదు. దానికి పాములనాడించే వ్యక్తి చిత్రాన్ని జోడించి ప్రచురించటమే. జనాన్ని కాటువేసే ద్రవ్యోల్బణమనే నాగుపాము బుసలు ప్రపంచమంతటితో పాటు మన దేశంలో కూడా ఉన్నందున దాన్ని బుజ్జగించి బుట్టలో పెట్టేందుకు మోదీ సర్కార్ ఊదుతున్న నాగస్వరానికి చిహ్నంగా ఆ చిత్రాన్ని చూపారా ? అసలు ఆ బొమ్మ వేస్తే తప్పేంటి, పత్రికల్లో అనేక బొమ్మలు వేస్తున్నారు, దాన్ని సానుకూల వైఖరితో ఎందుకు చూడకూడదు అని ప్రశ్నించిన వారు కూడా లేకపోలేదు. ఆర్థికరంగం మాంద్యంలోకి జారకుండా, మన గానానికి అనుగుణంగా నృత్యం చేయిస్తూ ఉన్నతి వైపు తీసుకువెళ్లే ప్రయత్నానికి ప్రతిబింబంగా దాన్ని ఎందుకు పరిగణించకూడదు, ఆత్మన్యూన్యతకు ఎందుకు గురికావాలి? చిన్న వ్యంగ్యాన్ని సహించలేని స్థితికి "ఎదిగామా" అన్నది వారి ప్రశ్న. నూరు పూవులను పూయనివ్వండి-వేయి ఆలోచనలను వికసించనివ్వండి.

పాములను ఆడించే వ్యక్తి చిత్రాన్ని మన దేశానికి ప్రతీకగా చూపటం అవమానించటమే అని కొందరు పేర్కొన్నారు." బలమైన భారత ఆర్థిక రంగానికి ప్రపంచ గుర్తింపు వచ్చింది. దశాబ్దాల స్వాతంత్ర్యం తరువాత కూడా పాములోళ్ల బొమ్మలతో మనల్ని చూపటం బుద్ధిలేని తనం. వారిని వలసవాద భావన నుంచి మరల్చటం సంక్లిష్టమైనది " అని స్పెయిన్ వారపత్రిక కథనం గురించి బెంగలూరు సెంట్రల్ బిజెపి ఎంపీ పిసి మోహన్ అన్నారు. నిజమే, వారిని మార్చటం అంత తేలిక కాదు, విదేశీయులు మారకపోతే మనకు వచ్చే నష్టమేమీ లేదు. మన దేశంలో పాములోళ్ల కాలం నాటి నుంచి ఉన్న, అంధ, మూఢ విశ్వాసాలను, అశాస్త్రీయ అంశాలను జనాల మెదళ్లకు ఒక పథకం ప్రకారం ఇప్పటికీ సరికొత్త పాకింగ్‌లు, రంగులద్ది ఎక్కిస్తున్న మీడియా, రాజకీయ నేతల సంగతేమిటి అన్నది ప్రశ్న.

మన దేశంలో అశాస్త్రీయ అంశాలను నమ్మి, బహిరంగంగా ప్రచారం చేసిన ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగాలను ప్రపంచమంతా చూసి నవ్వుకుంది, దేశాన్ని అపహాస్యం పాలుచేశారు. వినాయకుడికి ఏనుగు తల ఉందంటే అ రోజుల్లోనే మన దేశంలో ప్లాస్టిక్ సర్జన్లు ఉండి ఉండాలని మోదీ చెప్పారు. ఇక ఇంధనం, పైలెట్లతో పని లేకుండా ఎక్కిన వారు ఎటు పొమ్మంటే అటు, పైకీ కిందికీ తిరిగే విమానాల గురించి,క్షిపణుల గురించి చెప్పిన పెద్దమనుషుల విన్యాసాలు మూఢ విశ్వాసాలను పెంపొందించేందుకు, జనం చేత వాటిని గుడ్డిగా నమ్మించేందుకే కదా ! పాములనాడించే వారు పొట్ట కూటికోసం పడిన, పడుతున్న తిప్పల్లో భాగం. మరి వీరు ఎందుకు అలా చేస్తున్నట్లు ? అందువలన దేశానికి జరిగిన అవమానం, అపఖ్యాతి తెచ్చిన వారిని వదలి స్పెయిన్ పత్రిక అవమానించిందని చెపుతున్నవారి చిత్తశుద్ధి ప్రశ్నార్థకం. విదేశీయులు మన దేశానికి వచ్చినపుడు భారతీయులు నాగుల చవితి పేరుతో పాములను పూజించటం, కోతులకు, ఆవులకు మొక్కటాన్ని, ఆవు మూత్రాన్ని తల మీద చల్లుకోవటాన్ని చూశారు. కనిపించిన చెట్టు, పుట్ట, రాతిని పూజించ టాన్ని గమనించారు, భారత్ అంటే అలాగే ఉంటుందన్నట్లుగా రాశారు. దానిలో కొంతఅతిశయోక్తి, చులకనభావం ఉంది. కానీ వందల సంవత్సరాలు గడిచిన తరువాత కూడా అనేక శాస్త్రీయ అంశాలు వెలుగులోకి వచ్చిన తరువాత కూడా జరుగుతున్నదేమిటి ? పాములు పాలు తాగవని తెలిసీ రెచ్చిపోయి పోస్తున్నవారి సంగతేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే మా మనోభావాలను కించపరుస్తున్నారని దెబ్బలాటలకు వస్తారు. ఆ మాటకువస్తే దేవతారూపాలైన పాములను పూజించాలే తప్ప వాటి కోరలు తీసి ఆడించటం, బుట్టలో పెట్టటం దేవతలను అవమానించటంకాదా అని ఎవరైనాఅంటే ? పాములోళ్ల కడుపు మీద కొట్టినట్లే. అంతరిక్షంలోకి పంపే ఉపగ్రహాలు, రాకెట్లను తీసుకు వెళ్లి గ్రామదేవతలు, ఇతరదేవుళ్ల ముందుంచిపడిపోకుండా ఎగిరేట్లుచూడండని వేడుకుంటున్నారు. సాక్షాత్తూ ప్రధాని నరేంద్రమోదీ గోమాత, కామధేనువు అంటూ ఆవులనుపూజిస్తూ ఫోజులిస్తున్న తరువాత, వాటిని ప్రపంచమంతా చూస్తున్నపుడు పాములోళ్ల బొమ్మవేసి ఎవరో అవమానించారు అని గుండెలుబాదుకోవటం కొందరిని సంతుష్టీకరించటంతప్ప మరొకటి కాదు.

ఇక కరోనా మహమ్మారి గురించి ప్రచారం చేసిన మూఢనమ్మకాలు, పిచ్చిపనుల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. గంగామాత ఆశీర్వాదం ఉన్నందున గంగలో మునిగితే కరోనా రాదని చెప్పి కుంభమేళాకు అనుమతిచ్చి పెద్ద ఎత్తున కరోనా వ్యాప్తికి కారకుడైన ఉత్తరాఖండ్ బిజెపి సిఎం నిర్వాకం, తరువాత దాన్ని మధ్యలోనే నిలిపివేసిన ప్రహసనం తెలిసిందే. ఇంతకంటే పరువు తక్కువ పనేముంటుంది. ఆవు మూత్ర తాగింపు పార్టీలు, ఆవు పేడ పూసుకొని గంతులు, పాటలు, భజనలు ఇలా ఎన్నని చెప్పుకోవాలి. వీటన్నింటినీ మన టీవీలు తమ రేటింగ్‌స్‌ను పెంచుకొనేందుకు పెద్ద ఎత్తున చూపిందీ తెలిసిందే. ఇవన్నీ విదేశాల్లో మన ప్రతిష్టను పెంచేవా? వందల మంది మూత్రం తాగేందుకు, పేడ పూసుకొనేందుకు పోటీపడటంతో మూత్రం లీటరు, పేడ కిలో రు.500 చొప్పున ధర పలికింది. అఖిల భారత హిందూ మహాసభ అధ్యక్షుడు స్వామి చక్రపాణి గోమూత్ర పార్టీ ఏర్పాటు చేసి దేశభక్తులందరూ రావాలని కోరారు. అంతే కాదు నరసింహుడి అవతారమే కరోనా అని, మాంసాహారం తినేవారిని శిక్షించేందుకే వచ్చిందని సెలవిచ్చారు. ఆవు మూత్రం తన కేన్సర్‌ను మాయంచేసినట్లు బిజెపి ఎంపీ ప్రజ్ఞాసింగ్ చెప్పిన సంగతి తెలిసిందే. యోగా చేస్తే కరోనా వైరస్ నివారణ అవుతుందని సిఎం యోగి ఆదిత్యనాథ్ చెప్పారు. దీపాలు వెలిగిస్తే కరోనా నశిస్తుందని అదొక సైన్సు అని చెప్పిన వారు, పో కరోనా పో కరోనా అంటూ శాపాలు పెట్టిన వారు, మంత్రాలు చదివిన వారి గురించీ తెలిసిందే. ఇవన్నీ ఓట్ల కోసం చేసే విన్యాసాలే.

కుంచించుకుపోతున్న వృద్ధి

సంజయ్‌రాయ్

కోవిడ్-19 మహమ్మారి విజృంభణ తర్వాత 2021 లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటున్నది. అయితే తాజాగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం, కొనసాగుతున్న యుద్ధం, కోవిడ్ మహమ్మారి వల్ల పెట్టిన ఆంక్షలు, చైనాలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కొనసాగుతున్న మాంద్యం, అమెరికాలో అంచనాలను మించి వినిమయం తగ్గడం తదితర కారణాల వల్ల మళ్లీ వృద్ధిరేటు కుంచించుకు పోతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ వృద్ధి రేటు తరిగిపోతున్నది. 2021 లో వృద్ధిరేటు 6.1 శాతం ఉండగా 2022 లో 3.2 శాతానికి పడిపోయింది. 2023 లో వృద్ధిరేటు మరింతగా 2.9 శాతానికి కుంచించుకుపోతుందని అంచనా. ఆహార వస్తువుల, ఇంధన ధరలు పెరుగుతూ ఉండటం వృద్ధిరేటు కుంచించుకుపోవడానికి కారణం.

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సగటు ద్రవ్యోల్బణం రేటు 7.3 శాతం ఉండవచ్చు. ఆహారం, ఇంధన భద్రతకు ముప్పు కారణంగా అనేక కోట్లలో ప్రజలు దారిద్ర్య రేఖ దిగువకు చేరుకున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగవు లేదా అసలు పెరుగుదలే ఆగిపోవచ్చు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో డాలరుతో కరెన్సీల మారక విలువ మరింత పడిపోయే అవకాశం ఉంది. దీంతో మార్కెట్‌లో కరెన్సీ కష్టాలు ఏర్పడి వస్తువుల ధరలు పడిపోతాయని విశ్లేషిస్తున్నారు. వరల్డ్ ఎకనామిక్ ఔట్‌లుక్ ప్రకారం భారతదేశంలో వృద్ధిరేటు 2022 లో 7.4 శాతం, 2023 లో 6.1 శాతం ఉంటుంది. మన జాతీయ గణాంకాల కార్యాలయం ప్రకారం 2022-23 జూన్ చివరి నాటికి గడిచిన త్రైమాసికంలో అంచనా వేసిన దానికంటే వృద్ధిరేటు మరింత పడిపోతుంది. పట్టణ ప్రాంతాల్లో, కాంట్రాక్టు ఉద్యోగాలు పాక్షికంగా పెరగడం వల్ల కోవిడ్‌కు ముందున్న నాటి కంటే 10 శాతం వినిమయం పెరిగింది.

వ్యవసాయ ఉత్పత్తులు పెరిగినప్పటికీ గ్రామీణ ప్రాంత డిమాండ్‌కు సరిపడినంతగా వృద్ధికాదు అది. గణనీయంగా పరిస్థితులు సేవల రంగం, నిర్మాణ రంగం మెరుగైనప్పటికీ ఉత్పత్తి రంగంలో మాత్రం 5 శాతం తగ్గింది. పారిశ్రామిక రంగం కూడా మెరుగుపడింది. 2022లో జులైతో ముగిసిన నాలుగు నెలల్లో పారిశ్రామిక ఉత్పత్తి 2.4 శాతం పడిపోయింది. 2022 మొదటి మూడునెలల్లో అది 12.8శాతంగా ఉంది. అలాగే 2022ఏప్రిల్- జూన్ మధ్య 17.1 శాతం విద్యుత్ ఉత్పత్తి పెరగగా జులై 2.3శాతం మాత్రమే పెరిగింది. మన్నికగల వినిమయవస్తువుల వృద్ధిలోనూ ఇదే స్థితి. ద్రవ్యోల్బణం పెరుగుదల వల్ల గృహ వినిమయ డిమాండ్ తగ్గింది. ఇతర రంగాలు కూడా పుంజుకోవడం చాలా నిదానంగా ఉంది.

ఇదే సమయంలో దిగుమతులు 37.2 శాతం ఉండగా, ఎగుమతులు 14.57 శాతమే ఉంది. వాణిజ్య వస్తువుల ఉత్పత్తి, లోటు క్రమంగా పెరిగి 28 అమెరికన్ బిలియన్ డాలర్లకు పెరిగింది. ఇక రూపాయి డాలరుతో మారకపు విలువ 80 రూపాయలకు పెరగడంతో దిగుమతుల బిల్లులు తడిసి మోపెడయ్యాయి. మారకపు విలువ పడిపోవడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో మన వస్తువుల రేట్లు గణనీయంగా తగ్గాయి. ద్రవ్యోల్బణం పెరుగుదలను అదుపు చేసేందుకు విదేశీ సెంట్రల్ బ్యాంకులు వడ్డీరేట్లను పెంచడం వల్ల మన పెట్టుబడులు విదేశాలకు వెళ్లకుండా అరికట్టేందుకు ఆర్బీఐ రిపోరేటు పెంచినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆహార ద్రవ్యోల్బణం మళ్లీ పెరిగింది. 2022 ఆగస్టులో ఆహార ద్రవ్యోల్బణం 7.57 శాతంగా నమోదైంది. ఇది పట్టణ ప్రాంతాల్లో 7.64 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 7.48 శాతానికి పెరగడం ఆందోళన కలిగిస్తున్న అంశం. ఇదే కాలంలో కూరగాయల ద్రవ్యోల్బణం 13.23 శాతం పెరగగా, సుగంధ ద్రవ్యాల ధరలు 14.09 శాతం పెరిగాయి. దీనివల్ల పేదల వినిమయం బాగా తగ్గిపోయింది. తక్షణం అన్ని రంగాలు కోలుకోక పోవడానికి కోవిడ్-19 మహమ్మారి కారణం కావచ్చు కానీ, ఆర్థిక రంగం కుదేలు కావడానికి లోతైన కారణాలున్నాయి.

వృత్తి ఆధారం కాని పనులు అంటే వ్యవసాయ రంగంలో అవకాశాలు, వేతన జీవులకు అవకాశాలు గణనీయంగా తగ్గిపోయాయి. మరో ముఖ్యమైన అంశం 15-24 ఏళ్ల మధ్య గల యువతకు పనులు లభ్యం కాకపోవడం ఆందోళనకరంగా ఉంది. 1994 లో ఈ వయసులో ఉన్నవారిలో 43.4 శాతం మందికి ఉపాధి, ఉద్యోగాలు లభించగా అది 2020 నాటికి 23 శాతానికి పడిపోయింది. ఈ వయసులో ఉన్నవారికి అమెరికాలో 42 శాతం ఉపాధి లభించగా, తక్కువ ఆదాయం గల పాకిస్థాన్‌లో 38.9 శాతం, బంగ్లాదేశ్‌లో 35.3 శాతం మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. అంటే మన పొరుగున ఉన్న దేశాల్లో కంటే మన దేశంలో పరిస్థితి అధ్వానంగా ఉంది. కోట్ల ద్యోగాలు కల్పిస్తానని మోదీ చేసిన వాగ్దానం డొల్ల అని చెప్పొచ్చు.

అందరికీ వృద్ధాప్య ఫించన్లు ఇవ్వాలి

ఈ-మెయిల్

వృద్ధాప్యం బాల్యం లాంటిది. అందువల్ల అందరికీ వృద్ధాప్య పింఛను ఇవ్వాలి.(ధనికులైన వృద్ధులకు తప్ప). నిబంధనలుపేరుతో పగవారికి కూడ ఫింఛను రద్దు చేయరాదు. ఎవరూ తోడు లేకపోయినా వృద్ధులకు పింఛను తోడు ఉంటేబతుకు ధీమాగా ఉంటుంది. ప్రభుత్వం వృద్ధాప్యంలో పింఛను గ్యారంటీగా ఇస్తారనే నమ్మకం ఉంటే తన జీవితంలో వత్తిడి లేకుండా ఉత్సాహంగా పని చేస్తారు. పింఛను వస్తే ఎక్కువ మంది అక్రమంగా సంపాదించడానికి ప్రయత్నించరు. అప్పుడు బి.పి.,సుగరు లాంటి రోగాలు రావు. ప్రభుత్వానికి కూడ ఆరోగ్యఖర్చు తగ్గుతుంది. బాల్యంలో తల్లి దండ్రులు బిడ్డల యోగ క్షేమాలు చూసుకుంటారు.మరో బాల్యమైన వృద్ధాప్యంలో ఎవరికీ తల్లి దండ్రులు ఉండరు. ఎవరికైనా ఆర్థికకష్టాలు కన్న హింసమరొకటి ఉండదు. వృద్ధులకు అయితే ఆర్థిక ఇబ్బందులు మరింతగా బాధిస్తాయి. నాగరిక,ప్రజాస్వామ్య సమాజంలో జంతువులు,పక్షులు మాదిరిగా వృద్ధాప్యంలో ఆర్థిక కష్టాలు, అనారోగ్య ఇబ్బందులు గురి కాకూడదు.

మహిళా, శిశు సంరక్షణకు అంగనువాడి కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లే వృద్ధులకు సంరక్షణ కేంద్రాను నిర్వహించాలి. వృద్ధాప్యంలో ఆత్మ గౌరవంతో,స్వేచ్ఛగా, ఉత్సాహంగా జీవించడానికి పింఛను అత్యవసరం. ప్రభుత్వ ఉద్యోగులకు, ఎమ్మెల్యేలకు,ఎమ్.పీ లకే కాకుండా ప్రజలంతా జీవించడానికి సేవ చేస్తున్న వ్యవసాయకూలీలకు,కౌలు రైతులకు, చిన్న,సన్నకారు రైతులకు, కార్మికులకు, చిన్న వ్యాపారులు వంటి తక్కువ సంపాదన వర్గాలకు తప్పనిసరిగా వృద్ధాప్య ఫింఛను ఇవ్వాలి. ప్రభుత్వ ధనాన్ని పొదుపు చేయాలనే ఉద్దేశ్యంతో కొన్ని నిబంధనలు పెట్టి కొంతమంది పేద, మధ్య తరగతి వృద్ధులకు ఫింఛనుకు అనర్హులు చేస్తున్నారు .వారి కుమారులకు కరెంట్ బిల్లు ఎక్కువ వస్తున్నదనో, నాలుగు చక్రాలు మోటారు వాహనం ఉందనో, స్థలం ఎక్కువ ఉన్నదనో నిబంధనలతో కొంతమంది వృద్ధులకు ఫించను దూరం చేస్తున్నారు. దీనివల్ల 65,70 సంవత్సరాలు వయసు వచ్చిన వారికి పింఛను రావడం లేదు. మన దేశంలో సరాసరి జీవించే వయసు 68 సంవత్సరాలు మాత్రమే. దీంతో 50 సంవత్సరాల పైగా దేశ ఉత్పత్తిలో పాలు పంచుకున్న కొంతమంది పింఛను తీసుకోకుండానే చనిపోతున్నారు.

బి.బి.రామకృష్ణారావు

దుర్భర స్థితిలో వ్యవసాయ కూలీలు

బొల్లిముంత సాంబశివరావు, సెల్: 9885983526

దేశంలోని మొత్తం కుటుంబాల్లో గ్రామీణ వ్యవసాయ కూలీ కుటుంబాల శాతం అనేక దశాబ్దాలుగా పెరుగుతూనే ఉన్నాయి. ఈ కుటుంబాల్లో కొద్దిపాటి భూమి ఉన్న వారు కూడా భూమిని కోల్పోతున్నారు. తమ రెక్కల కష్టం మీద బతికే ఈ కుటుంబాలు దుర్భరమైన జీవన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. సేద్యపు భూమి లేక ఆదాయం లేక పోవటమే అందుకు కారణం. భూ సంస్కరణల ద్వారా గ్రామీణ పేదలకు భూమి లభించి ఉంటే భూమి లేని కుటుంబాలు చాలా తక్కువగా ఉండేవి.

నేటికీ భారతదేశం వ్యవసాయక దేశమే. నూటికి 68% ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లోనే నివశిస్తున్నారు. గ్రామీణ కుటుంబాల్లో ఎక్కువ కుటుంబాలు వ్యవసాయ కూలీ కుటుంబాలే. "తాకట్టులో భారతదేశం" మార్క్సిస్టు విశ్లేషణ గ్రంథంలో తరిమెల నాగిరెడ్డి చెప్పినట్లు కార్మిక విచారణ కమిటీ రిపోర్టు ప్రకారం 1956-57 నాటికి భారతదేశంలో 66.6 మిలియన్ల గ్రామీణ కుటుంబాలు ఉండగా అందులో 24.5% అంటే 16.3 మిలియన్ల వ్యవసాయ కూలీ కుటుంబాలు ఉన్నాయి. 18 వ జాతీయ నమూనా సర్వే ప్రకారం 1963-64 లో భారతదేశంలో మొత్తం 67.6 మిలియన్ల గ్రామీణ కుటుంబాలు ఉంటే అందులో 17.3 మిలియన్లు అంటే 26% గ్రామీణ కుటుంబాలే ఉన్నాయి. 1901-1969 మధ్య కాలంలో మొత్తం శ్రామికుల్లో వ్యవసాయ కూలీల భాగం 70% నిలకడగా ఉన్నప్పటికీ, మొత్తం జనాభాలో వ్యవసాయ కూలీల భాగం 70% కొంచెం అటు ఇటూగా ఉంటూ వచ్చింది. ఆ కాలంలో లభ్యమైన గణాంకాల వివరాల ప్రకారం దేశంలో మొత్తం గ్రామీణ జనాభా 434 మిలియన్లు అందులో 100 మిలియన్ల జనాభాకి అసలు భూమే లేదు. మొత్తం వ్యవసాయ కుటుంబాల్లో భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాల సంఖ్య 1956-57లో 42% ఉండగా 1963-64 నాటికి 61.2% పెరిగింది. వ్యవసాయ కూలీల విచారణ కమిటీ రిపోర్టు ప్రకారం మొత్తం వ్యవసాయ కూలీల్లో భూమి లేని వారు 1950-51లో 50% ఉండగా 1963-64 నాటికి 61% చేరింది.

1956-57-1963-64 సంవత్సరాల్లో ఉన్న వ్యవసాయ కూలీ కుటుంబాల శాతానికి నేడు ఉన్న వ్యవసాయ కూలీల కుటుంబాల శాతంలో వ్యత్యాసం నామ మాత్రంగానే ఉంది. కొద్ది పాటి భూమి ఉన్న పేద రైతులను

కలుపుకుంటే దేశంలో భూమి లేని వారి సంఖ్య 2002-03లో 60% ఉంది. కోనేరు రంగారావు భూ కమీషన్ రిపోర్టు ప్రకారం 55 నుండి 60% భూములు కౌలు భూములుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి.

కౌలు విధానంపై కొందరు విచిత్రమైన వాదన ముందుకు తెస్తున్నారు. నిర్దిష్టమైన కౌలు విధానం పెట్టుబడిదారీ సంబంధాలను సూచిస్తుందని, కొన్ని రాష్ట్రాల్లో పెట్టుబడిదారీ విధానంలో కౌలు విధానం భాగమని అవగాహన లేమితో వాదిస్తున్నారు. ఫ్యూడల్ వ్యవస్థ ప్రారంభంలో తప్ప నిర్దిష్టమైన కౌలు విధానం ఆ వ్యవస్థలోనే ఆచరణలోకి వచ్చింది. కౌలు సేద్యం భూస్వామ్య వ్యవస్థకు చిహ్నం. ఆ వ్యవస్థలోనే కౌలు పోనూ మిగులు కోసం రైతు శ్రమ సేద్యం చేసేవాడు. ఆ మిగులే కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతుందని భావించాడు. నేడు ధాన్యం లేదా డబ్బు రూపంలో ఉన్న కౌలు విధానం భూస్వామ్య వ్యవస్థకు మరింత బలాన్ని చేకూర్చింది. నిర్దిష్ట కౌలు పెట్టుబడి దారీ విధానంలో భాగమని, కౌలు రైతులు పెరుగుతారని చెప్పటం కౌలు విధానంగురించి అవగాహనలేనివారు చెప్పే మాటలు మాత్రమే. వ్యవసాయం పెట్టుబడిదారీ విధానంలోకి మార్పు చెందితే భూ ఎస్టేట్ దారులు ఏర్పడి చిన్న, సన్నకారు రైతులుకూలీలుగా మారతారు తప్ప కౌలు దారులు పెరగరు.

నాడు, నేడు వ్యవసాయ కూలీల కుటుంబాల జీవితాలు దుర్భరంగా ఉన్నాయి. భూమిపై హక్కు లేక పోవటం, శ్రమకు తగ్గ కూలి లభించక పోవటమే అందుకు కారణం. వ్యవసాయ కూలీల తలసరి ఆదాయం గురించి చర్చ సందర్భంగా భారత రిజర్వు బ్యాంకు సమాచారం ప్రకారం 1967-68లో గ్రామీణ ప్రజానీకంలో 79% దారిద్య్రంలో మగ్గుతున్నారు. నిరుద్యోగం కూడా హెచ్చు స్థాయిలో ఉంది. మెట్ట ప్రాంతంలో 150 రోజులు మాత్రమే పనులు దొరుకుతున్నాయి. నీటి పారుదల ఉన్న ప్రాంతాల్లో నాట్లు, కోతల సమయంలో మాత్రమే ఎక్కువగా పనులు దొరికాయి. ప్రస్తుతం ఉపాధి పనులు గ్రామీణ ప్రజలకు తరిగి పోతున్నాయి. సేద్యంలో యంత్రాల వినియోగం, కాంట్రాక్టు కూలి విధానం అందుకు కారణమైంది. సంవత్సరంలో నాలుగు నెలలకు పైగా దొరికే వ్యవసాయ పనులు నేడు 80 రోజులు కూడా దొరకని పరిస్థితి ఏర్పడింది. పని దినాలు తరిగి పోవటం అనేది ప్రస్తుతం అవసరం లేని యాంత్రీకరణ వలనే.

నాడు, నేడు వ్యవసాయ కూలీ కుటుంబానికి లభిస్తున్న ఆదాయం వలన వారి కుటుంబాల్లో మాత్రం మార్పు రాలేదు. 1950లో వ్యవసాయ కూలీల రోజు వారీ సగటు ఆదాయం 2.97 రూపాయలు. 1956-57 లో 2.03 రూపాయలకు పడిపోయింది. 1964-65 నాటికి 2.97 రూపాయలకు పెరిగింది. సాలీనా సగటు ఆదాయం 1956-57లో 385.38 రూపాయలు కాగా 1963-64 లో 660.89 రూపాయలుగా ఉంది. 2022 సంవత్సరంలో 275-300 రూపాయలగా కూలి లభిస్తున్నది. నేడు కూలి పెరిగిన వ్యవసాయ కూలీల కుటుంబాల జీవితాల్లో ఉన్న దుర్భర పరిస్థితులు మాత్రం మారలేదు. పని దినాలు తరిగిపోవటం, నిత్యావసరాల ధరలు పెరగటం, కుటుంబ అవసరాలు ఎక్కువ కావటం అందుకు కారణమైంది. నేడు మూడు వందలు కూలి లభించినా, 1963-64లో లభించిన కూలే కూలీల కుటుంబాలకు కొంత మెరుగ్గా ఉంది.

1950 నుండి నేటి వరకు గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు, వ్యవసాయ కూలీ కుటుంబాల పరిస్థితుల్లో చెప్పుకోదగ్గ మౌలిక మార్పులు జరగకపోగా ఉపాధి లాంటి సమస్యలు తీవ్రమైనాయి. ఈ సుదీర్ఘ కాలంలో సాంస్కృతికంగా వచ్చిన మార్పులు వస్తు వ్యామోహానికి దారితీసింది తప్ప గ్రామీణపేదల సమస్యలైన భూమి సమస్య, ఉపాధిసమస్యకు పరిష్కారం చూపలేదు. వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు భూస్వామ్య వ్యవస్థను పటిష్టపర్చాయే తప్ప బలహీన పర్చలేదు. విప్లవ భూ సంస్కరణల ద్వారా పేదలకు భూపంపిణీ జరిగినప్పుడే వ్యవసాయకూలీల సమస్యలు పరిష్కార మౌతాయి. అందుకు గ్రామీణ పేదలందరూ ఐక్యంగా ఉద్యమించాలి.

బీజేపీలో చేరాలని ఒత్తిడి చేశారు

- దిల్లీ సీఎం అవ్వండి లేదా జైలుకెళ్లండని సీబీఐ చెప్పింది
- నిజాయతీగా పని చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని చెప్పా
- దిల్లీ ఉప ముఖ్యమంత్రి సిసోడియా

న్యూదిల్లీ: బీజేపీలో చేరాలని సీబీఐ నుంచి ఒత్తిడి వచ్చిందని దిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా అన్నారు. దిల్లీ మద్యం విధానంతో సంబంధం ఉన్న కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ తనను సోమవారం తొమ్మిది గంటల పాటు ప్రశ్నించిన తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సిసోడియా ఉదయం 11.15 గంటలకు సీబీఐ ప్రధాన కార్యాలయానికి చేరుకోగా, ఆయనను నేరుగా మొదటి అంతస్తులోని అవినీతి నిరోధక శాఖ కార్యాలయానికి తీసుకెళ్లారు. సిసోడియాను అరెస్టు చేసే అవకాశం ఉన్నట్లు ఆప్ కన్వీనర్‌తో పాటు ఆ పార్టీ వర్గాలు గతంలోనే చెప్పారు. గుజరాత్ ఎన్నికల్లో ఆప్‌ను కట్టడి చేసేందుకే సిసోడియాను అరెస్టు చేస్తారన్న ప్రచారం కూడా సాగింది. విచారణకు హాజరయ్యే ముందు సిసోడియా ఆప్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ అక్కడి నుంచి రాజ్‌ఘాట్‌కు చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో మద్దతుదారులు సిసోడియా నివాసానికి చేరుకొన్నారు. జేఎల్‌ఎన్ స్టేడియం సమీపంలోని సీబీఐ కార్యాలయానికి వెళ్లే మార్గంలోనూ గుమ్మిగూడారు. ఎమ్మెల్యే అతిషి, ఎంపీ సంజయ్ సింగ్‌తో సహా అనేక మంది ఆప్ నేతలు, కార్యకర్తలు స్టేడియం సమీపంలోని దిల్లీ పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్ల దగ్గర నిరసన తెలిపారు. ఆ తర్వాత సింగ్‌తో పాటు మరో 119 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణకు హాజరు కావాలని సిసోడియాకు తాజా నోటీసులు జారీ చేయలేదని ఆ వర్గాలను ఉటంకిస్తూ పీటీఐ పేర్కొంది. ఈ కేసులో వైపీసీ లోక్‌సభ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి కుమారుడు రాఘవరెడ్డిని కూడా సీబీఐ ప్రశ్నించింది.

'కుంభకోణం లేదు'... ఆపరేషన్ కమలం విజయవంతం చేసేందుకే...

సిసోడియా విలేకరులతో మాట్లాడుతూ ఆప్‌ని విడిచిపెట్టాలని తనపై ఒత్తిడి తెచ్చారని, దిల్లీ ముఖ్యమంత్రి పదవి ఆశచూపారని తెలిపారు. 'రూ.10 వేల కోట్ల ఎక్సైజ్ కుంభకోణం జరిగిందని బీజేపీ చెబుతోంది. ఎలాంటి కుంభకోణం లేదని, కేసు నకిలీదని సీబీఐ కార్యాలయంలో గుర్తించాను. దిల్లీలో బీజేపీ 'ఆపరేషన్ కమలం' విజయవంతం చేసేందుకు నాపై బూటకపు కేసు పెట్టారు. ఇదంతా కుట్ర' అని అన్నారు. 'ఆప్ నుంచి వైదొలగాలని ఒత్తిడి తెచ్చారు. దిల్లీ ముఖ్యమంత్రి పదవి కావాలా లేదా జైలుకు వెళతారా అని బెదిరించారని సిసోడియా అన్నారు.

'నాపై ఉన్న కేసులో ఏమీ లేదని నేను చెప్పినప్పుడు, సత్యేంద్ర జైన్‌పై కూడా ఎటువంటి కేసు లేదని, అయినప్పటికీ అతను జైలులో ఉన్నాడని నాకు చెప్పారు.



అతను ఆరు నెలలు (జైలులో) ఉండగలిగితే, మీరు కూడా ఉండగలరు' అని సిసోడియాతో సీబీఐ అధికారులు చెప్పినట్లు ఒక ఆంగ్ల పత్రిక పేర్కొంది. అవినీతి నిరోధక చట్టం కింద 2017లో సీబీఐ ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీ లాండరింగ్ కేసులో దిల్లీ ఆరోగ్య మంత్రి, ఆప్ నేత సత్యేందర్ జైన్‌తో పాటు మరో ఇద్దరిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసింది. మంత్రికి సంబంధం ఉన్న నాలుగు కంపెనీల ద్వారా మనీ లాండరింగ్ జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికలకు ముందు ఆప్ ప్రచారాన్ని తగ్గించడానికి బీజేపీ చేసిన ప్రయత్నంలో జైన్‌ను అరెస్టు చేసినట్లు ఆప్ పదేపదే పేర్కొంది. పార్టీ ఎన్నికల ఇంచార్జ్‌గా జైన్ ఉన్నారు. 'నేను ఆప్‌లో ఎందుకు ఉన్నానని వారు అడిగారు. పార్టీని విడిచిపెట్టడానికి దిల్లీ సీఎం పదవి ఇస్తామన్నారు. నేను జైలుకు వెళ్లవచ్చుని, నాపై కేసు కొనసాగుతుందని చెప్పారు. నేను రాజకీయాల్లోకి వచ్చింది ముఖ్యమంత్రి కావడానికి కాదని, నిజాయితీగా పని చేసేందుకని, రిక్షా తొక్కేవాడి కొడుకు ఇంజనీర్ అయినందుకు సంతోషంగా ఉందని, సీఎం కావాలనే ఆలోచన లేదని స్పష్టంగా చెప్పాను' అని అన్నారు. కాగా బీజేపీ ఒక 'చెత్త పార్టీ' అని సిసోడియా అన్నారు. ఆప్‌ను వదిలి బీజేపీలో ఎందుకు చేరాలని ఆయన ప్రశ్నించారు.

ఇదిలాఉండగా, సిసోడియాను ఆప్‌ను వీడాలని బెదిరింపులకు పాల్పడిన విషయాన్ని సీబీఐ ఖండించింది. సీబీఐ ఈ ఆరోపణలను గట్టిగా ఖండించింది. ఎఫ్ఐఆర్‌లో ఆయనపై వచ్చిన ఆరోపణల ప్రకారం సిసోడియాను వృత్తిపరమైన, చట్టపరమైన పద్ధతిలో కచ్చితంగా దర్యాప్తు చేశామని తెలిపింది. కేసు దర్యాప్తు చట్ట ప్రకారం కొనసాగుతుందని దర్యాప్తు సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. సిసోడియాపై ఎఫ్ఐఆర్‌లోని ఆరోపణల దర్యాప్తు సందర్భంగా ఇప్పటివరకు సేకరించిన సాక్ష్యాలను కచ్చితంగా పరిశీలించినట్లు సీబీఐ తెలిపింది. ఆయన వాంగ్మూలాన్ని నిర్ణీత సమయంలో ధ్రువీకరించి... దర్యాప్తు అవసరాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటామని సీబీఐ తెలిపింది.

'సన్‌స్క్రీన్' వాడటం లేదు: రాహుల్‌గాంధీ

బెంగళూరు: కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగుతుండటంతో సోమవారం భారత్ జోడో యాత్రకు విరామం ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానికులతో రాహుల్ గాంధీ మాట్లాడారు. కర్ణాటకలో పాదయాత్ర చేస్తున్న రాహుల్ గాంధీతో ఓ వ్యక్తి మాట్లాడుతూ, యాత్రలో చర్మం నల్ల బడకుండా ఎలా కాపాడుకుంటున్నారు? ఏ సన్‌స్క్రీన్ లోషన్ వాడుతున్నారు? అని ప్రశ్నించారు. అప్పుడు రాహుల్ స్పందిస్తూ, తాను ఎటువంటి చర్మ రక్షణ సాధనాలను వాడటం లేదని చెప్పారు. "మా అమ్మ సన్‌స్క్రీన్ లోషన్ పంపించారు, అయితే దానిని నేను వాడటం లేదు" అని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి సోమవారం జరిగిన ఎన్నికల్లో మల్లికార్జున ఖర్గే, శశి థరూర్ పోటీ చేశారు. రాహుల్ గాంధీ కర్ణాటకలోని బళ్లారిలో ఓటు వేశారు. ఈ ఎన్నికల ఫలితాలు ఈనెల 19న వెలువడతాయి. అయితే సన్‌స్క్రీన్ లోషన్ విషయాన్ని కాంగ్రెస్ నేత సుప్రియ భరద్వారాజ్ ఓ ట్వీట్‌లో తెలిపారు. భారత్ జోడో యాత్రలో భాగంగా పాదయాత్ర చేస్తున్న రాహుల్ గాంధీ తన చర్మ సంరక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లేవీ చేసుకోవడం లేదు. తన మృదువైన చర్మం కమిలిపోయి, నల్లబడటాన్ని నివారించగలిగే సన్‌స్క్రీన్ లోషన్‌ను వాడటం లేదు. ఆయనకు కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియా గాంధీ సన్‌స్క్రీన్ లోషన్‌ను పంపినప్పటికీ దానిని ఆయన ఉపయోగించడం లేదని సుప్రియ పేర్కొన్నారు.

'నీట్ పీజీ' కటాఫ్ మార్కుల తగ్గింపు: ఎన్ఎంసీ

న్యూదిల్లీ: మెడికల్ ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్ల కోసం కటాఫ్ మార్కులు తగ్గించేందుకు కేంద్రం ఆమోదం తెలిపిందని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ప్రకటించింది. అధికారిక నోటీసుల ప్రకారం... అన్ని కేటగిరీల్లో కటాఫ్ మార్కులు 25 శాతం తగ్గాయని తెలిపింది. జనరల్ కేటగిరీ అభ్యర్థులకు కటాఫ్ మార్కుల తగ్గిపు 25 శాతం ఉండగా, జనరల్ కేటగిరీలో వికలాంగ అభ్యర్థులకు 20 శాతం, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు, ఈ కేటగిరీల్లో వికలాంగ అభ్యర్థులకు కూడా 15 శాతం కటాఫ్ మార్కుల తగ్గింపు ఉంటుంది. గతేడాది అడ్మిషన్ల కోసం నిర్వహించిన పీజీ కౌన్సెలింగ్‌లో పెద్ద సంఖ్యలో సీట్లు ఖాళీ కావడంతో ఎన్ఎంసీ ఈ నిర్ణయం తీసుకుంది. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) 197 సీట్లను నీట్ యూజీ కౌన్సెలింగ్ మొదటి రౌండ్‌కు కలిపిందని, యూజీ కౌన్సెలింగ్ 2022 మొదటి రౌండ్ ప్రారంభానికి ముందు సంబంధిత కాలేజీలు అందించలేదని పేర్కొంది.

కాంగ్రెస్ ఎమ్మెల్యేపై హత్యాయత్నం కేసు

తిరువనంతపురం: అత్యాచారం ఆరోపణలను ఎదుర్కొంటున్న ప్రతిపక్ష కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎల్దోస్ కున్నప్పిల్లిపై నేర విభాగం (క్రైమ్ బ్రాంచ్) హత్యాయత్నం కింద కూడా కేసు నమోదు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు తనను చంపడానికి ప్రయత్నించాడని బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా ఎమ్మెల్యేపై ఐపీసీ-సెక్షన్ 307 (హత్యా ప్రయత్నం) కింద కూడా అభియోగం నమోదు చేసినట్లు సీనియర్ క్రైమ్ బ్రాంచ్ అధికారి ధృవీకరించారు. ఎమ్మెల్యే తనను అపహరించి అసభ్యంగా ప్రవర్తించినట్లు గతంలో ఫిర్యాదు చేసిన మహిళే ఇప్పుడు తనపై దాడి చేసి హత్యకు ప్రయత్నించినట్లు ఆరోపించడంతో తాజాగా మరో అభియోగం మోపారు. కాగా ఈ విషయమై ఎమ్మెల్యే సమాధానం కోసం కాంగ్రెస్ పార్టీ ఎదురుచూస్తోంది. రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ విలేకరులతో మాట్లాడుతూ... కేపీసీసీ చీఫ్ కే సుధాకరన్ మళ్లీ కూనప్పిల్లిని వివరణ కోరారని, స్పందించకుంటే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పెరుంబవూరు ఎమ్మెల్యే తనను అపహరించి, దాడి చేశారని మహిళ ఫిర్యాదు చేయడంతో అక్టోబరు 11న కేరళ పోలీసులు పెరుంబవూరు కేసు నమోదు చేశారు. సెప్టెంబరు 14న జరిగిన ఒక సంఘటనపై ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు, స్నేహితుడితో సహా ముగ్గురు నిందితులపై కేసు నమోదైంది. కాగా ఆయనపై నమోదైన కేసుకు సంబంధించి రాజీ కుదుర్చుకోడానికి కున్నప్పిల్లి రూ. 30 లక్షలు ఇస్తామన్నారని బాధిత మహిళ పేర్కొంది.

శశికళపై దర్యాప్తు

ఆర్ముగస్వామి కమిషన్ సిఫార్సు

చెన్నై: తమిళనాడులో జస్టిస్ ఆర్ముగస్వామి కమిషన్ నివేదిక సెగలు పుట్టిస్తోంది. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత మరణానికి దారి తీసిన పరిస్థితుల్లో జయలలిత సన్నిహితురాలు వీకే శశికళ వ్యవహారశైలిని తప్పుబడుతూ, ఆమెతోపాటు ఓ ప్రభుత్వ అధికారి, ఆస్పత్రి వైద్యులపై దర్యాప్తు జరపాలని కమిషన్ సిఫారసు చేసింది. జయలలిత మరణంపై జస్టిస్ ఆర్ముగ స్వామి కమిషన్ దర్యాప్తు జరిపి నివేదిక సిద్ధం చేసింది. జయలలిత సుదీర్ఘకాలం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 2016లో మరణించిన సంగతి తెలిసిందే. ఆమె మరణంపై వివాదాస్పద వాదనలు తెరపైకి వచ్చాయి. దీంతో ఆమె మరణానికి దారి తీసిన పరిస్థితులపై దర్యాప్తు జరిపించేందుకు మద్రాస్ హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ ఏ.ఆర్ముగస్వామి నేతృత్వంలో విచారణ కమిషన్‌ను 2017లో ఏర్పాటు చేశారు. ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే 2021లో తమిళనాడులో విజయం సాధించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. జయలలిత మరణానికి దారి తీసిన పరిస్థితులపై దర్యాప్తు జరిపిస్తామని ఎన్నికల్లో చేసిన వాగ్దానాన్ని పునరుద్ఘాటించింది. ఈ ఏడాది ఆగస్టులో జస్టిస్ ఆర్ముగస్వామి కమిషన్ నివేదిక ప్రభుత్వానికి చేరింది. ఈ నివేదికను ప్రభుత్వం మంగళవారం శాసన సభలో ప్రవేశపెట్టింది. ఏఐఏడీఎంకే ప్రభుత్వం ఉన్నప్పుడు తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేసిన డాక్టర్ రామమోహన్ రావు క్రిమినల్ చర్యలకు పాల్పడినట్లు ఈ నివేదిక పేర్కొంది. అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి విజయ భాస్కర్‌పై కూడా పదునైన వ్యాఖ్యలు చేసింది. జయలలిత పరిస్థితిపై అపోలో ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ ప్రతాప్ రెడ్డి తప్పుడు ప్రకటనలు చేశారని పేర్కొంది. అపోలో ఆసుపత్రి యాజమాన్యం గత ఏడాది సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కమిషన్ జడ్జి జస్టిస్ ఆర్ముగ స్వామి పక్షపాతంతో కూడిన వ్యక్తి అని, ఆయనకు మెడికల్ ఇష్యూస్‌ను పరిశీలించగలిగే సామర్థ్యం లేదని తెలిపింది. దీనిపై సుప్రీంకోర్టు స్పందిస్తూ, మెడికల్ బోర్డును ఏర్పాటు చేసే వరకు ఈ కమిషన్ కార్యకలాపాలను నిలిపేయాలని ఆదేశించింది. తమిళనాడులో అత్యంత ప్రజాదరణగల నేతల్లో జయలలిత ఒకరు. ఆమె నాలుగుసార్లు ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. అయితే ఆమెపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. శశికళ, జయలలిత అనేక దశాబ్దాలపాటు సన్నిహితంగా ఉండేవారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శశికళ నాలుగేళ్లపాటు జైలు శిక్ష అనుభవించారు. ఆ తర్వాత ఏఐఏడీఎంకే సారథ్య బాధ్యతలను చేపట్టడానికి విఫలయత్నం చేశారు.

భార్య ఇంటికి రానందని

అత్తారింటికి నిప్పు

ఐదుగురు కుటుంబసభ్యుల సజీవదహనం

చండీగఢ్: పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి వచ్చేందుకు నిరాకరించిందన్న ఆగ్రహంతో రగిలిపోయిన ఓ భర్త ఘాతుకానికి ఒడిగట్టాడు. అత్తవారింటికే నిప్పుపెట్టి భార్యతో పాటు ఐదుగురు కుటుంబ సభ్యుల్ని సజీవదహనం చేశాడు. ఈ ఘోరం జలంధర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు... పుట్టింటికి వెళ్లిన భార్య తన వద్దకు వచ్చేందుకు నిరాకరించడంతో కుల్దీప్‌సింగ్ (30)అనే వ్యక్తి తీవ్ర కలత చెందాడు. అతడి భార్య పరమ్‌జిత్ కౌర్ తన ఇద్దరు పిల్లలతో గడచిన ఐదారు నెలల నుంచి తల్లిదండ్రులతోనే కలిసి ఉంటోంది. అయితే లుధియానాలోని ఖుర్షిద్‌పూర్ గ్రామానికి చెందిన కుల్దీప్‌సింగ్ తమ ఇంటికి తిరిగి వచ్చేయాలని ఒత్తిడి తీసుకొచ్చాడు. కానీ తనను, పిల్లల్ని కుల్దీప్ తరచూ హింసిస్తున్నా డని ఆరోపిస్తూ తిరిగి వెళ్లేందుకు కౌర్ నిరాకరిస్తోంది. దీంతో భార్యతో పాటు నలుగురు కుటుంబ సభ్యులు రాత్రివేళ నిద్రపో తున్న సమయంలో త తో పాటు మరో ఇద్దరిని తీసుకు వెళ్లిన కుల్దీప్... పెట్రోల్ పోసి ఇంటికి నిప్పు పెట్టడంతో వారంతా సజీవదహనమయ్యారని జలంధర్ (రూరల్) ఎస్పీ తెలిపారు. మృతులను పరమ్‌జిత్ కౌర్, ఆమె తండ్రి సుర్జన్ సింగ్, తల్లి జోగిందేరో, ఆమె ఇద్దరు పిల్లలు అర్ష్‌దీప్ (8), అన్మోల్ (5)గా గుర్తించారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతు న్నాయని, హత్య కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అవినీతిపరులు, తీవ్రవాదులు, డ్రగ్స్ మాఫియాకు

స్వర్గధామాలు ఉండవు

వీటి పరిష్కారానికి ప్రపంచ స్పందన అవసరం: మోదీ

న్యూదిల్లీ: అవినీతిపరులు, ఉగ్రవాదులు, మాదక ద్రవ్యాల మాఫియా, వేటగాళ్ల ముఠాలు, వ్యవస్థీకృత నేరాలకు సురక్షితమైన స్వర్గధామాలేవీ లేవని, ఈ ప్రమాదాలను పరిష్కరించడానికి ప్రపంచదేశాలన్నీ స్పందించాలని ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం పిలుపునిచ్చారు. సురక్షితమైన ప్రపంచం 'మన భాగస్వామ్య బాధ్యత' అని, మంచి శక్తులు సహకరించినప్పుడు, నేర శక్తులు పని చేయలేవని అన్నారు. ఇంటర్‌పోల్ 90వ సర్వసభ్య సమావేశంలో మోదీ ప్రసంగిస్తూ అవినీతి, ఆర్థిక నేరాలు అనేక దేశాల పౌరుల సంక్షేమాన్ని దెబ్బతీశాయని అన్నారు. 'అవినీతిపరులు, ఉగ్రవాదులు, మాదక ద్రవ్యాల వ్యాపారులు, వేటగాళ్ల ముఠాలు, వ్యవస్థీకృత నేరాలకు సురక్షిత స్థావరాలు ఉండవు. బెదిరింపులు ప్రపంచవ్యాప్తంగా ఉన్నప్పుడు, ప్రతిస్పందన కేవలం స్థానికంగా ఉండదు' అని ఇక్కడి ప్రగతి మైదానంలో 195 దేశాల ప్రతినిధులు పాల్గొన్న అంతర్జాతీయ కార్యక్రమంలో ఆయన తెలిపారు. అనేక దేశాలను ప్రభావితం చేసిన ఉగ్రవాదం, అవినీతి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వేట, వ్యవస్థీకృత నేరాలను ప్రస్తావిస్తూ, ఈ ప్రమాదాల మార్పు గతం కంటే వేగంగా ఉందని ప్రధాని అన్నారు. ప్రపంచ సంక్షోభాలకు భారతదేశ ప్రతిస్పందనను ప్రధానంగా ప్రస్తావిస్తూ, వాతావరణ లక్ష్యాల నుంచి కోవిడ్ టీకాల వరకు ఎటువంటి సంక్షోభంలోనైనా నాయకత్వం వహించడానికి భారతదేశం సుముఖత చూపిందని మోదీ చెప్పారు. 'దేశాలు, సమాజాలు అంతర్ముఖంగా చూస్తున్న తరుణంలో అంతర్జాతీయ సహకారం కోసం ఎక్కువ, తక్కువ కాదని భారత దేశం పిలుపునిస్తుంది' అని అన్నారు. స్థానిక సంక్షేమం కోసం ప్రపంచ సహకారం భారతదేశం పిలుపు అని కూడా ప్రధాన మంత్రి అన్నారు. నేరాలను అదుపు చేయడంలో, ప్రజల సంక్షేమం కోసం కృషి చేయడంలో ప్రపంచవ్యాప్తంగా పోలీసు బలగాలు నిర్వహిస్తున్న పాత్రలను కొనియాడారు. 'ప్రపంచవ్యాప్తంగా ఉన్న పోలీసు బలగాలు ప్రజలను రక్షించడమే కాకుండా సామాజిక సంక్షేమాన్ని కూడా పెంచుతున్నాయి' అని తెలిపారు.

దావూద్‌పై పాక్ సమాధానం దాటవేత

ఇంటర్‌పోల్ 90వ వార్షిక సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలకు పాకిస్తాన్ నుంచి ఇద్దరు ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాక్‌లో నక్కిన అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం, ముంబై పేలుళ్ల సూత్రధారి హాఫీజ్ సయీద్ గురించి మీడియా వారిని ప్రశ్నించగా.. సమాధానం చెప్పేందుకు నిరాకరించడం గమనార్హం. దిల్లీలో జరుగుతున్న ఈ సమావేశాలకు ఇస్లామాబాద్ నుంచి ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ మోసిన్ బట్‌తో పాటు మరో అధికారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓ జాతీయ మీడియా సంస్థ విలేకరి.. మోసిన్ భట్‌తో మాట్లాడారు. "దావూద్ ఇబ్రహీం, హాఫీజ్ సయీద్ ఎక్కడున్నారు? వారిని భారత్‌కు అప్పగించే అవకాశాలున్నాయా?" అని ఆ విలేకరి ప్రశ్నించారు. అయితే దీనికి సమాధానం చెప్పకుండా ఆయన మౌనంగా ఉన్నారు. ఇలాంటి ప్రశ్నలు అడగొద్దంటూ చేతితో సైగ చేశారు.

బీజేపీ ఓటమికి కలిసిరావాలి

ఏకతాటిపైకి లౌకిక, దళిత, పర్యావరణ శక్తులు: ఏచూరి

కోల్‌కతా: 'హిందూత్వ రాష్ట్ర' ప్రచారకులను ఓడించేందుకు లౌకికవాద పార్టీలతో పాటు దళిత, పర్యావరణ కార్యకర్తలు సహా రాజకీయేతర శక్తులన్నింటినీ ఏకతాటి పైకి తీసుకురావలసిన అవసరం ఉందని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. రాష్ట్ర స్థాయిలో ముందుగా బీజేపీని ఓడించేందుకు కృషి చేయాలని, ఆ తర్వాత జాతీయ స్థాయిలో ఒక ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. దళిత ఉద్యమాలు, పర్యావరణం, వాతావరణ మార్పుల వంటి వివిధ సమస్యల పై ప్రజా ఉద్యమాలను ఏకతాటిపైకి తీసుకురావాలని, తద్వారా వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను బలోపేతం చేయాలని అన్నారు. 'మత విషాన్ని ఓడించేందుకు ఈ ఉద్యమాలకు అతీతంగా లౌకిక పార్టీలను ఏకతాటిపైకి తీసుకురావాల్సిన అవసరం ఉందని సీపీఎం నేత తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ 103వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'హిందుత్వ రాష్ట్ర ప్రచారకులను' ఓడించడానికి ఈ 'విశాల వేదిక' బలోపేతం కావాలని అన్నారు. కొన్ని ప్రాంతీయ పార్టీలు మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతున్నాయని, వాటిని ఏకతాటిపైకి తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలిపారు. 'ప్రత్యామ్నాయాన్ని (బీజేపీకి) సృష్టించడానికి మొదట రాష్ట్ర స్థాయిలో ఇది జరగాలి' అని అన్నారు. బీహార్, ఉత్తరప్రదేశ్‌లలో లౌకిక శక్తులకు భారీ అవకాశాలున్నాయని, అయితే తృణమూల్ కాంగ్రెస్ అధికారంలో ఉన్న పశ్చిమ బెంగాల్‌లో అడ్డంకి ఉందని ఏచూరి తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో పట్టు సాధించేందుకు బీజేపీకి టీఎంసీ అవకాశం కల్పించిందని, రాష్ట్రంలోని అధికార పార్టీ పై సీపీఎం ఆరోపణను పునరుద్ఘాటించారు. మత విద్వేషాన్ని అడ్డుకునేందుకు కమ్యూనిస్టులు, ఇతర వామపక్షాల బలాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యునైటెడ్ ఫ్రంట్, యూపీఏ ప్రభుత్వాలు వరుసగా ఏర్పడిన 1996, 2004 సంవత్సరాలను ఉదహరిస్తూ, 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత ఇదే విధమైన ప్రత్యామ్నాయం వస్తుందని చెప్పారు. 'భారతదేశాన్ని రక్షించడానికి, మార్చడానికి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలను బీజేపీ నియంత్రణలో ఉండకుండా చూసుకోవాలి' అని సీపీఎం నేత అన్నారు. దేశంలో విమానాశ్రయాల నుంచి ఓడరేవుల వరకు అన్నీ ప్రైవేటు రంగానికి అమ్ముడుపోతున్నాయని ఏచూరి ఆరోపించారు. 'గత ఎనిమిదేళ్లలో భారతదేశం స్థానం దిగజారని ప్రపంచ సూచిక లేదు' అని ఆయన అన్నారు. దేశంలో నిరుద్యోగం ఎన్నడూ లేని విధంగా ఉందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తోందని, ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ఏజెన్సీలను ఉపయోగిస్తున్నారని సీపీఎం ప్రధాన కార్యదర్శి ధ్వజమెత్తారు. ఇది ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. దేశాన్ని నిఘా రాష్ట్రంగా మారుస్తున్నారని విమర్శించారు.

గురుగ్రామ్‌లో ఎన్ఐఏ దాడులు

గురుగ్రామ్: ఉగ్రవాదులు, గ్యాంగ్‌స్టర్లు, మాదకద్రవ్యాల స్మగ్లర్ల మధ్య పెరుగుతున్న సంబంధాలకు సంబంధించి ముగ్గురు గ్యాంగ్‌స్టర్ల ఇళ్లు, మాజీ సర్పంచ్ ఇంటిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) మంగళవారం దాడులు నిర్వహించిందని పోలీసు వర్గాలు తెలిపాయి. స్థానిక పోలీసుల బృందాలు, నేర పరిశోధక బృందాలు ఎన్ఐఏ అధికారుల వెంట ఉన్నాయి. నహర్‌పూర్ రూపా ప్రాంతంలోని రాజీవ్ కాలనీలో గ్యాంగ్‌స్టర్ అమిత్ దాగర్, అతని సన్నిహితుడు సందీప్ అలియాస్ బందర్ సోదరుడు అనిల్, కర్తార్ సింగ్ ఇళ్లపై దాడులు నిర్వహించారు. ఉదయం 6 గంటల ప్రాంతంలో ఎన్ఐఏ అధికారులు అక్కడికి చేరుకున్నారు. మూడు ఇళ్లల్లో ప్రత్యేక సోదాలు నిర్వహించారు. దాగర్ భార్యను ఒక గంట పాటు ప్రశ్నించారు. కర్తార్ సింగ్‌ను విచారణకు అదుపులోకి తీసుకున్నట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. సుమారు నాలుగు గంటలపాటు సోదాల అనంతరం ఫరూఖ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముషైద్‌పూర్ గ్రామ మాజీ సర్పంచ్ ఇంట్లో అధికారులు సోదాలు చేశారు. మాజీ సర్పంచ్ ధర్మేందర్‌కు ఎలాంటి గ్యాంగ్‌స్టర్లతో సంబంధాలు లేవని, అధికారుల తీరు తమను ఆశ్చర్యానికి గురిచేస్తోందని ధర్మేందర్ బంధువులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లోనూ 50 చోట్ల ఎన్ఐఏ దాడులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. దేశ, విదేశాల్లో ఉన్న ముఠా నాయకులు, వారి సహచరులు తీవ్రవాద, నేర కార్యకలాపాలకు నాయకత్వం వహిస్తున్నట్లు గుర్తించిన తరువాత ఎన్ఐఏ ఆగస్టు 26 న కేసు నమోదు చేసింది. సెప్టెంబరు 12న దిల్లీ పోలీసుల నుంచి కేసులను స్వాధీనం చేసుకున్న తర్వాత పంజాబ్, హరియాణా, రాజస్థాన్, దిల్లీలో గ్యాంగ్‌స్టర్ల ఇళ్లపై దాడులు నిర్వహించింది. వీరిలో పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్యకు పాల్పడిన గ్యాంగ్‌స్టర్లు కూడా ఉన్నారు. మాదకద్రవ్యాలు, నగదు, నేరారోపణ పత్రాలు, డిజిటల్ పరికరాలు, బినామీ ఆస్తుల వివరాలు, బెదిరింపు లేఖలతో పాటు మందుగుండు సామగ్రితో పాటు ఆరు పిస్టల్స్, రివాల్వర్, షాట్‌గన్ స్వాధీనం చేసుకున్నారు.

శివాజీ గణేశన్ కుమార్తెల పిటిషన్ కొట్టివేత

చెన్నై: చెన్నైలోని అన్నాసాలైలో గల శాంతి థియేటర్ స్థల విక్రయ వివాదానికి సంబంధించి సినీనటుడు శివాజీ గణేశన్ కుమార్తెలు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చింది. తమ తండ్రి ఆస్తుల్లో తమకు సమాన వాటా ఇవ్వకుండా సోదరులైన నటుడు ప్రభు, నిర్మాత రామ్‌కుమార్ మోసగించారంటూ శివాజీ కుమార్తెలు శాంతి, రాజ్వీ హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఆ పిటిషన్‌పై విచారణ జరుగుతుండగానే అన్నాసాలైలోని శాంతి థియేటర్‌కు సంబంధించి కొంత స్థలాన్ని ఓ రియల్ ఎస్టేట్ సంస్థకు విక్రయించడాన్ని సవాల్ చేస్తూ అనుబంధ పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ కృష్ణన్‌రామస్వామి ఎదుట సోమవారం విచారణ జరిగింది. శాంతి థియేటర్ స్థలం అమ్మకానికి సంబంధించి 2010లోనే ఆర్థిక లావాదేవీలు పూర్తయ్యాయని, ఆ స్థలానికి సంబంధించిన వాటాలన్నీ అక్షయ హోమ్స్ రియల్ ఎస్టేట్‌కు బదిలీ అయ్యాయని నటుడు ప్రభు, ఆయన సోదరుడు రామ్‌కుమార్ తరఫు న్యాయవాదులు వివరించారు. ఆ స్థలం విక్రయ, లీజుకిచ్చే వ్యవహారాలన్నీ రియల్ ఎస్టేట్ సంస్థే చూస్తోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆ సంస్థ కొంత స్థలం విక్రయించడాన్ని అడ్డుకోవడం సబబు కాదని అభ్యర్థించారు. ఆ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి కృష్ణన్ రామస్వామి శివాజీ కుమార్తెలు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను తోసిపుచ్చారు.

కేదార్‌నాథ్‌లో కుప్పకూలిన హెలికాప్టర్

పైలట్ సహా ఏడుగురి దుర్మరణం

రుద్రప్రయాగ్: ఉత్తరాఖండ్‌లో ఘోర హెలికాప్టర్ ప్రమాదం జరిగింది. ఇక్కడి కేదార్‌నాథ్ ఆలయం నుంచి గుప్తకాశీకి యాత్రికులను తీసుకువెళుతున్న హెలికాప్టర్ కొండను ఢీకొట్టి కుప్ప కూలిపోయింది. ఈ ప్రమాదంలో హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న ఆరుగురు యాత్రికులు, పైలట్ మొత్తం ఏడుగురు అక్కడికక్కడే మృతిచెందారు. కేదార్‌నాథ్ ఆలయానికి 2 కిలోమీటర్ల దూరంలో ప్రమాదం జరిగింది. ఆర్యన్ ఏవియేషన్‌కు చెందిన బెల్ 407 (విటి-ఆర్‌పిఎన్) హెలికాప్టర్‌లో గరుడ్ చట్టిలోని దేవ్ దర్శిని వద్ద ఉదయం 11.45 గంటలకు మంటలు చెలరేగాయని రుద్రప్రయాగ్ జిల్లా విపత్తు నిర్వహణ అధికారి నందన్ సింగ్ తెలిపారు. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, ఉత్తరాఖండ్, దిల్లీలోని విపత్తు ప్రతిస్పందన దళాల బృందాలు, పోలీసులు మృతదేహాలను కేదార్‌నాథ్ హెలిప్యాడ్‌కు తరలించాయి. మృతులను గుజరాత్‌కు చెందిన పూర్వ రామానుజ్ (26), కృతి బ్రార్ (30), ఉర్వి బ్రార్ (25), తమిళనాడుకు చెందిన సుజాత (56), ప్రేమ్ కుమార్, కలా (60)గా రుద్రప్రయాగ్ విపత్తు నిర్వహణ కార్యాలయం గుర్తించింది. పైలట్ మహారాష్ట్రకు చెందినఅనిల్ సింగ్ (57). హెలికాప్టర్ ప్రమాదానికి 10 నిముషాల ముందు ఆ ప్రాంతంలో భారీ వర్షం కురిసినట్టు ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. ఈ ప్రమాదం కారణంగా కేదార్‌నాథ్ ఆలయానికి హెలికాప్టర్ సేవలను నిలిపివేశారు. దట్టంగా మంచు కురుస్తూ ప్రతికూల వాతావరణం వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా హెలికాప్టర్ ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'కేదార్‌నాథ్ సమీపంలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో పైలట్‌తో సహా అనేకమంది యాత్రికులు మరణించారనే వార్త చాలా బాధాకరం. తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి' అని ముర్ము హిందీలో ట్వీట్ చేశారు. 'ఉత్తరాఖండ్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదం పట్ల వేదన చెందాను. ఈ విషాద సమయంలో, నా ఆలోచనలు మృతుల కుటుంబాలతో ఉన్నాయి' అని ప్రధాని మోదీ ట్వీట్‌లో పేర్కొన్నారు. 'మృతుల కుటుంబాలకు నా హృదయపూర్వక సానుభూతి. ఈ నష్టాన్ని భరించే శక్తిని దేవుడు వారికి ఇవ్వాలని కోరుకుంటున్నాను' అంటూ సింధియా ట్వీట్ చేశారు. రాష్ట్రప్రభుత్వంతో సంప్రదిస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి కూడా హెలికాప్టర్ ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంపై సమగ్ర విచారణకు ఆదేశించారు.

మోదీ దుర్మార్గ పాలన

- రైతుల మహా పాదయాత్రకు అండగా నిలుస్తాం
- మహాసభల స్ఫూర్తితో మరిన్ని పోరాటాలు
- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్వాతంత్ర్యం అనంతరం తొలిసారిగా మోదీ ప్రభుత్వం కేంద్ర రాజ్యాంగ సంస్థలను ఉపయోగించుకుని పెద్ద ఎత్తున బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు పాల్పడుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి, పార్టీ జాతీయ మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ మండిపడ్డారు. నరేంద్ర మోదీ ప్రభుత్వ దుర్మార్గ విధానాలను తిప్పికొట్టి, బీజేపీయేతర శక్తులను ఐక్యం చేసే దిశగా విజయవాడ సీపీఐ జాతీయ మహాసభలు వేదికగా నిలవనున్నాయని, ఈ స్ఫూర్తితో మరిన్ని పోరాటాలు చేపట్టనున్నామని స్పష్టం చేశారు. విజయవాడ గురుదాస్ దాస్ గుప్తా ప్రాంగణం (ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటరు)లో మంగళవారం నారాయణ విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర రంగ సంస్థలను మోదీ ఉపయోగిస్తూ, ప్రతిపక్ష పార్టీలు, లౌకివాదులు, నేతలు, ప్రశ్నించే వారి పైన బరితెగించి దుర్మార్గంగా దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. అవినీతిపరులు, ఆర్థిక ఉగ్రవాదులుగా ఉన్న వారు సైతం మోదీకి జపం చేస్తే వారిపై మాత్రం మినహాయిస్తున్నారని దుయ్యబట్టారు. ఇంతటి దుర్మార్గ పాలన మరెక్కడా లేదని అన్నారు. దేశానికి ఒక దిశ, దశపై పార్టీ మహాసభల్లో అర్థవంతమైన చర్చ జరిగిందని, రాబోయే ఎన్నికల్లో మోదీని సాగనంపడమే ఏకైక లక్ష్యమని నొక్కి చెప్పారు. వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులను కూడగట్టుకుని మోదీని గద్దె దించాలని మహాసభల్లో చర్చించామన్నారు. మోదీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పైనా ప్రాంతీయ పార్టీలను ఏకం చేస్తామని పునరుద్ఘాటించారు. అటు మోదీకి తోడుగా రాష్ట్రంలోనూ జగన్ ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అమరావతి రైతుల మహా పాదయాత్ర పై దాడులకు పాల్పడుతోందన్నారు. నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ అమరావతి రాజధానికి సంపూర్ణ మద్దతిచ్చి, అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల పేరుతో రైతులను మోసగించారన్నారు. పాదయాత్రగా వెళుతున్న రైతులపై రాజమహేంద్రవరంలో ప్రజల చేత ఎన్నుకున్న వైసీపీ ఎంపీ పెట్రోలు పోయించడం, దాడులకు ఉసిగొల్పడం దారుణమైన చర్య అని ఖండించారు. ఇది అమరావతి పై దాడి కాదని, మానవ హక్కులు, ప్రజాస్వామ్యం పైన దాడిగా ఆయన అభివర్ణించారు. పాదయాత్ర చేస్తున్న రైతులకు సీపీఐ సంపూర్ణ మద్దతిస్తోందని పునరుద్ఘాటించారు. సీపీఐ జాతీయ మహాసభలకు ప్రభుత్వం సహకరించలేదని, విజయవాడ చివరన ఉన్న సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో బహిరంగ సభకు అనుమతించిందన్నారు.

మహాసభలతో నూతనోత్తేజం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విజయవాడలో సీపీఐ జాతీయ మహాసభల విజయవంతంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం నెలకొందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. తొలిరోజు జరిగిన ప్రజాప్రదర్శన, బహిరంగ సభకు పెద్దఎత్తున పార్టీ శ్రేణులు తరలివచ్చారన్నారు. ఇందుకోసం 250 ప్రత్యేక బస్సులు, ఏడు రైళ్లను ఏర్పాటు చేశామన్నారు. ఆహ్వాన సంఘం కమిటీ ప్రతినిధులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, మహాసభల విజయవంతానికి తోడ్పాటునందించారన్నారు. సీపీఐ ఆంధ్రా, తెలంగాణ ప్రాంత శ్రేణులు, ప్రజా సంఘాల నేతలు ప్రధాన కృషి చేశారన్నారు. ఇదే స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పై పోరాటాలు చేస్తామని తెలిపారు. మోదీ, జగన్ విధానాలతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందన్నారు. అమరావతి రైతుల పాదయాత్రకు జగన్ ప్రభుత్వం అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తూ, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

మహాసభల ముగింపులో సురవరం సుధాకరరెడ్డి దంపతులను సత్కరిస్తున్న డి.రాజా, నారాయణ, అమర్‌జిత్ కౌర్, పల్లవ్‌సేన్ గుప్తా, రామకృష్ణ, చాడ వెంకట్‌రెడ్డి, అక్కినేని వనజ, దోనేపూడి శంకర్

ఉత్తేజంగా సీపీఐ మహాసభలు

- పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై తీర్మానాలు
- భవిష్యత్ పోరాటాలపై దిశానిర్దేశం చేస్తూ నేతల ప్రసంగాలు

గురుదాస్ దాస్ గుప్తా నగర్ (విజయవాడ): భవిష్యత్ పోరాటాలకు పార్టీ కార్యకర్తలను సన్నద్ధం చేస్తూ వారికి దిశానిర్దేశం చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ మహాసభలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఆనందోత్సాహాల మధ్య 5 రోజుల పాటు మహాసభలు జరిగాయి. దేశ వ్యాప్తంగా సుమారు 950 మందికి పైగా ప్రతినిధులు ఈ మహాసభల్లో పాల్గొన్నారు. 19 దేశాల నుండి 30 మందికి పైగా అంతర్జాతీయ సౌహార్ద్ర ప్రతినిధులు విచ్చేసి సందేశాలిచ్చారు. అనేక కీలక తీర్మానాలను మహాసభ ఆమోదించింది. ప్రధాని నరేంద్ర మోదీని గద్దె దించేందుకు నడుం బిగించాలని పిలుపునిచ్చింది. తొలిరోజున 14వ తేదీ వేలాదిమందితో భారీ ప్రదర్శన, గొప్ప బహిరంగ సభ విజయవంతంగా జరిగింది. 15వ తేదీ నుండి ప్రతినిధుల సభలు ప్రారంభమయ్యాయి. ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రారంభ ఉపన్యాసం చేయగా, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ ఎంఎల్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఏఐఎఫ్‌బీ జాతీయ నాయకులు డి.దేవరాజన్ సందేశాలిచ్చారు. ఆహ్వాన సంఘ అధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ స్వాగత ఉపన్యాసం చేశారు. సభలు ప్రారంభంలో జాతీయ పతాకాన్ని ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ఏటుకూరి కృష్ణమూర్తి, పార్టీ పతాకాన్ని సీపీఐ పూర్వ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి ఆవిష్కరించారు. అమరవీరుల స్థూపాన్ని సీపీఐ కంట్రోల్ కమిషన్ జాతీయ నాయకులు ఈడ్పుగంటి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. సంతాప తీర్మానాలను పార్టీ జాతీయ కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ ప్రవేశ పెట్టారు. అనంతరం ప్రవేశపెట్టిన రాజకీయ ముసాయిదా తీర్మానంపై చర్చ జరిగింది. రెండో రోజు విదేశీ సౌహార్ద్ర ప్రతినిధులు సందేశాలిచ్చారు. రాజకీయ తీర్మానంతోపాటు, సీపీఐ వ్యవస్థాపక 100వ వత్సరాన్ని దేశవ్యాప్తంగా వాడవాడలా ఘనంగా జరపాలని, అమరావతి రాజధానిని కొనసాగించాలని, విశాఖ ఉక్కును ప్రైవేటీకరించరాదని, డిఫెన్స్ ఫ్యాక్టరీలను కార్పొరేట్‌ల పరం చేసే ప్రక్రియను ఉపసంహరించాలని, ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటుపరం చేయరాదని, అందరికీ ఆరోగ్యం ప్రాథమిక హక్కుగా ప్రకటించాలని, కార్మిక హక్కులను పరిరక్షించాలని, బ్యాంకింగ్ రంగాన్ని పటిష్టపర్చాలని డిమాండ్ చేస్తూ అనేక కీలక తీర్మానాలను ఈ మహాసభలో రెండు రోజులపాటు చర్చించి ఆమోదించారు. చివరిరోజున నూతన జాతీయ సమితి, కార్యవర్గం, కార్యదర్శివర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. మహాసభల ముగింపు ఉపన్యాసాన్ని ప్రధాన కార్యదర్శి డి.రాజా చేశారు. అంతకుముందు పూర్వపు ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర రెడ్డిని ఘనంగా సత్కరించారు. మహాసభ జయప్రదానికి కృషి చేసిన వివిధ కమిటీల నేతలు, సభ్యులను, రెడ్ షర్ట్ వాలంటీర్లను, ప్రజానాట్య మండలి కళాకారులను ఆహ్వాన సంఘం తరపున ప్రధాన కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ దుశ్శాలువలతో సత్కరించారు. విప్లవ గేయాలు, అంతర్జాతీయ గీతాలాపనలతో మహాసభలు జయప్రదంగా ముగిశాయి. నాయకుల ప్రసంగాలతో పోరాట స్ఫూర్తి పొందిన కార్యకర్తలు తమ తమ స్వస్థలాలకు తరలి వెళ్ళారు.

మహాసభల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రతినిధుల సమావేశం

సీపీఐ మొబైల్ యాప్‌ను అవిష్కరిస్తున్న డి.రాజా, కాంగో

వేదికపై ఉన్న డి.రాజా, కార్యదర్శివర్గ సభ్యులను సత్కరిస్తున్న ప్రజానాట్యమండలి నాయకులు ఆర్.పిచ్చయ్య కుటుంబ సభ్యులు

మహాసభ ముగింపులో రెడ్ షర్ట్ వాలంటీర్ల అభివాదం

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.



అవసరం స్పృహలోకి వచ్చే వరకు గుడ్డిది. స్వేచ్ఛ అనేది అవసరం యొక్క స్పృహ.

కారల్ మార్క్స్

CPI 24th PARTY CONGRESS 2022 October 14-18 VIJAYAWADA

COMMUNIST PARTY OF INDIA

సీపీఐ 24వ జాతీయ మహాసభలు

అక్టోబర్ 14-18, 2022 విజయవాడ

విపత్తులను అధిగమించాం

విశాలాంధ్ర ఇంటర్వ్యూలో కేరళ రెవెన్యూ మంత్రి రాజన్

విపత్తులను అధిగమించి ప్రజలకు సహాయ సహకారం, సేవలను అందించడంలో కేరళ రాష్ట్రం దారివేరు. ప్రజలకు మౌలిక సౌకర్యాల కల్పనలో కూడా ఒక ప్రత్యేక స్థానం వుంది. అనేక సంక్షేమ పథకాలను కూడా కేరళ వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు విశాలాంధ్ర సీనియర్ జర్నలిస్ట్ ఎస్‌కే బాబుకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేరళ రెవెన్యూ, గృహనిర్మాణ, విపత్తుల నిర్వహణ మంత్రి కె.రాజన్ వివరించారు.

ప్రశ్న: కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఎలా నడుస్తోంది?

జవాబు: చాలా మంచిగా ప్రభుత్వ పాలన జరుగుతున్నది. సంఘటనలోని అన్ని పార్టీలతో జిల్లా, మండల, గ్రామస్థాయి కమిటీలలో చర్చించి ముఖ్యమంత్రి పినరాయి విజయన్ నిర్ణయాలు తీసుకొని ప్రభుత్వాన్ని ముందుకు నడిపిస్తున్నారు.

ప్రశ్న: ఇతర రాష్ట్ర ప్రభుత్వాల కన్నా కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ ప్రత్యేకత ఏమిటి?

జవాబు: విపత్తులు సంభవించినప్పుడు ప్రజలను ఆదుకోడానికి కార్యక్రమాలు, పథకాలను ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం చేపట్టి కార్యాచరణలోకి దిగుతుంది. 2018లో కేరళను జలప్రళయం ముంచెత్తిన సమయంలో రూ.30వేల కోట్ల ఆస్తినష్టం సంభవించింది. కేరళ పునర్నిర్మాణానికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం రూ.300 కోట్లు ఆర్థిక సహాయం చేయడానికి ముందుకు వచ్చింది. అయితే, అందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అంగీకరించలేదు. ఆర్థిక సహాయాన్ని అర్థించడానికి ముఖ్యమంత్రితో సహా 17 మంది మంత్రులు వివిధ అరబ్ దేశాలకు వెళ్లేందుకు అభ్యంతరం లేదని సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) ఇవ్వడానికి కేంద్రం అంగీకరించలేదు. ఒక్క ముఖ్యమంత్రికే అనుమతి ఇచ్చింది. దాంతో ఎవరూ వెళ్లలేకపోయాము. ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రంలోని ఉద్యోగులందరూ 10 నెలలపాటు నెలకు మూడురోజుల వేతనం చొప్పున ఇచ్చి కేరళ రాష్ట్ర పునర్నిర్మాణానికి దోహదం చేసిన విషయం కేరళ ప్రజలు ఎన్నటికీ మర్చిపోలేదు. కేరళ ప్రభుత్వం 60 సంవత్సరాలు దాటిన వృద్ధులకు నెలకు రూ.1,600 సామాజిక పెన్షన్ అందజేస్తున్నది. కేరళను జలప్రళయం అతలాకుతలం చేసినప్పుడు ప్రతినెలా రూ.2వేలు విలువచేసే ఆహార కిట్లు రెండేళ్ల పాటు అందజేశాము. కోవిడ్-19 మహమ్మారి విజృంభించిన సమయంలో ప్రజలను ఆదుకొని, కోవిడ్ కట్టడి చేయడానికి జిల్లా, మండల, గ్రామీణ స్థాయిలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, చిన్న ఆసుపత్రులు నెలకొల్పి కోవిడ్ బారిన పడిన వారికి ఆహారం, మందులు ఉచితంగా ప్రభుత్వం అందజేసింది. ప్రభుత్వం ఎంతో దృఢదీక్షతో ఈ రెండు విపత్తులను అధిగమించగలిగింది. రాష్ట్రంలోని పేదప్రజలకు మెడిక్లెయిమ్ పథకం అమలు చేస్తున్నాం. 1966లో గ్రామాలు, పట్టణాలలో సర్వే చేపట్టాం. నాలుగేళ్లలో 911 గ్రామాలలో రూ.848కోట్ల వ్యయంతో పూర్తి డిజిటల్ రీసర్వే లక్ష్యంగా పెట్టుకున్నాం.

ప్రశ్న: కేరళలో ప్రత్యేక పథకాలు ఏమి అమలు చేస్తున్నారు?

జవాబు: కేరళ ప్రకృతి ప్రసాదించిన ఒక ప్రత్యేక రాష్ట్రం. భూసంస్కరణలు అమలు చేస్తూ ముందుకు ఉపక్రమిస్తున్నది. 1956లో కేరళలోని త్రిస్సూర్‌లో ఐక్యకేరళ పార్టీ రాష్ట్ర మహాసభ జరిగింది. దానిలో ఒక పత్రం రూపొందించారు. కేరళలో 1957లో ఎన్నికైన మొదటి ప్రభుత్వం ఏర్పడింది. ఈఎంఎస్ నంబూద్రిపాద్ ముఖ్యమంత్రిగా, అచ్యుతమీనన్ ఉపముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో భూసంస్కరణల కొరకు ప్రయత్నించగా కుదరలేదు. 1970లో అచ్యుతమీనన్ ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన ప్రభుత్వ హయాంలోనే భూసంస్కరణల చట్టం ఆమోదం పొందింది. దాని ప్రకారం ఒకవ్యక్తి 15వేల ఎకరాల భూమి కలిగి ఉండవచ్చు. ఇప్పటికీ కేరళలో భూసంస్కరణలు కొనసాగుతున్నాయి. గడచిన ఐదు సంవత్సరాలలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం లక్షా 70వేల మందికి 10సెంట్ల నుంచి నాలుగు ఎకరాల వరకు భూమి ఇచ్చింది. ఈ ఏడాది (2022)లో 54,534 మందికి 10 సెంట్ల నుంచి 4 ఎకరాల వరకు భూమి పంపిణీ చేశాం. భూమి లేని వారందరికీ భూమి పంపిణీ చేయాలని ప్రణాళిక రూపొందించాం. గడచిన 5 సంవత్సరాలలో 2లక్షల 12వేల గృహాలు నిర్మించి ప్రజలకు అందజేశాం. ఈఏడాది 42వేల గృహాలు అందజేశాం.

ప్రశ్న: మీ రాష్ట్ర ఆదాయం గురించి వివరాలు తెలపండి.

జవాబు: కేరళ రాష్ట్రం మొత్తం బడ్జెట్ లక్షా 60వేల కోట్లు. కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫెసిలిటీ మూవ్‌మెంట్ (క్రిఫ్బీ) బడ్జెట్ 60వేల కోట్లు. భూమి పన్ను, ఇంటి పన్నులు, ఎక్సైజ్ పన్నులు, పెట్రోలుపై పన్నుల ద్వారా రాష్ట్రానికి ఆదాయం చేకూరుతుంది.

ప్రశ్న: ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ ప్రత్యేక లక్షణాల గురించి వివరించండి

జవాబు: ప్రజలకు భూములు, గృహాలు సమకూర్చటం, కేరళను జాతీయ, అంతర్జాతీయ విద్యా హబ్‌గా రూపొందించాలని యోచిస్తున్నాము. అందుకోసం అతిథి గృహాలు, యూనివర్సిటీలను సిద్ధం చేస్తున్నాము. ఇందు కోసం రూ. 2వేల కోట్లు అవసరమవుతాయని మేము భావిస్తున్నాం. ఈ పథకం కేరళకు గర్వకారణమవుతుంది.

ప్రశ్న: కేరళలో సీపీఐ ఉద్యమం గురించి చెప్పండి.

జవాబు: కొల్లాంలో జరిగిన సీపీఐ 23వ జాతీయ మహాసభల నుంచి విజయవాడ 24వ మహాసభ మధ్యకాలంలో కొత్తగా 40వేల పార్టీ సభ్యత్వం చేర్పించాం. మా రాష్ట్రంలో సీపీఐ సభ్యత్వం లక్షా 77వేలు. సీపీఐ కి17 మంది ఎమ్మెల్యేలు వున్నారు. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వంలో నలుగురు మంత్రులు, డిప్యూటీ స్పీకరు వున్నారు. కేరళ నుంచి ఇద్దరు సీపీఐ సభ్యులు రాజ్యసభ సభ్యులు వున్నారు. సీపీఐ చరిత్రలో కేరళ నుంచి ఇద్దరు రాజ్యసభ సభ్యులుండటం ఇది రెండోసారి. భూమి ఆహారం, ఆదివాసీ సమస్య, యువజన సమస్యలపై సీపీఐ పోరాటాలు నిర్వహిస్తున్నది. రాష్ట్రంలో బలమైన యువజనోద్యమం ఉంది. అయితే, ఉద్యమాల నిర్వహణకు కొన్ని పరిమితులున్నాయి.

బెంగాల్ మహిళలు శక్తిమంతులు...

మతతత్వ పార్టీలకు బుద్ధి చెబుతారు

ప్రత్యేక ఇంటర్వ్యూలో శ్యామ శ్రీ దాస్

'పశ్చిమ బెంగాల్ మహిళలు శక్తిమంతులు, స్వాతంత్ర్య ఉద్యమాలతోపాటు మత ఛాందసవాదానికి... పితృస్వామిక సమాజానికి వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర వారి సొంతం. మూఢాచారాలు, ఆంక్షలతో వారిని బంధీలను చేయాలని చూస్తున్న మతతత్వ పార్టీలకు భంగపాటు తప్పదు... అభ్యుదయం, వామపక్ష భావజాలం వెల్లివిరిసే ఆ గడ్డపై పుట్టిన మహిళలే వారి ప్రయత్నాలన్నింటినీ తిప్పిగొడతారు... వారికి బుద్ధి చెబుతారు' అని మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు శ్యామ శ్రీ దాస్ పునరుద్ఘాటించారు. సీపీఐ 24వ జాతీయ మహాసభల సందర్భంగా గురుదాస్‌గుప్తా ప్రాంగణంలో విశాలాంధ్ర ప్రతినిధి వై.శాంతితో ఆమె తన అభిప్రాయాలను పంచుకున్నారు.

ప్రశ్న: కమ్యూనిస్టు పార్టీతో మీ అనుబంధం చెప్పండి

జవాబు: పశ్చిమబెంగాల్‌లోని నదియా జిల్లాలో కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉన్న హరింఘట్ట మా స్వగ్రామం. నా తల్లిదండ్రులు ఇద్దరూ సీపీఐ సభ్యులే. చిన్నతనం నుంచే వారితో కలిసి పార్టీ కార్యక్రమాలకు హాజరవుతుండేదాన్ని. చదువుకునే రోజుల్లోనే వామపక్ష భావజాలానికి సంబంధించిన సాహిత్యాన్ని చదవడం అలవాటుగా మారింది. నా భర్త సీపీఐ సభ్యుడు మెట్టినింటివారికి కూడా సీపీఐతో అనుబంధం ఉంది. కాబట్టి వారందరి ప్రోత్సాహంతోనే పార్టీలోనూ, మహిళా సమాఖ్యలోనూ చురుగ్గా పనిచేయగలుగుతున్నాను. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలిగా కొనసాగుతున్నాను. అలాగే మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహిస్తున్నాను.

ప్రశ్న: మహిళా ఉద్యమ నిర్మాణంలో మీ అనుభవాలు...

జవాబు: నేను తొలుత గ్రామ స్థాయి నుంచి నా ఉద్యమాన్ని ప్రారంభించాను. ఊరూరా తిరిగి మహిళల సమస్యలను అడిగి తెలుసుకునే దాన్ని. గ్రామాల్లో మహిళల పరిస్థితి దుర్భరంగా ఉండేది. అక్కడి స్త్రీల స్థితిగతులను కళ్లారా చూసి చలించిపోయా. వారికి ఉద్యోగ భద్రత ఉండేది కాదు. ఆర్థిక సమస్యలతో సతమతమవుతుండే వారు. నిరక్షరాస్యత వల్లే ఎంతో నష్టపోతున్నారని తెలియజెబుతూ వయోజన విద్యకు వాళ్లను ప్రోత్సహించాను. సాంఘిక, ఆర్థిక సమస్యల పరిష్కారానికి మహిళల్లో అవగాహన కల్పించేందుకు ప్రయత్నించాను. తర్వాత జిల్లా, రాష్ట్ర స్థాయిలో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించాను. మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే ఉన్నాను.

ప్రశ్న: మతతత్వ పార్టీలపై బెంగాల్ మహిళల అభిప్రాయం ఎలా ఉంది?

జవాబు: బెంగాల్ మహిళలు అభ్యుదయవాదులు. చైతన్యవంతులు. స్వేచ్ఛగా, స్వతంత్రంగా వ్యవహరించే వారిపై మనువాదం, మత చాంధసవాదాన్ని రుద్దడానికి మతతత్వపార్టీలు ప్రయత్నించడం వెర్రితనమే అవుతుంది. అక్కడి మహిళలు వారి ప్రయత్నాలన్నింటినీ ఇప్పటికే తిప్పిగొడుతున్నారు. మూఢాచారాలను ఖండిస్తున్నారు. సాంఘిక, ఆర్థిక సమస్యల పరిష్కారానికి వారు గళమెత్తుతున్నారు. ఆస్తి హక్కుకు సంబంధించి భార్యభర్తలకు ఉమ్మడిహక్కుగా ఉండాలని డిమాండ్ చేస్తున్నారు. మతతత్వ పార్టీలకు మహిళలే బుద్ధి చెబుతారు.

ప్రశ్న: బెంగాల్ మహిళల స్థితిగతులేమిటి?

జవాబు: బెంగాల్‌లో మహిళల పరిస్థితి దారుణంగా ఉంది. అయితే ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే ఇక్కడి మహిళల పరిస్థితి కాస్త మెరుగ్గానే ఉందని చెప్పవచ్చు. సాంఘిక, ఆర్థిక సమస్యలను మహిళలు ఎదుర్కొంటున్నారు. సమాన పనికి సమాన వేతనం కోసం వారు డిమాండ్ చేస్తున్నారు. నిరక్షరాస్యులైన మహిళల పరిస్థితి దుర్భరంగా ఉంది. ప్రైవేట్, వ్యవసాయ రంగాల్లో పనిచేసే మహిళలకు ఉద్యోగ భద్రత లేదు. వైద్య సౌకర్యాలకు నోచుకోవడం లేదు. అలాగే మహిళలపై దాడులు, అఘాయిత్యాలు పెరుగుతున్నాయి. కుటుంబంలో, సమాజంలో నిర్ణయాధికారం లేకపోవడం కూడా మరొక ప్రధాన సమస్య.

ప్రశ్న: రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

జవాబు: రాష్ట్ర ప్రభుత్వం మహిళ సంక్షేమం కోసం అనేక పథకాలను అమలుచేస్తోంది. నిరుద్యోగ మహిళల కోసం 'సుక్కి బంధార్' పథకం ద్వారా వారి బ్యాంకు ఖాతాలో రూ.500, ఎస్సీ, ఎస్టీ మహిళలకు రూ.1,000 అందజేస్తోంది. సాంఘికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి పలు పథకాలు అమలుచేస్తున్నా... కొందరికే ఆ సంక్షేమఫలాలు అందడం బాధాకరం.

ప్రశ్న: మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలేమిటి?

జవాబు: మహిళలు సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో అభివృద్ధి చెందడానికి పలు కార్యక్రమాలను చేపడుతున్నాం. మహిళలు తమ స్వశక్తితో జీవించడానికి వారిలో నైపుణ్యాభివృద్ధికి శిక్షణా కార్యక్రమాలు, అలాగే వయోజన విద్యకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. సాంఘిక, ఆర్థికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వివిధ రూపాల్లో ఆందోళనలు చేపడుతున్నాం.

సీపీఐ నూతన కార్యవర్గం

కార్యవర్గ సభ్యులు

1. డి.రాజా
2. కనం రాజేంద్రన్
3. అతుల్‌కుమార్ అంజన్
4. అమర్‌జిత్ కౌర్
5. డాక్టర్ కె.నారాయణ
6. డాక్టర్ బీకే కాంగో
7. వినయ్ విశ్వం
8. పల్లబ్‌సేన్ గుప్తా
9. నాగేంద్రనాథ్ ఓఝా
10. అజీజ్ పాషా
11. రామకృష్ణ పాండా
12. అని రాజా
13. డాక్టర్ గిరీశ్ శర్మ
14. మనీశ్ కుంజం
15. పి. సంతోశ్ కుమార్
16. ప్రకాశ్ బాబు
17. సీహెచ్ వెంకటాచలం
18. రామ్ నరేశ్ పాండే
19. జానకీ పాశ్వాన్
20. కూనంనేని సాంబశివరావు
21. చాడ వెంకట రెడ్డి
22. కె.రామకృష్ణ
23. మునీన్ మహంత
24. అక్కినేని వనజ
25. రావుల వెంకయ్య (ఏఐకేఎస్)
26. గుల్జార్ సింగ్ గొరియా
27. టీఎం మూర్తి
28. ముతరాసన్
29. స్వపన్ బెనర్జీ
30. బంత్ సింగ్ బ్రార్
31. (ఖాళీ)

ముప్పాళ్ల నాగేశ్వరరావు | జేవీ సత్యనారాయణ మూర్తి | జి.ఓబులేసు | టి.మధు | కె.శివారెడ్డి

ఆంధ్రప్రదేశ్

1. కె. రామకృష్ణ
2. ముప్పాళ్ల నాగేశ్వరరావు
3. జేవీ సత్యనారాయణ మూర్తి
4. జి.ఓబులేసు
5. అక్కినేని వనజ (మహిళ)
6. టి.మధు
7. కె.శివారెడ్డి

సమితి సభ్యులు

జాతీయ సమితి

కేంద్రం

1. డి.రాజా
2. అతుల్‌కుమార్ అంజన్
3. అమర్‌జిత్ కౌర్
4. వినయ్ విశ్వం
5. కె.నారాయణ
6. పల్లబ్‌సేన్ గుప్తా
7. డాక్టర్ బీకే కాంగో
8. నాగేంద్రనాథ్ ఓఝా
9. అజీజ్ పాషా
10. అని రాజా
11. సీహెచ్.వెంకటాచలం
12. రావుల వెంకయ్య (కిసాన్ సభ)
13. పి.సంతోశ్ కుమార్
14. ఎస్.వి. దామ్లే
15. అనిల్ రాజీమ్‌వాలే
16. సి.శ్రీకుమార్
17. శ్రీనివాస్ రెడ్డి
18. వి.ఎస్.గిరి
19. గుల్జార్ సింగ్ గొరియా
20. ప్రొ॥ అరుణ్ కుమార్ (ఏఐఎఫ్‌యూసీటీఓ)
21. డాక్టర్ ఎ.ఎ.ఖాన్
22. రాయ్‌కుట్టి
23. కృష్ణ ఝా
24. విక్కీ మహేశ్వరి (ఏఐఎస్‌ఎఫ్)
25. తిరుమలై (ఏఐవైఎఫ్)
26. డాక్టర్ అరుణ్ మిత్రా

అసోం

8. మున్నిన్ మహంత
9. కనక్ గొగోయ్

బీహార్

10. రామ్‌నరేశ్ పాండే
11. జానకీ పాశ్వాన్
12. రాజేంద్ర సింగ్
13. అవదేశ్ రాయ్
14. ఓంప్రకాశ్ నారాయణ్
15. ప్రమోద్ ప్రభాకర్
16. రాజశ్రీ కిరణ్ (మహిళ)
17. నివేదిద ఝా (మహిళ)
18. మిథిలేశ్ ఝా
19. సంజయ్ కుమార్

చత్తీస్‌గఢ్

20. మనీశ్ కుంజం
21. సత్యనారాయణ్ కమలేశ్
22. మంజూ కవాసి (మహిళ)

ఢిల్లీ

23. దినేశ్ సి. వర్ష్ణి

గోవా

24. క్రిస్టోఫర్ ఫోన్సెకా

గుజరాత్

25. విజయ్ షెన్మరే

హరియాణా

26. దరియవ్ సింగ్ కశ్యప్

హిమాచల్‌ప్రదేశ్

27. బాగ్ సింగ్

జార్ఖండ్

28. మహేంద్ర పాఠక్
29. మహదేవ్ రామ్
30. కనైమల్ పహ్వా
31. పి.కె.పాండే

కర్ణాటక

32. సతి సుందరేశ్
33. విజయ భాస్కర్

కేరళ

34. కనం రాజేంద్రన్
36. కె.ప్రకాశ్‌బాబు
37. ఇ.చంద్రశేఖరన్
38. జె.చించురాణి (మహిళ)
39. రాజాజీ మాథ్యూ థామస్
40. కె.పి.రాజేంద్రన్
41. కె.రాజన్
42. పి.ప్రసాద్
43. జి.ఆర్.అనిల్
44. చిట్టియం గోపకుమార్
45. పి.పి.సునీర్
46. పి.వసంతం (మహిళ)

లక్షద్వీప్

47. ఖాళీ

మధ్యప్రదేశ్

48. అరవింద్ శ్రీవాత్సవ
49. హరిద్వార్ సింగ్

మహారాష్ట్ర

50. సుభాశ్ లాండే
51. తుకారాం భాస్మే
52. శివకుమార్ గన్వీర్
53. రాజన్ క్షీర్‌సాగర్

మణిపూర్

54. ఎల్.తొయిరెన్
55. ఎస్.మెమ్మన

మేఘాలయ

56. సముద్ర గుప్త

ఒడిశా

57. అభయ్ సాహు
58. ఆశీశ్ కనుంగో
59. రామకృష్ణ పాండా
60. ఖీరాద్ సింగ్దియో

పుదుచ్చేరి

61. ఎ.ఎం.సలీం
62. ఎల్.దినేశ్ పొన్నయ్య

పంజాబ్

63. బంత్‌సింగ్ బ్రార్
64. జగ్రూప్ సింగ్
65. నిర్మల్ సింగ్ ధలివాల్
66. పృతిపాల్ సింగ్ మరిమేఘ
67. అమర్‌జిత్ సింగ్ అసల్
68. నరిందర్ సోహల్

రాజస్థాన్

69. నరేంద్ర ఆచార్య
70. సునీత చతుర్వేది

తమిళనాడు

71. ఇరా ముతురాసన్
72. ఎస్. పెరియసామి
73. ఎం. వీరపాండియన్
74. టి.ఎం. మూర్తి
75. కె. సంతానం
76. ఎం. ఆర్ముగన్
77. వి. శివపున్నియం
78. వహిత నిజాం (మహిళ)
79. టి.రామస్వామి
80. ఎం.కన్నాకి (మహిళ)

తెలంగాణ

81. చాడ వెంకటరెడ్డి
82. కూనంనేని సాంబశివరావు
83. పల్లా వెంకటరెడ్డి
84. పశ్యపద్మ (మహిళ)
85. టి.శ్రీనివాస్ రావు
86. కె.శంకర్
87. బాలనరసింహా
88. బి.హేమంత రావు

త్రిపుర

89. డాక్టర్ యుధీష్టిర్ దాస్

ఉత్తరప్రదేశ్

90. డాక్టర్ గిరీశ్ శర్మ
91. అరవింద్రాజ్ స్వరూప్
92. ఇంతియాజ్ అహ్మద్
93. క్రాంతి మిశ్రా

ఉత్తరాఖండ్

94. సమర్ భండారి

పశ్చిమ బెంగాల్

95. స్వపన్ బెనర్జీ
96. ప్రాబీర్ దేవ్
97. ఉజ్జల్ చౌదరి
98. తరుణ్ దాస్
99. భారతి అధికారి (మహిళ)
100. తపన్ గంగూలీ

క్యాండిడేట్ సభ్యులు

1. రాకేశ్ శర్మ (జమ్ము)
2. జి.ఎం.మిశ్రాబ్ (కశ్మీర్)
3. శంకర్‌లాల్ (ఢిల్లీ)
4. సోమన్ పిళ్లై (గుజరాత్)
5. టి.టి.జిస్మోన్ (కేరళ)
6. ఇ.టి.నరసింహా (తెలంగాణ)
7. మిత్ర వాషు (సెంట్రల్)
8. మహేశ్ రతి (ముక్తి సంఘర్ష్)
9. ఎన్.చిదంబరం (న్యూయేజ్)
10. శువం బెనర్జీ (ఏఐఎస్‌ఎఫ్)
11. సుఖ్‌జిందర్ మహేసరి (ఏఐవైఎఫ్)
12. ఖాళీ (ఇప్టా)
13. ఖాళీ (పీడబ్ల్యూఏ)

శాశ్వత ఆహ్వానితులు

1. రైలాల్ పి.సిన్హా

ఆహ్వానితులు

1. రుచిర్ తివారీ
2. ఎన్.బాలమల్లేశ్

కంట్రోల్ కమిషన్ సభ్యులు

1. రామేంద్ర కుమార్
2. శత్రుఘ్న ప్రసాద్ సింగ్ (బీహార్)
3. డాక్టర్ నారాసింగ్
4. పి.దుర్గాభవాని (మహిళ) (ఏపీ)
5. సత్యన్ మొకెరి (కేరళ)
6. రామ్ బహేతి (మహారాష్ట్ర)
7. హర్‌దేవ్ సింగ్ అర్షి (పంజాబ్)
8. తిరిచి ఎం.సెల్వరాజ్ (తమిళనాడు)
9. మోతీలాల్ (ఉత్తరప్రదేశ్)
10. నిషా సిద్ధూ (మహిళ)
11. మహమ్మద్ యూసఫ్ (తెలంగాణ)

అమ్మకాల్లో అగ్రభాగం

కమ్యూనిస్టు భావజాల పుస్తకాల విక్రయమే ఎక్కువ

విశాలాంధ్ర-గురుదాస్ దాస్‌గుప్తా నగర్: సీపీఐ 24వ జాతీయ మహాసభల వేదిక అయిన విజయవాడ ఎస్ఎస్ కన్వెన్షన్ (గురుదాస్ దాస్ గుప్తా నగర్)లో ఏర్పాటు చేసిన విశాలాంధ్ర బుక్ హౌస్-విజయవాడ, పీపుల్స్ పబ్లిషింగ్ హౌస్-న్యూఢిల్లీ వారి పుస్తక ప్రదర్శ స్టాల్స్ వద్ద ప్రతినిధుల సందడి అధికంగా కనిపించింది. ఖాళీ సమయంలో ప్రతినిధులు ఆసక్తిగా ఈ స్టాల్స్‌ను సందర్శించి పుస్తకాలను కొనుగోలు చేశారు. అధికంగా కమ్యూనిస్టు భావజాల పుస్తకాలు అమ్ముడయ్యాయని స్టాల్ నిర్వాహకులు చెప్పారు. మహాసభల ప్రారంభ రోజున ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో కమ్యూనిస్టు ప్రణాళిక, ఆంధ్ర కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర పుస్తకాలు హాట్‌కేక్‌ల్లా అమ్ముడుపోయినట్టు విశాలాంధ్ర బుక్ హౌస్ సేల్స్ మేనేజర్ బాషా తెలిపారు. ఆకార్ పబ్లికేషన్స్-ఢిల్లీ వారు ప్రచురించిన గ్రామవాసి, సోషలిజం-మార్క్సిజం, ప్రజాశక్తి-లెఫ్ట్‌వార్డ్ పబ్లికేషన్స్ ముద్రించిన తెలంగాణ సాయుధ పోరాటంపై పుచ్చలపల్లి సుందరయ్య రచనలు, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి రాసిన పుస్తకాలు విరివిగా అమ్ముడయ్యాయని బాషా వివరించారు. పీపుల్స్ పబ్లిషింగ్ హౌస్ ప్రచురణల్లో లెనిన్ మార్క్సిజం, పీసీ జోషి రచనలు, సీపీఐ నిబంధనావళి, మానిఫెస్టో ఆఫ్ సీపీఐ, అమిల్‌బర్న్ రాసిన వాట్ ఈజ్ మార్క్సిజం, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి రాజా రాసిన డిఫెండింగ్ డెమోక్రసీ పుస్తకాలు అధికంగా అమ్ముడైనట్టు స్టాల్ నిర్వాహకులు ఎస్‌కే పాండే చెప్పారు.

హాట్‌కేక్‌లా ఎర్ర కండువాలు...

అదే ప్రాంగణంలో చెన్నైకి చెందిన సీపీఐ శ్రేణులు ఏర్పాటు చేసిన చైన్స్ స్టాల్‌లో అత్యధికంగా ఎర్ర కండువాలు అమ్ముడుపోయినట్టు నిర్వాహకుడు ఎస్. సుబ్రహామణ్యం చెప్పారు. ఏఐటీయూసీ, సీపీఐ చిహ్నాం కలిగిన కీ చైన్‌లు, బ్యాడ్జిలు ఎక్కువగా అమ్మినట్టు తెలిపారు.

ఆంధ్ర హాస్పిటల్స్ వైద్యుల సేవలు అమోఘం

700 మందికి వైద్యపరీక్షలు

విశాలాంధ్ర-గురుదాస్ దాస్‌గుప్తా నగర్: సీపీఐ 24వ జాతీయ మహాసభల వేదిక అయిన విజయవాడ ఎస్ఎస్ కన్వెన్షన్ (గురుదాస్ దాస్ గుప్తా నగర్)లో ఆంధ్ర హాస్పిటల్స్-విజయవాడ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సుమారు 700 మంది ప్రతినిధులకు వైద్య సేవలు అందించినట్టు వైద్యులు ఎస్.అమర్, కోటేశ్వరరావు తెలిపారు. ప్రతినిధుల సభ ప్రారంభమైన 15వ తేదీ నుంచి నాలుగు రోజులుగా సుగర్, బీపీ, జ్వరం, కడుపునొప్పి, విరోచనాలు, ఆయాసంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్టు చెప్పారు. బెజవాడ ఆసుపత్రులపై అవగాహన లేని తమకు వైద్యులు అమోఘమైన సేవలు అందించినట్టు దూర ప్రాంతాల నుంచి మహాసభలకు విచ్చేసిన ప్రతినిధులు చెప్పారు. సభకు విచ్చేసిన వందలాది మంది ప్రతినిధుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్యశిబిరం ఏర్పాటు చేసిన నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు.

నాటో సభ్యదేశమైనా సామ్రాజ్యవాదాన్ని సహించం

టర్కీ కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు అకాద్ మురాద్

సీపీఐ 24వ జాతీయ మహాసభలకు విజయవాడ విచ్చేసిన టర్కీ కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు అకాద్ మురాద్‌తో విశాలాంధ్ర ప్రతినిధి రొమిల ముఖాముఖి

ప్ర: తాజాగా టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను కలుసుకున్నట్లున్నారు?

జ: అవును. మాకు రష్యా-ఉక్రెయిన్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్న మాట వాస్తవమే. ఉక్రెయిన్ ధాన్యాన్ని ప్రపంచ మార్కెట్లోకి పంపించేందుకు వీలు కల్పించే ఐక్యరాజ్యసమితి మధ్యవర్తిత్వాన్ని విజయవంతం చేయాలన్నదే మా ఆకాంక్ష. ఉక్రెయిన్-రష్యా వివాదాన్ని ఐరాస రెండు దేశాల మధ్య చర్చల ద్వారా వీలైనంత త్వరగా పరిష్కరించగలిగితే మేం చాలా సంతోషిస్తాం. ఇస్తాంబుల్ ఒప్పందం ప్రకారం రష్యా ధాన్యం, ఎరువులను టర్కీ ద్వారా ప్రపంచ దేశాలకు బదిలీ చేయడంతో ధాన్యం ఎగుమతులను మరింత బలోపేతం చేయాలనేది టర్కీ కృతనిశ్చయం.

ప్ర: నాటో సభ్యదేశమైన టర్కీ ప్రస్తుత పరిస్థితి?

జ: 1952 నుంచి నాటో సభ్యదేశంగా ఉన్నప్పటికీ అమెరికా సామ్రాజ్యవాదాన్ని మేం నిరసిస్తూనే ఉన్నాం. అమెరికా తర్వాత అత్యంత అయుధ సంపత్తి ఉన్న దేశం కూడా మాదే..

ప్ర: నాటో సభ్య దేశంగా ఉన్నప్పటికీ రష్యా-ఉక్రెయిన్‌లతో సన్నిహిత సంబంధాలకు గల కారణం? తాజాగా రష్యా నుంచి కూడా మీరు ఆయుధాలు కొనుగోలు చేసినట్లున్నారు?

జ: అవును మేం రష్యా నుంచి ఆయుధాలను కొనుగోలు చేశాం. రష్యాతో మేం సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తున్నాం. రష్యాపై అమెరికా సామ్రాజ్యవాద ఆంక్షల అమలుకు మేం వ్యతిరేకం. ఈ విషయంలో ఈయూ నుంచి కూడా మేం విమర్శలను ఎదుర్కొంటున్నాం.

ప్ర: నాటో సభ్య దేశంగా ఇదెలా సాధ్యం? ఆర్థికంగా మీ దేశ ప్రగతి?

జ: నాటో సభ్యదేశనప్పటికీ రష్యాను సమర్థించడంలో మేం వెనుకాడేది లేదు. అయితే ప్రస్తుతం దేశ ఆర్థిక పరిస్థితి చాలా క్లిష్టంగా ఉంది. నిరుద్యోగ సమస్య, ద్రవ్యోల్బణంతో దేశం అట్టుడుకుతోంది. దేశంలో ఆహార అభద్రత పెరిగింది. ఆయుధాల కొనుగోళ్లకు వెచ్చిస్తున్న ధనాన్ని దేశ సంస్కరణల కోసం వినియోగించడం ప్రభుత్వ తక్షణ కర్తవ్యం. టర్కీ ప్రభుత్వం ఆర్థికంగా పూర్తి నిస్సహాయ పరిస్థితిలో ఉంది. దేశంలో పరిశ్రమలు లేవు. ఉత్పత్తి లేదు.

ప్ర: గ్రీసు, టర్కీల మధ్య అపరిష్కృత సమస్యలు ఉన్నాయా?

జ: చాలా ఉన్నాయి. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రెండు దేశాల అధ్యక్షులు జాతీయ సెంటిమెంట్‌ను కూడగట్టుకోవడంలో బిజీగా ఉన్నాయి. రెండు దేశాల మధ్య పరిష్కారం కాని సమస్యలు చాలా ఉన్నాయి. రెండో ప్రపంచ యుద్ధానంతరం ఈ సమస్యలు మరింత జటిలమయ్యాయి. వీటిలో ముఖ్యంగా సైప్రస్ స్థితి, తూర్పు మధ్యధరా సముద్ర జలాల సమస్య, ఏజియన్ దీవుల వైమానిక సరిహద్దులు, ఈ ద్వీపాల సైనికీకరణ వంటి జటిలమైన సమస్యలున్నాయి.

ప్ర: టర్కీలో కమ్యూనిస్టు పార్టీ పరిస్థితి..మనుగడ?

జ: టర్కీలో కమ్యూనిస్టుపార్టీ 1978లో ఏర్పడింది. తాజాగా 1993లో సోషలిస్టు పార్టీగా దేశ పార్లమెంటులో ఐదవ స్థానంలో ఉంది. అయినప్పటికీ మేం సోషలిస్టు పంథాలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్నాం. సామ్యవాద సిద్ధాంతాల అమలుకు మేం కృషి చేస్తున్నాం. లాంగ్ లివ్ సోషలిజం..లాంగ్ లివ్ కమ్యూనిజం.

సవరణల పేరిట మహిళా చట్టాల నిర్వీర్యం

విశాలాంధ్ర ఇంటర్వ్యూలో పెన్మెత్స దుర్గాభవాని

'పనికిరాని చట్టాలను తీసుకొచ్చి లేనిది ఉన్నట్లుగా చేసే చర్యలు మానుకోవాలి. ప్రస్తుతమున్న చట్టాలు చాలా పకడ్బందీగా ఉన్నాగానీ అమలులో చిత్తశుద్ధి లోపించింది. సవరణల పేరుతో మహిళా చట్టాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు మానుకోవాలి.' అని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని అన్నారు. సీపీఐ 24వ జాతీయ మహాసభల సందర్భంగా విశాలాంధ్ర ప్రతినిధి వై.శాంతితో ఆమె తన అభిప్రాయాలను పంచుకున్నారు.

ప్రశ్న: ఏఐఎస్ఎఫ్‌లో ఎప్పుడు చేరారు? సీపీఐ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూతో మీ అనుబంధం ఏమిటి?

జవాబు : మాది రైతు కుటుంబం. మూడు తరాల వారు సీపీఐలో ఉన్నారు. తాతగారు అల్లూరి రాఘవరాజు నిర్బంధంలో ఉన్నప్పుడు పళనీ అప్పన్ క్యాంపులో మలబార్ పోలీసుల చేతుల్లో చిత్రహింసలు అనుభవించారు. ఆయన ప్రభావం మా నాన్నకు, ఆయన వారసత్వం నాకు సంక్రమించింది. భర్త పెన్మెత్స వెంకట సుందర రామరాజుదీ పార్టీ కుటుంబమే. పుట్టినింటి వారు, మెట్టినింటి వారందరి ప్రోత్సాహంతో నేను ఉద్యమాల్లోకి వచ్చాను.

పాఠశాలలో చదువుకునే సమయంలో చెరుకూరి సత్యనారాయణ 1980లో నాకు ఏఐఎస్ఎఫ్ సభ్యత్వం ఇచ్చారు. తర్వాత ఎస్ఆర్ఆర్ కళాశాలలో కృష్ణకుమారి, దోనేపూడి శంకర్, ఆపై పీవీ సుబ్బారావు తదితరులతో కలిసి పనిచేశాను. 1980-84 వరకు ఏఐఎస్ఎఫ్‌లో ఉన్నాను. ఏఐఎస్ఎఫ్‌కి విజయవాడ, కృష్ణాజిల్లా కోశాధికారిగా, రాష్ట్ర కార్యవర్గసభ్యురాలిగా పనిచేశాను. ఏఐవైఎఫ్‌లో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా ఉన్నాను. సమీప బంధవులైన ఉప్పలపాటి రామచంద్రరాజు, కాకర్లపూడి సుబ్బరాజు స్ఫూర్తితో ఉద్యమంలోకి వచ్చాను. చదువుకునే రోజుల్లోనే విజయవాడ పాత 22వ డివిజన్‌లో మహిళా సమాఖ్యకు డివిజన్ కార్యదర్శిగా పనిచేశాను. ఆ విధంగా డివిజన్ స్థాయి నుంచి వచ్చాను. 1989లో విజయవాడ నగర మహిళా సమాఖ్య కన్వీనర్‌గా 1991 నుంచి దాదాపు 13ఏళ్లు విజయవాడ నగర మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా పనిచేశాను. కృష్ణాజిల్లా కార్యదర్శిగా కూడా ఉన్నాను. ఏడాదిన్నరపాటు ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేశాను. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నాను.

ప్రశ్న : రాష్ట్రంలో ప్రధానంగా ఏయే సమస్యలపై పోరాడుతున్నారు? మీ డిమాండ్లు.. చేపడుతున్న కార్యక్రమాలు ఏమిటి?

జవాబు: అధిక ధరలు మహిళల జీవితాన్నే చిన్నాభిన్నం చేస్తున్నాయి. మద్యం వల్ల కుటుంబాలు రోడ్డుపాలవుతున్నాయి. మహిళలపై అత్యాచారాలు, నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్నాయి. సమాన పనికి సమాన వేతనం లేదు. ఉద్యోగ భద్రత లేదు. అనారోగ్యం పరిస్థితులతో మహిళలు సతమతమవుతున్నారు. నిర్ణయాధికారంలో మహిళలకు భాగస్వామ్యం లేదు. ప్రధానంగా ఈ సమస్యలపై పోరాడుతున్నాం. ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్ట పరచాలని భావిస్తున్నాం. అధిక ధరలను అదుపుచేయడం కోసం ప్రభుత్వమే ధరల స్థిరీకరణ విషయంలో శ్రద్ధ చూపించాలి. దళారీ వ్యవస్థను నియంత్రించాలి.పండిన పంటల్లో ప్రజావసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు అందుబాటులో ఉంచేలా మార్కెటింగ్ వ్యవస్థను పటిష్టపరిచి చౌకడిపోల ద్వారా సబ్సిడీ రేట్లకే ప్రజలకు అందిచాలి.

ప్రశ్న: మహిళల భద్రత కోసం అమలు చేస్తున్న చట్టాల సంగతేంటి?

జవాబు : పనికిరాని చట్టాలను తీసుకొచ్చి లేనిది ఉన్నట్లుగా చేసే చర్యలు మానుకోవాలి. ప్రస్తుతం ఉన్న చట్టాలు చాలా పకడ్బందీగా ఉన్నాయి. వాటిని అమలు చేయడంలో చిత్తశుద్ధి లేదు. ఉన్న చట్టాలను సవరణల పేరుతో నిర్వీర్యం చేసే పరిస్థితి మానుకోవాలి. ఉదాహరణకు 498ఏ... బాధిత మహిళలకు ఊరట. కాని దాన్ని మార్చడం వల్ల దోషులు తేలికగా చట్టం నుంచి తప్పించుకునే మార్గం సుగమమైంది. చట్టాలను చిత్తశుద్ధితో అమలుచేయాలి. దోషులకు కఠినంగా శిక్ష పడాలి. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా వేగవంత విచారణ నిర్వహించే సిబ్బందిని, యంత్రాంగాన్ని పటిష్టపరచాలి. చట్టం గురించీ ప్రజల్లో అవగాహన కల్పించాలి. నేరాల అదుపునకు కృషి చేసేలా వారిని ప్రభావితం చేయాలి.

ప్రశ్న : మహిళా సమాఖ్య నిర్వహిస్తున్న ఉద్యమాలు గురించి చెప్పండి

జవాబు : మహిళలపై అత్యాచారాల నియంత్రణకు ఎప్పటికప్పుడు వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తూనే ఉన్నాం. నిర్ణయాధికారంలో మహిళల భాగస్వామ్యం కోరుతూ ఇప్పటివరకు అనేక ఆందోళనలు చేశాం. న్యాయస్థానాల్లో కూడా పిటిషన్లు వేశాం. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కోసం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం పిటిషన్లు వేశాం. కుటుంబ, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో మహిళలకు సమాన ప్రాతినిధ్యం కోసం మహిళా సమాఖ్య పోరాడుతోంది.

మహిళల సమస్యలపై పోరాడతా

ఇంటర్వ్యూలో సునీతా చతుర్వేది

అణగారిన వర్గాల కోసం పోరాడే సీపీఐ విధానాలు నచ్చి పార్టీలో చేరాను. రాజస్థాన్‌లో మహిళల సమస్యల పరిష్కారానికి పోరాడుతానని సునీతా చతుర్వేది సీపీఐ మహాసభల సందర్భంగా విశాలాంధ్ర ప్రతినిధి వై.శాంతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ప్రశ్న: సీపీఐలో ఎలా చేరారు?

జవాబు: మాది రాజస్థాన్‌లోని జైపూర్. మాది పార్టీ కుటుంబం కాదు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన నేను విద్యార్థిగానే మార్క్సిజం వైపు ఆకర్షితురాలినయ్యాను. అణగారిన వర్గాల కోసం పోరాడే సీపీఐ విధానం నచ్చి పార్టీలో చేరాను.

ప్రశ్న: సీపీఐ, ఇతర ప్రజా సంఘాల్లో మీ హోదా ఏమిటి?

జవాబు: సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యురాలిగా; ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాజస్థాన్ అధ్యక్షురాలిగా, జాతీయ ఉపాధ్యక్షురాలిగా పనిచేస్తున్నాను.

ప్రశ్న: రాజస్థాన్‌లో మహిళల స్థితిగతులు ఏమిటి?

జవాబు: బాల్యవివాహాలు, వరకట్న వేధింపులు, గృహహింస, భ్రూణ హత్యలు పెరిగాయి. మహిళల్లో ప్రాథమిక హక్కులపైనా అవగాహన లేదు. చట్టాల గురించీ తెలియదు. స్త్రీలపై వివక్ష, సమాన పనికి సమాన వేతనం; ఉద్యోగ భద్రత లేదు. కుటుంబంలో, సమాజంలో మహిళలకు నిర్ణయాధికారం ఉండటం లేదు.

ప్రశ్న: మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ఏమిటి?

జవాబు: రకరకాల కార్యక్రమాలను చేపడుతున్నా అవి కాగితాలకు, ఉత్తుత్తి ప్రకటనలకే పరిమితం. సంక్షేమ ఫలాలూ వారికి అందవు.

ప్రశ్న: మహిళల సమస్యల పరిష్కారానికి మీరు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జవాబు: సాంఘిక దురాచారాలు, మూఢనమ్మకాలపై అవగాహన, సాంస్కృతిక కార్యక్రమాలు, వయోజన విద్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. సమాన పనికి సమాన వేతనం, సాంఘిక, ఆర్థిక సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్నాం.

పాడిపరిశ్రమలో కేరళ ముందంజ

వినూత్న యాంత్రీకరణ ద్వారా పాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించామంటున్న కేరళ రాష్ట్ర పశు సంవర్థక, పాడి పరిశ్రమ అభివృద్ధిశాఖ మంత్రి చించురాణి తో గురుదాస్ దాస్‌గుప్తా నగర్‌లో విశాలాంధ్ర ప్రతినిధి రొమిల ఇంటర్వ్యూ. చించురాణి కేరళలోని కొల్లం నుంచి రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు.

ప్రశ్న: పాడిపరిశ్రమ, పశు సంవర్థక శాఖా మంత్రిగా రాష్ట్రంలో మీరు చేపట్టిన సంస్కరణలు

జవాబు: పాల ఉత్పత్తిలో కేరళ దాదాపు స్వయం సమృద్ధి సాధించింది. వినూత్న యాంత్రీకరణతో ఈ రంగం వృద్ధి చెందింది. ముఖ్యంగా లాక్‌డౌన్ ప్రారంభరోజుల్లో సైతం డిమాండ్, ఉత్పత్తి అంచనాలకంటే వేగంగా అభివృద్ధి చేసాం. లాక్‌డౌన్ ముందుతో పోలిస్తే ప్రస్తుతం మలబార్ ప్రాంతంలో పాల ఉత్పత్తి రోజుకు లక్ష లీటర్లు పెరిగింది. ప్రస్తుతం గుడ్లు, కోడిపిల్లల ఉత్పత్తి పెరుగుతోంది. ప్రభుత్వ ఫారాల్లో నెలకు సగటున 2లక్షల గుడ్లు ఉత్పత్తి జరిగేది. జులైలో 2,47,654కి పెరిగింది. గత రెండున్నర దశాబ్దాలుగా నిర్వహిస్తున్న టీకా కార్యక్రమం పశువుల్లో వ్యాధులను తగ్గించింది. పశు సంవర్థక శాఖ, సంబంధిత విశ్వవిద్యాలయ విస్తరణ కార్యకలాపాలు రైతుల్లో అవగాహనకు దోహదం చేస్తున్నాయి. తద్వారా రైతులకు స్థిరమైన ఆదాయ మార్గాలను అందిస్తోంది. దాదాపు 97శాతం ఉత్పత్తి విలువలో మహిళల సహకారం గణనీయంగా ఉంది. యువత కూడా చిన్న చిన్న జంతు, కోళ్లఫారాలను ప్రారంభించాలనే ఆలోచనలో ఉన్నారు. గల్ఫ్ నుంచి వచ్చిన వారు కూడా ఇటువంటి ఫామ్‌లను ప్రారంభించేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. కోవిడ్‌లో కూడా మేము రాష్ట్రంలో 10,000 చిన్న తరహా డెయిరీ ఫారాలను వృద్ధి చేసేందుకు సంకల్పించాం.

ప్రశ్న: పాడి రైతులకు మీరిచ్చిన ప్రోత్సాహకాలు

జవాబు: పాడి రైతులకు ప్రోత్సాహకాలు అందించేందుకు కేరళ క్షీరశ్రీ పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. దేశంలో ఎక్కడాలేని విధంగా కేరళలోని పాల ఉత్పత్తుదారులందరినీ ఒకే తాటిపైకి తీసుకొచ్చేందుకుగాను ఈ ప్లాట్‌ఫాం ప్రారంభించాము. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 3,600 డెయిరీ సహకార సంఘాలకు సుమారు రెండు లక్షల మంది రైతులు పాలు అందిస్తున్నారు. వాటిని పోర్టల్‌లో నమోదుచేయడమే ప్రధాన లక్ష్యం. రైతులకు తగిన ప్రోత్సాహకాలతోపాటు ప్లాట్‌ఫాం ద్వారా సబ్సిడీలు, అలవెన్సులు పొందే అవకాశం కల్పించాం. మిల్మా వంటి సంబంధిత శాఖల అలవెన్సులు పోర్టల్ ద్వారా పంపిణీ చేస్తున్నాం.

ప్రశ్న: పశుసంవర్థక రంగంలో మీరు చేపట్టిన ప్రయోజకాలు?

జవాబు: భారీ వర్షాల కారణంగా కేరళలోని పశుసంవర్థక రంగం రూ. 42.85 లక్షల మేర నష్టపోయింది. రాష్ట్రవ్యాప్తంగా జంతువులను రక్షించేందుకు 40 షెల్టర్‌లను తెరిచాం. రుతుపవనాల ప్రభావాన్ని అంచనా వేయడానికి ఈ రంగంలోని రైతులకు అవసరమైన సహాయాన్ని అందించడానికి మా శాఖ ఇప్పటికే తగిన చర్యలు తీసుకుంది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఒకవేళ వర్షాలు ఎక్కువైతే పరిస్థితులను ఎదుర్కొనేందుకుగాను ర్యాపిడ్‌యాక్షన్ ఫోర్స్‌ను రంగంలోకి దించుతాం. విపత్తు సంభవించే ప్రాంతాలను గుర్తించి జంతువులను సురక్షిత ప్రాంతాలకు తరలించుతాం. రాష్ట్రవ్యాప్తంగా 575 జంతువులను రక్షించి షెల్టర్లకు తరలిస్తాం. వాటికి తగిన వైద్యసహాయం, మేత అందిస్తాం.

ప్రశ్న: మహిళా రిజర్వేషన్లపై సీపీఐ ఎటువంటి చర్యలు చేపట్టింది?

జవాబు: కేరళలో మహిళా రిజర్వేషన్లు 33 శాతం అమలుచేసేందుకు కృషి చేస్తున్నాం. తదుపరి ఎన్నికల్లో మహిళల సంఖ్యను మరింత పెంచేందుకు మేం కంకణం కట్టుకున్నాం.

ప్రశ్న: మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై మీరు తీసుకున్న చర్యలు...

జవాబు: మా ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మహిళలు, యువతపై ఎటువంటి హింసాత్మక చర్యలు జరిగినా మేం వెంటనే స్పందిస్తాం. అకృత్యాలకు పాల్పడినవారిపై కఠిన శిక్షలు జరిగేలా చూడటంలో ఎటువంటి జాప్యత ఉండదు.

ఎర్రజెండా నీడలో... ఏఐఎస్‌ఎఫ్ వెలుగులో...

సీపీఐ జాతీయ మహాసభలకు హాజరైన అతిపిన్న వయస్సు ప్రతినిధి సబీనా ఖాతూన్‌తో ఇంటర్వ్యూ

సబీనా ఖాతూన్ బీహార్‌లోని నిరుపేద ముస్లిం కుటుంబంలో జన్మించారు. రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితులను చూశారు. 18ఏళ్ల పిన్నవయస్సులో జీవతపాఠాలు నేర్చుకున్నారు. తనలాంటి మరెందరో యువతులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఆమె సీపీఐ 24వ జాతీయ మహాసభలకు హాజరైన ప్రతినిధుల్లో అతిపిన్న వయస్కురాలు. ఈ సందర్భంగా విశాలాంధ్ర ప్రతినిధి షాయిస్తా ఖానూమ్‌తో మాట్లాడారు.

ప్రశ్న: మతఘర్షణలపై మీ అభిప్రాయం?

జవాబు: నాకు కులం-మతంతో సంబంధం లేదు. నేను మనిషిని. తోటివారిని మనుషులుగానే చూస్తాను. నేను ముస్లిం కుటుంబంలో పుట్టినా నాకు మతం, కులం గురించి పట్టింపులు లేవు. మత కలహాలు, హింసాకాండకు పూర్తి వ్యతిరేకిని. మతం పేరిట అల్లర్లను తీవ్రంగా ఖండిస్తాను. విద్వేషాన్ని రెచ్చగొట్టడం హత్యాకాండకు ప్రేరేపించడాన్ని ప్రతిఘటిస్తాను. మనమంతా మనుషులం. మనందరి మధ్య ఆత్మీయ బంధం ఉండాలని కోరుకుంటాను.

ప్రశ్న: మీ గురించి.. మీ గ్రామం గురించి చెప్పండి?

జవాబు: నా పేరు సబీనా ఖాతూన్. మాది బీహార్ రాష్ట్రం, ఖగరియా జిల్లా, పర్వతాప్రఖండ్ గ్రామం. గ్రామంలోనే ఇంటర్ వరకు చదివాను. బీఏలో ప్రవేశం పొందాలి. పాట్నాలోని నలందా విద్యాలయంలో చేరాలని భావిస్తున్నాను. కబడ్డీ కూడా ఆడతాను. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఉపాధ్యక్షురాలిగా ఉన్నాను. మా గ్రామంలో పరిస్థితులు ఏమీ బాగుండవు. నిర్లక్షరాస్యత ఎక్కువ. ముఖ్యంగా బాలికల విద్యను ప్రోత్సహించరు. భూ వివాదాలు ఎక్కువ. స్థలాల కోసం ప్రాణాలను హరించేందుకు సైతం వెనకాడని దారుణ పరిస్థితులు ఉన్నాయి.

ప్రశ్న: ఏవైన ఆందోళనలకు నేతృత్వం వహించారా?

జవాబు: నా అధ్వర్యంలో బిల్కిస్ బానో వ్యవహారంలో ఆందోళనలు జరిగాయి. సెప్టెంబరు 6న గ్రామంలో నిరసన చేపట్టాం. దేశవ్యాప్తంగా మహిళలు-విద్యార్థుల సమస్యలు, బాలికలకు విద్యాభ్యాసంపై మా వంతు పోరాడుతున్నాం. కాలేజీల్లో ఫీజులు కూడా ఇష్టమొచ్చినట్లు ఉంటాయి. ఫీజు రాయితీ కోసం పోరాడుతుంటాం. విద్యను వ్యాపారంగా మార్చేసి ముక్కుపిండి ఫీజులు వసూలు చేసే యంత్రాంగాలకు వ్యతిరేకంగా ఆందోళనలు చేశాం.

ప్రశ్న: సీపీఐ జాతీయ మహాసభలకు రావడం ఎలా అనిపించింది?

జవాబు: చాలా సంతోషంగానూ, గర్వంగానూ ఉంది. అందరికంటే పిన్నవయస్సుగల ప్రతినిధిగా ఎంపిక కావడం, బీహార్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించడమే కాకుండా ఇంత మంది పెద్దల ముందర గుర్తింపు పొందడం చాలా మంచి అనుభూతినిచ్చింది. నా వయస్సు నుంచే వీరంతా ఈ స్థాయికి వచ్చారు. సీనియర్ల నుంచి చాలా నేర్చుకోవచ్చు. వీరంతా స్ఫూర్తిప్రదాతలు. యువతకు ఇంతలా ప్రోత్సాహం అందిస్తున్నారు. వాస్తవాలు తెలుపుతూ సమాజ పరిస్థితలపై అవగాహన కల్పిస్తున్నారు.

ప్రశ్న : మీ కుటుంబం గురించి చెప్పండి.. ఇక్కడకు ఎలా వచ్చారు?

జవాబు: మాది బీద కుటుంబం. చాలా ఇబ్బందుల్లో ఇక్కడ వరకు రాగలిగాను. మాకు అవసరమైనప్పుడు తోటి కామ్రేడ్‌లు అండగా నిలుస్తారు. ఇలాంటి సందర్భాల్లో రాకపోకల కోసం ఆర్థిక సాయం అందిస్తుంటారు. మా కుటుంబంలో ఏడుగురు ఉన్నారు. నలుగురు అక్కాచెల్లెళ్లు. వారిలో నేను చిన్నదాన్ని. ముగ్గురు అన్నయ్యలు ఉన్నారు. వారంతా కార్మికులు. అమ్మానాన్న కూడా కార్మికులు. అమ్మ , అక్క వ్యవసాయ కూలీలు. ఎవరూ పెద్దగా చదువుకోలేదు. చిన్నదాన్ని కావడంతో కుటుంబంలో అందరి సహకారం నాకు ఉంది.

ప్రశ్న: మీ రాష్ట్రంలో నేరాల గురించి ఏమంటారు?

జవాబు: గ్రామాల్లోనూ మహిళలపై నేరాలు, భూవివాదాలు ఎక్కువ. స్థలాల కోసం హత్యలు జరిగిపోతుంటాయి. దీనిని తీవ్రంగా ప్రతిఘటిస్తున్నాను. గ్రామాల్లోనూ అత్యాచారాలు పేట్రేగిపోయాయి. ముక్కపచ్చలారని చిన్నారులపై హేయమైన నేరాల గురించి వింటుంటే ఒళ్లు గగ్గురపడుస్తుంది. జీర్ణించుకోలేక పోతుంటాను. హేయమైన నేరాలకు పాల్పడిన వారిపైన తగిన చర్యలు ఉండకపోవడం కోపం తెప్పిస్తుంది. పెద్ద పదవులు, హోదాల్లో ఉంటూ ప్రేక్షకపాత్ర వహిస్తున్న అధికారుల తీరు ఆక్షేపణీయం.

ప్రశ్న : ముస్లిం బాలికల పరిస్థితి ఎలా ఉంటుంది?

జవాబు: ముస్లిం బాలికలకు స్వేచ్ఛ ఇవ్వాలని తల్లీదండ్రులను కోరుతున్నా. అమ్మాయిలను చదివించడం అనవసరం అన్న భావన మారాలి. కూతురికి పెళ్లి చేసి అత్తారింటికి పంపిస్తే ఆమె తన భర్త, పిల్లలను చూసుకుంటూ బతికేస్తుందని తల్లీదండ్రులు భావిస్తారు. ఆమెకు స్వేచ్ఛలేకుండా రెక్కలను కత్తిరించి హాయిగా సంతోషంగా బతకాలని అనుకుంటారు. ఈ ధోరణి పోవాలి. కుమార్తె-కొడుకు మధ్య వివక్ష ఉండరాదు. చదివిస్తే కుమారులతో సమానంగా కుమార్తెలు రాణిస్తారు. మంచి ఉద్యోగాలు చేస్తారు. సమాజంలో గౌరవంగా బతకగలుగుతారు. కొడుకల కంటే ఓ రకంగా ఎక్కువగా బాధ్యతలనూ కుమార్తెలు తీసుకోగలరు.

ప్రశ్న : మీ గ్రామంలో పార్టీ పాత్ర గురించి చెప్పండి

జవాబు: గ్రామీణ ప్రాంతాల్లో భూవివాదాలు-హత్యలు జరిగినప్పుడు అందరి కంటే ముందు స్పందించేది ఎర్రజెండానే. బాధితులకు సీపీఐ అండగా నిలుస్తుంది. వారికి న్యాయం కోసం పోరాడుతుంది. విద్యార్థులపై దాడులూ జరుగుతున్నాయి. ప్రభుత్వం తరపున విద్యార్థులు అణచివేతకు గురవుతున్నారు. దాడులను ఎదుర్కొంటున్నారు. అలాంటప్పుడు ఎర్రజెండా నీడలో ఆందోళనలు జరుగుతాయి.

పేదలకు, బాధితులకు ఎల్లప్పుడు ఎర్రజెండా అండగా ఉంటుంది. ప్రతి విద్యార్థి ఎర్రజెండా చేబూని ధైర్యంగా ముందుకు వెళ్లగలుగుతున్నాడు. మోదీ ప్రభుత్వం మతం దందా చేస్తోంది. వారి అధికార అహానికి ఏదో ఒక రోజు పతనం తప్పదు. విద్యార్థి సమాఖ్య వినాశనాన్ని ప్రభుత్వం కోరుకుంటోంది. ఏఐఎస్ఎఫ్ - ఎర్రజెండా అంతాన్ని ఆకాంక్షిస్తుందిగానీ మేము అలా ఎప్పటికీ జరగనివ్వం. ఐక్యంగా, పటిష్టంగా ఎర్రజెండా నీడలో ఉద్యమిస్తాం. అక్రమాలను ఎదుర్కొంటాం. అవినీతిని నిలదీస్తాం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేపడతాం. విద్యార్థులు, మహిళలు, రైతులు ఏకతాటిపైకి వచ్చి అన్యాయాన్ని, అక్రమాలను ఎదురిస్తారు. ఎర్రజెండానే మాకు బలం-ధైర్యం.

ప్రశ్న: భవిష్యత్‌లో ఏం చేయాలని అనుకుంటున్నారు?

జవాబు: భవిష్యత్ ప్రణాళికలు అంటే ప్రస్తుతానికి కచ్చితంగా ఏమీ చెప్పలేను. నేను కబడ్డీ ఆడతాను. తోటి బాలికలలో చైతన్యం తెస్తున్నాను. సామాజిక సంకెళ్లను తెంచుకొని సామర్థ్యం-నైపుణ్యం పెంచుకునేలా ప్రోత్సహిస్తున్నాను. ప్రతి అమ్మాయికి ఏవో కొన్ని కలలు, ఆశలు, ఆకాంక్షలు ఉంటాయి. వాటి సాధన కోసం కృషిచేసేలా ప్రోత్సహిస్తాను. ఇదంతా నాకు సంతోషాన్ని ఇస్తుంది. ప్రజా సేవ నాకు సంతృప్తినిస్తుంది. సంఘ సంస్కర్తగా-కార్యకర్తగా ఎదగాలని భావిస్తున్నాను. పొట్టకూటి కోసం ఏదో ఒక పని చేయక తప్పదు కదా!

ప్రశ్న: ఇంతకుముందు ఇంటర్వ్యూలు ఇచ్చారా?

జవాబు: లేదు. ఇదే మొదటి ఇంటర్వ్యూ. ఆనందంగా అనిపించింది.

ప్రశ్న : ఎర్రజెండా పట్టేందుకు ప్రేరణ ఏమిటి?

జవాబు: నేను గ్రామంలో పెరిగాను. ఇక్కడి పరిస్థితులు, సమస్యలు, పేదరికాన్ని చూశాను. చిన్ననాటి నుంచి ఎర్రజెండా నీడలో పెరిగానుగానీ అప్పట్లో దాని ప్రాధాన్యత తెలియలేదు. తర్వాత తెలుసుకున్నాను. రాష్ట్రంలో భూకబ్జాలు ఎక్కువ. పట్టాలు ఉన్నాగానీ కబ్జాకోరుల ఆగడాలకు అమాయకులు కోర్టుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా న్యాయం జరిగే పరిస్థితి ఉండదు. అలాంటి వారందరికీ ఎర్రజెండా అండ-దండ. అన్యాయాన్ని ఎదిరిస్తూ బాధితుల పక్షాన నిలుస్తూ న్యాయపోరాటం సాగిస్తుంది. అదే నాకు ప్రేరణగా మారింది. ఎర్రజెండా పట్టాలన్న ఆలోచన వచ్చింది. ఏఐఎస్ఎఫ్ ద్వారా సమస్యలపై పోరాడే శక్తి లభించింది. సామాజిక అవగాహన పెరిగింది. నా ఆలోచన, దృష్టికోణంలో మార్పు వచ్చింది. ఏఐఎస్ఎఫ్ కారణంగానే నేడు ఈ స్థాయికి చేరుకోగలిగాను. కమ్యూనిస్టుగా ఆలోచించగలుగుతున్నాను. కమ్యూనిస్టు ఉద్యమంలో భాగస్వామ్యం అవుతున్నాను. పరిస్థితులను తగిన విధంగా అవగాహన చేసుకోగలుగుతున్నాను. రాజకీయాలనూ అర్థం చేసుకుంటున్నాను. ఇది నాకు సంబంధించి చాలా పెద్ద విషయం.

సకాకళే మున్నోట్... సకాకళే మున్నోట్...

ప్రతినిధులను ఉర్రూతలూగించిన విప్లవ గీతం

విశాలాంధ్ర-గురుదాస్ దాస్‌గుప్తా నగర్: సీపీఐ 24వ జాతీయ మహాసభల ప్రతినిధుల సభలో చివరి రోజైన మంగళవారం కేరళలోని కొల్లాం జిల్లాకు చెందిన పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ఆర్. విజయకుమార్ పాడిన విప్లవగీతం అందరిని ఉర్రూతలూగించింది. సకాకళే మున్నోట్... సకాకళే మున్నోట్ (ముందుకు పదరా వీరుడా... కామ్రేడ్ పదరా ముందుకు ముందుకు) అంటూ ప్రాంతీయ భాషలో పాడిన ఈ విప్లవ గీతం ప్రతినిధులను ఉత్సాహపరిచింది. విజయకుమార్ రెట్టించిన ఉద్వేగంతో పాడి అందరినీ మెప్పించారు.

సీకే చంద్రప్పన్ ఫౌండేషన్‌కు ఏఐకేఎస్ రూ.2 లక్షల విరాళం

గురుదాస్ దాస్ గుప్తా నగర్ (విజయవాడ): ప్రముఖ కమ్యూనిస్టు, పార్లమెంటేరియన్ సీకే చంద్రప్పన్ ఫౌండేషన్‌కు అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) రూ. 2 లక్షలు విరాళంగా అందజేసింది. విజయవాడ నగరంలోని గురుదాస్ దాస్ గుప్తా నగర్ ప్రాంగణంలో జరుగుతున్న సీపీఐ 24వ జాతీయ మహాసభల్లో సోమవారం రాత్రి మహాసభ వేదికపై ఈ చెక్కును కేరళ రాష్ట్ర కార్యదర్శి కానం రాజేందర్‌కు ఏఐకేఎస్ అధ్యక్షుడు రావుల వెంకయ్య, ప్రధాన కార్యదర్శి అతుల్‌కుమార్ అంజాన్, తెలంగాణా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, ఏఐకేఎస్ నేతలు సత్యన్ మోకిరే, తారాసింగ్ సిద్ధూ అందజేశారు.

సీపీఐ 24వ మహాసభలకు భోజనాలు క్యాటరింగ్ చేసిన నాగేశ్వరరావును సత్కరిస్తున్న డి.రాజా, నారాయణ, రామకృష్ణ

సీపీఐ ప్రతినిధులంతా అక్షరాస్యులే

- 18 ఏళ్ల బాలిక, 90 ఏళ్ల కురువృద్ధుడు...
- మంత్రి, నలుగురు ఎంపీలతో సహా 170 మంది ప్రజాప్రతినిధులు హాజరు
- ఇతర పార్టీల నుంచి సీపీఐలో చేరినవారు 34 శాతం
- జాతీయ మహాసభల్లో అర్హతా పత్రాల నివేదిక వెల్లడి

నివేదికను ప్రవేశపెడుతున్న యుగల్ రాయలు

గురుదాస్ దాస్ గుప్తా నగర్ (విజయవాడ): భారత కమ్యూనిస్టుపార్టీ జాతీయ మహాసభల్లో పాల్గొన్న ప్రతినిధులంతా నూటికి నూరుశాతం మంది అక్షరాస్యులే. మొత్తం 950 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఇందులో 28 శాతం పోస్టు గ్రాడ్యుయేట్స్ కాగా, 38 శాతం మంది పట్టభద్రులున్నారు. 12వ తరగతి పైబడి చదివిన వారు 10 శాతం, పదవ తరగతిలోపు చదివిన వారు 17 శాతం, డాక్టరేట్‌లు ఒక శాతం ఉన్నారు. విజయవాడలో ఈనెల 14 నుంచి 18వరకు జరిగిన సీపీఐ 24వ జాతీయ మహాసభలకు హాజరైన ప్రతినిధులు 28 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 809 మంది తమ తమ అర్హతా పత్రాలను సమర్పించారు. మహాసభల ముగింపు సందర్భంగా మంగళవారం ఈ అర్హత పత్రాల నివేదికను పార్టీ నాయకత్వం విడుదల చేసింది. దీనిప్రకారం మహాసభలకు హాజరైన ప్రతినిధుల్లో 88 శాతం పురుషులు, 12 శాతం మంది మహిళలున్నారు. వయస్సుల వారీగా చూస్తే 20 సంవత్సరాల లోపు ఒకరు కాగా, 20 నుంచి 30 లోపు 18 మంది, 31 నుంచి 40 లోపు 57, 41 నుంచి 60 లోపు 338, 61 నుంచి 70 లోపు 255, 70 సంవత్సరాలు పైబడిన వారు 138 మంది ఉన్నారు. వీరిలో 18 సంవత్సరాల అతి పిన్న వయస్కురాలు బీహార్‌కు చెందిన షబీనా ఖాతూన్ కాగా, అతి పెద్ద వయస్కుడు సీఆర్ భక్షి (90 సంవత్సరాలు) కావడం విశేషం. 1970కి ముందు పార్టీలో చేరిన వారు 106 మంది, 71 నుండి 80 మధ్య చేరిన వారు 240, 81 నుంచి 90 మధ్య చేరిన వారు 205, 91 నుంచి 2000 మధ్య చేరిన వారు 110 , 2001 నుంచి 2010 మధ్య చేరిన వారు 92 మంది, 2011 నుంచి 15 మధ్య చేరిన వారు 34, 2015 తర్వాత చేరిన వారు 16 మంది ఉన్నారు. వీరిలో 782 మంది పార్టీ హోల్ టైమర్లుండగా, ఇందుకు 46 శాతం మంది ఎలాంటి కనీస గౌరవ వేతనం పొందకుండా ఉచితంగానే పార్టీకి సేవలందిస్తున్నారు. 29 శాతం మంది ట్రేడ్ యూనియన్ రంగంలోనూ, 10 శాతం వ్యవసాయ కార్మికులుగానూ, రెండు శాతం సాంస్కృతిక రంగంలోనూ, ఒక శాతం రచయితలుగానూ, ఎనిమిది శాతం మంది మహిళా సంఘాల్లోనూ, ఆరు శాతం యువజన, మూడు శాతం విద్యార్థి, రెండు శాతం ఇతర రంగాల్లో పనిచేస్తుండగా, 22 శాతం ఏ రంగంలోనూ లేకుండానూ, 18 శాతం మంది రైతులుగానూ ఉన్నారు. హాజరైన ప్రతినిధుల్లో మొత్తం 170 మంది వివిధ స్థానిక సంస్థలు, ఇతర చట్ట సభల్లో ప్రజాప్రతినిధులుగా ఉన్నారు. వీరిలో ఒక మంత్రి, నలుగురు ఎంపీలు కూడా ఉన్నారు. 34శాతం మంది ఇతర పార్టీల నుంచి సీపీఐలో చేరారు.

దక్షిణాఫ్రికాలో

వర్ణవివక్ష సమసిపోలేదు

- దేశంలో నయా ఉదారవాద విధానాలపై పోరాడుతున్నాం
- దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యురాలు షింగే మైఖేల్ మదాలా

భారత కమ్యూనిస్టు పార్టీ 24వ జాతీయ మహాసభలకు విజయవాడకు విచ్చేసిన దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యురాలు, మహిళా నాయకురాలు షింగే మైఖేల్ మదాలాతో విశాలాంధ్ర ప్రతినిధి రోమిల ముఖాముఖి:

ప్ర: ముందుగా నెల్సన్ మండేలా వారసురాలిగా మీ పోరాట స్ఫూర్తికి విప్లవాభివందనాలు. భారతదేశంతో దక్షిణాఫ్రికాకు గల అవినావభావ సంబంధాల గురించి చెప్పండి

జ : భారత జాతిపిత మహాత్మాగాంధీ దక్షిణాఫ్రికాలో అడుగుపెట్టడమే భారతదేశ చరిత్ర మార్చేందుకు కారణమైందనేది స్పష్టం. అక్కడ ఎదురైన వర్ణ వివక్షే భారతదేశంలో ఆయన స్వాతంత్ర్య పోరాటానికి కారణమైంది. ఇప్పటికీ దక్షిణాఫ్రికాలో వర్ణవివక్ష సమసిపోలేదు. దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీగా శక్తివంచన లేకుండా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పని చేస్తున్నాం.

ప్ర: వర్ణ వివక్షకు వ్యతిరేకంగా దక్షిణాఫ్రికాలో కమ్యూనిస్టు పార్టీ (ఎస్‌ఏసీపీ) చేపట్టిన పోరాటాలు.. ప్రస్తుత పరిస్థితి?

జ: 1921లో స్థాపించిన దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీ తదనంతర పరిస్థితుల్లో రద్దు అయ్యింది. తిరిగి 1953లో పునఃప్రారంభమైంది. తాజాగా ఎస్‌ఏసీపీ 15వ సమావేశాన్ని మేం అత్యంత ఘనంగా నిర్వహించుకున్నాం. ముఖ్యంగా రానున్న ఐదు సంవత్సరాల కాలంలో దేశాన్ని అత్యంత పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థగా వృద్ధి చేయాలనేది మా డిమాండ్. దేశంలో మరింతగా పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా పెరిగిపోతున్న నిరుద్యోగానికి అడ్డుకట్ట వేయాలని మేం తరచూ మా పోరాటాల ద్వారా ఉద్యమిస్తున్నాం. అయితే ప్రభుత్వ విధానాలు మాత్రం సోషలిజాన్ని ఎండమావిగా మార్చేందుకు ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. దేశంలో అమలులో ఉన్న నయా ఉదారవాద విధానాలను ప్రతిఘటిస్తూ కార్మికశక్తిని మరింత బలోపేతం చేయడం ద్వారా సామ్యవాద సోషలిజాన్ని నిర్మించడమే మా ముందున్న తక్షణ కర్తవ్యం.

ప్ర: దేశంలో ప్రధాన సమస్యలైన అసమానతలు, వర్ణవివక్షను ఎస్‌ఏసీపీ ఎలా ఎదుర్కొంటోంది?

జ: దేశంలో అసమానతలు, సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కోవడానికి అంతర్జాతీయ సంఘీభావాన్ని మేం కోరుకుంటున్నాం. ఐక్యరాజ్యసమితి జోక్యంతో దేశంలో ప్రధాన సమస్యలకు పరిష్కారం సాధ్యమని మా ఉద్దేశం. పర్యావరణాన్ని పరిరక్షించడం మా ముందున్న మరో సవాలు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎస్‌ఏసీపీ సంఘటితంగా పోరాడుతోంది. మాతో కలిసివచ్చే ప్రగతివాద శక్తులను కలుపుకుని సామ్యవాద సిద్ధాంతం అమలుకు మేం కృషి చేస్తున్నాం. కమ్యూనిస్టు భావజాల నిర్మాణానికి, నిరంకుశ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మేం ఎన్నో ఉద్యమాలు చేపట్టాం. దేశంలో నిరుద్యోగ సమస్య మరింత జటిలమైంది. కరోనా అనంతరం దేశ ఆర్థిక పరిస్థితి మరింతగా దిగజారింది. ప్రపంచ దేశాల మధ్య పెరుగుతున్న యుద్ధ సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. దీనిలో ఐరాస జోక్యం అవసరం. తాజాగా దేశంలో వేతనాల పెంపుకోసం కార్మికులు చేపట్టిన సమ్మెకు సంఘీభావం తెలుపుతూ దేశంలో ఉద్యమించాం. యునైటెడ్ ట్రాన్స్‌పోర్టు, అలైడ్ ట్రేడ్ యూనియన్ సంయుక్తంగా వేతనాలపెంపునకు డిమాండ్‌చేశాం. దేశంలో ద్రవ్యోల్బణం మరింతగా పెరగడంతో జీవన వ్యయం భారీగా పెరిగింది. దేశంలో కొన్ని ప్రాంతాల్లో తీవ్ర దుర్భిక్షాన్ని ఎదుర్కొంటున్నాం.

కోవిడ్ నుంచి బైటపడినప్పటికీ దేశంలో యువత అధికంగా నిరుద్యోగాన్ని ఎదుర్కొంటోంది. వ్యవసాయం, ఎగుమతి రంగాలలో ఉపాధి పొందుతున్న అనేకమందికి కరోనా కష్టాలు మిగిల్చింది. ఏదిఏమైనప్పటికీ కమ్యూనిస్టులుగా సోషలిజం భావజాలంతో దేశంలో సమస్యలపై పోరాటానికి ఏమాత్రం వెనక్కి తగ్గేదేలేదు. మేం మా గళాన్ని వినిపించేందుకు తదుపరి ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేస్తాం. ప్రజాపోరాటాల ద్వారా మేం పార్టీ పటిష్టానికి నడుం కడతాం.. కమ్యూనిజం వర్ధిల్లాలి.. సోషలిజం వర్ధిల్లాలి.

ముజఫర్ అహ్మద్‌ది
సుదీర్ఘ జైలు జీవితం

'కాకాబాబు'గా చిరపరిచితులైన ముజఫర్ అహ్మద్ భారతీయ బెంగాలీ రాజకీయవేత్త, పాత్రికేయుడు, భారత కమ్యూనిస్టుపార్టీ సహవ్యవస్థాపకుడు. నాటి బ్రిటిష్ ఇండియాలోని బెంగాల్ ప్రావిన్స్‌లో (ప్రస్తుత బంగ్లాదేశ్) చిట్టగాంగ్ జిల్లా సంద్వీప్ ఐలాండ్‌లోని మూసాపూర్ గ్రామంలో మన్సూర్ అలీ, చూనాబీబీ దంపతులకు 1889, ఆగస్టు 5న జన్మించారు. కంపెనీగంజ్‌లోని అస్రియా సీనియర్ మదర్సాలో చదువుకున్నారు. 1913లో నోఖాలీ జిల్లా నుండి మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణులయ్యారు. 1918లో ఆయన బేంజియా ముసల్మాన్ సాహిత్య సమితి సహాయ కార్యదర్శిగా నియమితులయ్యారు.

1920లో కాజీ నజ్రుల్ ఇస్లాంతో కలిసి ఆయన "నవాజంగ్" మ్యాగ్జైన్‌ను ప్రారంభించారు. ఆ తరువాత 1922లో నజ్రుల్ "ధూమ్‌కేతు" మ్యాగ్జైన్‌ను ప్రారంభించి "ద్వాయిపయన" మారుపేరుతో దాన్ని ఉపయోగించుకున్నారు. ముజఫర్ అహ్మద్‌కు కుమార్తె నర్గీస్ వున్నారు. ఆమె కవి అబ్దుల్ ఖదీర్‌ను వివాహం చేసుకున్నారు. అహ్మద్ కార్యదర్శిగా 1922లో కలకత్తాలో భారత్ సామ్యతంత్ర సమితి ఏర్పడింది. ఆ తరువాత 1924లో ఎస్.ఏ. డాంగే, నళినీ గుప్తా, షౌకత్ ఉస్మానీతో పాటుగా కాన్పూర్ కుట్ర కేసులో అహ్మద్‌కు నాలుగు సంవత్సరాలు జైలు శిక్ష విధించారు. అనారోగ్యం కారణంగా 1925లో ఆయన విడుదలయ్యారు. 1925 నవంబర్ అహ్మద్ కాజీ నజ్రుల్ ఇస్లాం, హేమంత్ కుమార్ సర్కార్ తదితరులతో కలిసి బెంగాల్ లేబర్ స్వరాజ్ పార్టీని నిర్మించారు. 1920 దశకంలో అబ్దుల్ హలీం, అబ్దుల్ రజ్జాక్ ఖాన్‌తో పాటుగా సీపీఐ ముఖ్యనాయకులలో ముజఫర్ అహ్మద్ ఒకరు. 1939 జూన్ 26న నేషనల్ బుక్ ఏజెన్సీని ఆయన స్థాపించారు.

1929 మార్చి 20న బ్రిటిష్ వలస ప్రభుత్వం 31 మంది. క్రియాశీల కార్మికకార్యకర్తలను అరెస్టు చేసి, విచారణకు మీరట్ పంపించింది. ఎస్.ఏ.డాంగే, షౌకత్ ఉస్మానీ, పీసీ జోషీ తదితరులతో పాటుగా మీరట్ కుట్ర కేసు ప్రధాన ముద్దాయిగా ఆరోపించబడిన అహ్మద్‌కు శిక్ష విధించారు. 1936లో ఆయన విడుదలయ్యారు. మీరట్ కుట్ర కేసు విచారణలో ప్రధాన నిందితుడిగా అహ్మద్ సుదీర్ఘకాలం జైలుశిక్ష అనుభవించారు.

1947లో దేశ విభజనానంతరం తూర్పు పాకిస్థాన్ (ఇప్పుడు బంగ్లాదేశ్)లో వుండకుండా అహ్మద్ కలకత్తా వచ్చేశారు. 1948 మార్చి 25న ప్రభుత్వం భారత కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించి, అహ్మద్‌ను అరెస్టు చేసి జైలుశిక్ష విధించారు. 1951లో విడుదలైన అహ్మద్‌ను 1964లో తిరిగి అరెస్టుచేసి, రెండు సంవత్సరాలు జైలుశిక్ష విధించారు. 1965లో మరోసారి రెండేళ్ల జైలు శిక్ష విధించారు. స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సార్లు అహ్మద్‌ను అరెస్టు చేసి జైలు శిక్షలు విధించింది. 1973, డిసెంబర్ 18న ఆయన కన్నుమూశారు.

ఎస్.కే. బాబు

గిరి దళం సేనాని



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న యోధుడు. గిరి దళం సేనాని నల్లమల గిరిప్రసాద్. మద్రాసు కాలేజీలో చదువుతుండగా నిజాం సంస్థానం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా 'ఆంధ్ర మహాసభ' సాగిస్తున్న ఉద్యమంతో ప్రభావితులయ్యారు. 1947 లో కాలేజీ చదువులకు స్వస్తి చెప్పి ఆంధ్రమహాసభ కార్యకలాపాలలో పాల్గొంటూ కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించారు. ఆనాడు గ్రామ రక్షణ దళంలో చేరి భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ నిర్మూలన కోసం జరిగిన ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఖమ్మం జిల్లా మధిర తాలూకా తొండల గోపవరం ఆయన స్వగ్రామం. మధ్యతరగతి రైతు కుటుంబంలో 1931 ఏప్రిల్ 6న ఆయన జన్మించారు.

నిజాం రాక్షస రజాకారుమూకలు గ్రామాల పైబడి బీభత్సకాండ జరుపుతుండగా ప్రజలు తిరగబడి సాయుధ పోరాటాన్ని ప్రారంభించిన తరుణంలో వీరు తుపాకి ధరించి దళసభ్యుడిగా అనేక గ్రామాల ప్రజలను కాపాడుతూ వేలాది ఎకరాల భూమిని పంచి గ్రామరాజ్యాలను స్థాపించారు. యూనియన్ సైన్యాలు నైజాం రాజ్యన్ని స్వాధీనం చేసుకుని తరువాత- భారత సైన్యం సాయుధ దళాలపై దాడులు జరిపిన సమయంలో,తన గెరిల్లా దళంతో సహా పాల్వంచ ప్రాంతంలో ప్రవేశించి అచ్చట దళ నాయకుడుగాను, ఏరియా పోరాట కమిటీ సభ్యుడుగానూ ఉంటూ మన్యం ప్రజలలో చైతన్యాన్ని కలిగించారు.

గిరిప్రసాద్ దళాన్ని పట్టుకునేందుకు వందలాదిమంది పోలీసులు, సైన్యం అనేక దాడులు జరిపినప్పటికీ వాటన్నింటినీ ఎదిరిస్తూ, అధిగమిస్తూ తమ దళాన్ని కాపాడుకున్నారు. ఒక స్థావరం వద్ద జరిగిన తీవ్రమైన కాల్పులలో గిరిప్రసాద్ ఛాతీ నుండి తుపాకీ గుండు దూసుకుపోయినప్పటికీ పట్టుబడకుండా తప్పించుకున్నారు. రక్తం మడుగులో ఉన్న వీరిని మన్యం ప్రజలు కాపాడి తమ ప్రియతమ నాయకుడ్ని రక్షించుకున్నారు. ఆ కాలంలో 'గిరిదళం' వైపు వెళ్లడానికి పోలీసులు, సైన్యాలు సాహసించలేకపోయాయి. కొత్తగూడెంలో బొగ్గుగని కార్మికుల యూనియన్ స్థాపించిన ఏకైక నాయకుడు కామ్రేడ్ శేషగిరిరావును ప్రభుత్వం కాల్చివేసిన సందర్భంలోఆ అమరవీరుని పేరులోని 'గిరి' అనే పదాన్ని వీరు స్వీకరించి 'గిరిదళం' అనే పేరుతో ఆనాడు పోరాటాన్ని నిర్వహించారు. వీరు అజ్ఞాతవాసం నుండి బయటకు వచ్చిన తరువాత కూడా గెరిల్లా పోరాట దళంలో ఉంచబడిన వీరి 'గిరి' అనే పేరును ప్రజలు విడువకుండా, తమ నాయకునిపైగల ప్రేమాభిమానాలతో"గిరిప్రసాద్‌రావు" అని పిలువసాగారు. అదే విప్లవనామం వీరికి సార్థకమైంది.

ఐదు సంవత్సరాలు అజ్ఞాతవాసంలో గడిపి, సాయుధ పోరాట విరమణ జరిగిన తరువాత 1953 లో బయటకు రాగానే ప్రభుత్వం వీరిని అరెస్టు చేసింది. వీరిపై అనేక కేసులు మోపి సంవత్సరంపాటు జైలులో ఉంచింది. ఆ కేసులలో ఏదీ రుజువుకాలేదు. 1958 లో ఖమ్మం జిల్లా కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శిగా ఎన్నికై 1964 లో పార్టీ చీలిక వరకు 11 సంవత్సరాలపాటు జిల్లా కార్యదర్శిగా ఉంటూ, జిల్లాలో బలమైన కమ్యూనిస్టు పార్టీని, గణనీయమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించారు. పార్టీ కార్యదర్శిగా ఇటు కమ్యూనిస్టు పార్టీ వర్గాలలోనేగాక అనేక వర్గాల ప్రజల మన్ననలను చూరగొన్నారు. 1962 లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఖమ్మం నియోజకవర్గం నుండి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీచేసి కాంగ్రెస్‌పై అత్యధిక మెజారిటీ ఓట్లతో గెలుపొంది ప్రజల సమస్యలను శాసనసభ వేదికపై అందరి దృష్టికి తెస్తూ మంచి వక్తగా పేరుపొందారు. 1962 లో చైనా- భారత సరిహద్దు సంఘర్షణ సందర్భంలో వీరిని ప్రభుత్వం దేశ రక్షణ చట్టం క్రింద ఒక ఏడాదిపాటు జైలులో నిర్బంధించింది.

'విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు' అనే నినాదంతో ఆంధ్రదేశంలో ఉవ్వెత్తున లేచిన ఉద్యమానికి అండగా తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. 1964 లో పార్టీ చీలికతో ఖమ్మంలో అత్యంత బలహీనదశలో ఉన్న భారత్ కమ్యూనిస్టు పార్టీ పునర్నిర్మాణానికి అహర్నిశలూ కృషి చేశారు. రాష్ట్ర కమ్యూనిస్టు సమితి కార్యదర్శివర్గ సభ్యునిగా, సహాయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూనే, ఖమ్మం జిల్లాలో కమ్యూనిస్టు పార్టీని బలమైన శక్తిగా రూపొందించారు. 1978 లో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శిగా ఎన్నికై 1991 వరకు ఆ బాధ్యత నిర్వర్తించారు. విశాలాంధ్ర విజ్ఞానసమితి అధ్యక్షులుగా కూడా పనిచేశారు. 1992 నుండి రాజ్యసభ సభ్యులుగా వ్యవహరించారు. పార్లమెంటులో పేదల, ప్రజానుకూల విధానాలపై పార్టీ తరపున బలమైన వాణిగా నిలిచారు. 1905 లో ఆయన రాజ్యసభలో సి.పి.ఐ. పక్ష నాయకుడిగా ఎన్నికయ్యారు. 1992 లో సి.పి.ఐ. జాతీయ సమితి కార్యదర్శిగా, 1996 లో ఉప ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు.

1997 మే 24 వ తేదీన కామ్రేడ్ గిరిప్రసాద్ మృతి చెందారు.

- విప్లవ్

పీడిత, తాడితుల గళం గుజ్జుల

గుజ్జుల యల్లమందారెడ్డి

ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి, అఖిలభారత స్థాయిలో వ్యవసాయ కార్మికసంఘం నిర్మాణం - ఉద్యమాలకు జీవితాన్ని అంకితం చేసిన ధన్యజీవి గుజ్జుల యల్లమందారెడ్డి (1923 - 1997). భూమికోసం, భుక్తికోసం పేద ప్రజలను సమీకరించి అనేక పోరాటాలను నిర్వహించారు.పార్లమెంట్‌లో ప్రజావాణిని వినిపించిన జననేత ఆయన. 1962లో ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం నియోజకవర్గం నుంచి ఆయన లోక్‌సభకు ఎన్నికయ్యారు. యల్లమందారెడ్డి నెల్లూరు జిల్లా కనిగిరి తాలూకా (ప్రస్తుతం ప్రకాశం జిల్లా) నేరేడుపల్లెలో పేదరైతు కుటుంబంలో 1923లో జన్మించారు. 1939 నుంచి 1942 వరకు ఒంగోలు హైస్కూల్‌లో చదువుతున్నప్పుడే అనేక విద్యార్థి పోరాటాలను జయప్రదంగా నడిపారు. 1941లో ఎబిఎం హైస్కూల్‌లో డిటెన్షన్ విధానానికి వ్యతిరేకంగా, విద్యార్థుల ఇతర సమస్యలపై జరిగిన చరిత్రాత్మక సమ్మెకు యల్లమందారెడ్డి నాయకత్వంవహించారు. హైస్కూల్ విద్యార్థి ఫెడరేషన్ అధ్యక్షులుగా పనిచేశారు. అనంతరం నెల్లూరు వీఆర్ కాలేజిలో విద్యాభ్యాసం కొనసాగించారు. అక్కడ చదువుతున్నప్పుడే 1943లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం పొందారు. 1960-1962 మధ్య కాలంలో తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ సెనెట్ సభ్యునిగా పనిచేశారు. 1952లో రహస్య జీవితం నుండి బయటకు రాగానే పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. జైలు నుంచే కనిగిరి నియోజకవర్గం నుంచి కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేసి ఘనవిజయం సాధించారు. మద్రాస్ అసెంబ్లీ సభ్యులుగా వుంటూ ఆంధ్రరాష్ట్ర నిర్మాణం, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ తదితర సమస్యలపై ఆందోళన సాగించారు. ఆ తరువాత 1953-56,1956-62 ఎన్నికలలో కూడా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1959 నుంచి 1962 మధ్య అసెంబ్లీలో సీపీఐ పక్ష ఉపనేతగా ప్రజా సమస్యలను సభ ముందుంచడంలో కృతకృత్యులయ్యారు. 1962, సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1963, డిసెంబర్ లో ప్రభుత్వం ఆయనను అరెస్టుచేసి రాజమండ్రి, హైదరాబాద్ జైళ్లలో 1964 ఏప్రిల్ వరకు డిటెన్యూగా వుంచింది. 1966లో విశాఖ ఉక్కుఫ్యాక్టరీ సాధనకోసం ప్రారంభమైన ఉద్యమంలో పాల్గొన్నారు. ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని కోరుతూ 1966 నవంబర్‌లో లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి కృషిచేశారు. ముఖ్యంగా వ్యవసాయ కార్మికుల సమస్యలపై యల్లమందారెడ్డి అలుపెరగని పోరు సల్పారు.

వెంకటగిరి జమీందారీ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమం నిర్మించారు. 1947లో జమీందారీ రద్దు చట్టంకోసం ప్రత్యేక రైలులో మద్రాసు వెళ్లిన యాత్రా దళంలో ఆయన సభ్యులుగా ఉన్నారు. 1948లో ఆయనపై అరెస్ట్ వారెంట్ జారీ అయినప్పటికీ ప్రభుత్వానికి చిక్కకుండా నాలుగేళ్లు రహస్య జీవితం గడిపారు. కనిపిస్తే కాల్చి చంపమని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కాని ప్రజలు కంటి పాపవలే యల్లమందారెడ్డిని రక్షించారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు పార్టీలో నాయకత్వ బాధ్యతలు నిర్వహించిన యల్లమందారెడ్డి ఆ తరువాత కాలంలో కేంద్ర కార్యవర్గానికి ఎన్నికయ్యారు. అప్పటి పార్టీ ప్రధాన కార్యదర్శి చండ్ర రాజేశ్వరరావు ప్రోత్సాహంతో భారతీయ ఖేత్ మజ్దూర్ సంఘ్ (బీకేఎంయూ-వ్యవసాయ కార్మికసంఘం) అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. అనేక రాష్ట్రాలకు వెళ్లి సంఘం నిర్మాణాన్ని విస్తరించారు.

యల్లమందారెడ్డి భార్య సరళాదేవి భర్తతోపాటు కమ్యూనిస్టు ఉద్యమంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో మహిళా సమాఖ్య నిర్మాణంలో దీర్ఘకాలం పనిచేసిన అనంతరం భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ)ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై మహిళాభ్యున్నతికి జీవితాంతం ఉద్యమకారిణిగా కొనసాగారు. గుజ్జుల యల్లమందారెడ్డి 1997 ఏప్రిల్ 27న హైదరాబాద్‌లో కన్నుమూశారు.

-మోదుమూడి మురళీకృష్ణ

నిజాం నిరంకుశంపై పోరాడిన వీరనారి


ఆరుట్ల కమలాదేవి

నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా, నైజాం ప్రాంతాన్ని విముక్తి చేసి స్వాతంత్ర్య భారతంలో విలీనం చెయ్యాలని, విశాలాంధ్ర స్థాపించాలని సాగించిన పోరాటంలో ఆరుట్ల కమలాదేవి, రామచంద్రారెడ్డి ప్రముఖపాత్ర పోషించారు. తెలంగాణ విముక్తి ఉద్యమాన్ని భారత స్వాతంత్ర్య సమరంలో భాగంగా గుర్తించకపోవడం అత్యంత విచారకరమని కమలాదేవి పలుమార్లు వాపోయేవారు.

నల్లగొండ జిల్లా ఆలేరు మండలంలోని మంతపురి గ్రామంలో 1920లో ఆరుట్ల కమలాదేవి జన్మించారు. తండ్రి ఎల్లా వెంకట్రామరెడ్డి, తల్లి లక్ష్మీనర్సమ్మ. మధ్యతరగతి రైతు కుటుంబం.11 సంవత్సరాల వయస్సులో మేనమామ కొడుకు ఆరుట్ల రామచంద్రారెడ్డితో వివాహం జరిగింది. అప్పటికి రామచంద్రారెడ్డి హైదరాబాదు రెడ్డి హాస్టల్లో వుంటూ చదువుకుంటున్నారు. దేశమంతటా స్వాతంత్ర్య ఉద్యమం ముమ్మరంగా సాగుతున్నరోజులు.. శాసనోల్లంఘనోద్య మం,మరో ప్రక్క భగత్ సింగ్,రాజగురు,సుఖదేవ్‌ల ఉరిశిక్ష , మీరట్ కుట్రకేసులతో సంచలనం కలిగిస్తున్న రోజులు. హైదరాబాదు సంస్థానంలో దొరలు, దేశముఖ్‌లు, పెత్తందార్ల దోపిడీ సాగుతున్న రోజులు. జాతీయ మహిళా నాయకులుగా కమలాదేవి ఛటోపాధ్యాయ, సరోజినీ నాయుడుగార్ల పేర్లు బహుళ ప్రచారంలో ఉండటంతో రామచంద్రారెడ్డి పెళ్ళిలో రుక్మిణీదేవిగా ఉన్న పేరును కమలాదేవిగా మార్పు చేశారు. అయితే పెళ్లిలో కొన్ని షరతులు విధించారు. వైదిక మంత్రతంత్రాలతో గాక ఆర్యసమాజ పద్ధతి వివాహం, రెండోది కమలాదేవిని చదివించడం. హైదరాబాదులో ఆంధ్ర గర్ల్స్ హైస్కూలులో తెలుగు భాషలో బోధనగా ఉన్న స్కూల్లో చేర్పించి చదివించారు. సమీపంలోని రెడ్డి హాస్టల్‌కు అనుబంధంగా ఉన్న బాలికల హాస్టల్‌లో ఉండేవారు. 1934 నుండి ఆంధ్ర మహాసభలకు కలిసి వెళ్లేవారు. వలంటీరుగా పనిచేస్తుండేవారు. రామచంద్రా రెడ్డిగారికి కమలాదేవి జీవిత భాగస్వామినే గాకుండా, రాజకీయాల్లో కూడా భాగస్వామిని చేయాలని వుండేది. ఆంధ్ర మహాసభల సందర్భంలోనే రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి మొదలైనవారితో పరిచయం కలిగింది. హెచ్.ఎస్.సి. పాసయిన తర్వాత కొలనుపాక వెళ్ళారు. అప్పటికి వూళ్ళో బడిలేదు. ఆరుట్ల సోదరుల చొరవతో రహస్య గ్రంథాలయం స్థాపించారు. అక్కడ గ్రంథాలయమంటే నిషేధం కాబట్టి 'వంటశాల' అని పేరు పెట్టారు. అక్కడ విద్యార్థులను పోగుజేసి పాఠాలు చెపుతూ, గ్రంథాలయం నడుపుతుండేవారు. కొంతకాలానికి అది వంటశాల కాదు, గ్రంథాలయమని జాగీర్దారు కనిపెట్టడంతో ప్రభుత్వం దాన్ని మూసివేసింది. కొలనుపాకలో ఉన్న జైన దేవాలయంలో పాఠశాలకు అనుమతించడంతో అక్కడ ఒక సంవత్సరంపాటు స్కూలు నడిపారు. తెలంగాణా ప్రాంతంలో ఆంధ్ర మహాసభ ఒక ఉద్యమంగా మారింది. 1943లో విజయవాడలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన "మహిళా ఆత్మరక్షణ శిక్షణా శిబిరం" నిర్వహించారు. తర్వాత భువనగిరిలో ఆంధ్ర మహాసభ 11 వ మహాసభ జరిగింది. భువనగిరి మహాసభ-రాజకీయ పోరాట వేదికగా మారింది. వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా దొరల, దేశముఖుల దౌర్జన్యాలు, నిర్బంధపు వసూళ్లకు వ్యతి రేకంగా ఉద్యమానికి పిలుపునిచ్చింది. 1944లో వారికి సంతానం కలిగింది. విప్లవ్ పుట్టాడు. 1945లో రామచంద్రారెడ్డిగారు అరెస్టయ్యారు. 1946లో నల్లగొండ జిల్లాలో మార్షల్‌లా, నిర్బంధం పెరిగింది. కొంతకాలం కృష్ణాజిల్లా పల్లెటూరులో (వెల్లటూరు) వున్నారు. 1947లో భువనగిరి-ఆలేరు ప్రాంతాల్లో ఎ.ఆర్.తో దళాల్లో పనిచేశారు. తుపాకి శిక్షణ పొందారు. యూనియన్ సైన్యాలు వచ్చిన తర్వాత కమ్యూనిస్టు పార్టీ మీద దాడులు పెరిగాయి. దళ నిర్మాణం దెబ్బతింది. ప్రజల సహకారం, ప్రభుత్వ నిర్బంధం, దౌర్జన్యాల కారణంగా కొంతమంది చనిపోయారు. కొంతమంది ఆత్మరక్షణ కోసం అడవుల్లోకి పోయారు. ఒకరోజు చల్లూరు గుట్టల్లో ఉన్న కమలాదేవి, ఆరుట్లను మిలిటరీ చుట్టుముట్టింది. ఎ.ఆర్. పట్టుబడితే ప్రాణాపాయం. కానీ ఒంటరిగా ఉన్న కమలాదేవిని విడిచి వెళ్ళడానికి అంగీకరించలేదు. ఎలాగో వాళ్ళ కంటబడకుండా తప్పించుకున్నారు. ఆలేరు వద్ద పోలీసులకు చిక్కారు. ఎ.ఆర్.ను ఖమ్మం క్యాంపుకు, కమలాదేవిని వరంగల్ జైలుకు పంపారు. కేసు పెట్టారు. వరంగల్ జైల్లో సంవత్సరం వున్నాను. అక్కడ నుండి ఔరంగాబాదు జైలుకు మార్చారు. అక్కడ దాదాపు సంవత్సరం పైగా ఉన్నారు. తిరిగి సికింద్రాబాదు జైలుకు తీసుకొచ్చారు. ఆయుధాలు కలిగి వున్న నేరం మోపి స్పెషల్ కోర్టులో కేసు నడిపారు. అయితే అది రుజువు కాలేదు.



1951 చివరిలో విడుదలై ఎన్నికల్లో పాల్గొన్నారు. 1952 మొదటి ఎన్నికల్లో భువనగిరి నుండి కమలాదేవి శాసనసభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత వరుసగా మూడుసార్లు శాసనసభ్యురాలిగా ఆలేరు నుండి ఎన్నికయ్యాను. 1967 వరకు ఎం.ఎల్.ఎ.గా వున్నారు. 1962లో బలమైన ప్రతిపక్ష పార్టీగా విజయం సాధించారు. సుందరయ్యగారు ప్రతిపక్ష నాయకులుగా కమలాదేవి డిప్యూటీ నాయకురాలిగా పనిచేశారు. 1955లో బల్గేరియా, చెకోస్లవేకియా, జి.డి.ఆర్, ఆస్ట్రియా దేశాలు పర్యటించారు. తిరిగి 1983లో ఎ.ఆర్ తోపాటు సోవియట్ యూనియన్ పర్యటించారు. వీరు చేసిన పోరాటం ద్వారా ఎంతో కొంత మేలు ప్రజలకు చేశామన్న సంతృప్తి వుంది. అన్నిటికంటే వారికి బాధాకరమైన విషయం.. తెలంగాణా విముక్తి పోరాటాన్ని భారత స్వాతంత్ర్య సమరంలో భాగంగా గుర్తించకపోవడం!